# కథామంజరి

## పది కథల సమాహారం



అక్టోబర్ 2026

# కథామంజరి

## పది కథల సమాహారం



కథా మార్గదర్శి

**అక్టోబర్ 2026**

సంపుటి : 7 ♦ సంచిక : 10



# అందరికీ
# దసరా
# శుభాకాంక్షలు

## కథామంజరి
## స్వర్గీయ నాగుల సన్యాసిరావు స్మారక కథల పోటీలు - 2026

# విజేతలు



**కందలగడ్డ పావని** - **"ఒక ప్రేమకథ"** (ఆగస్టు 2026 ప్రచురణ)

స్వస్థలం కడప. మెకానికల్ ఇంజినీరింగ్ చదివి, వార్డు అమెనిటీస్ సెక్రటరీగా సచివాలయంలో పని చేస్తున్నారు. తెలుగు కథ మీద ఉన్న ఆసక్తితో కథలు  రాస్తున్నారు.



**పద్మావతి రాంభక్త** - **"నడిచే శవాలు"** (ఆగస్టు 2026 ప్రచురణ)

బి.ఎస్సి., బి. ఇడి, ఏం.సి.ఏ., చదివిన పద్మావతి గారు.. 2017 నుంచి కథలు వ్రాస్తున్నారు. ఇప్పటివరకు రెండు కథా సంపుటాలు, రెండు కవిత సంపుటాలు విడుదల చేశారు. డాబా తోట పెంపకం ఓ హాబీ. వాటి మీద కూడా వ్యాసాలు, లఘు చిత్రాల మీద వ్యాసాలు వ్రాస్తున్నారు. చాలా కథలకు, కవితలకు బహుమతులు, పురస్కారాలు అందుకున్న పద్మావతి గారి నివాసం విశాఖలో!



**కోయిలాడ రామమోహనరావు** - **"రెండు ఉత్తరాలు"**  (ఆగస్టు 2026 ప్రచురణ)

వీరు అనకాపల్లి ఏ.ఎం.ఏ.ఎల్. కాలేజీలో అధ్యాపకులుగా పనిచేసి పదవీవిరమణ చేశారు. కథా రచయితగా, చిత్రకారులుగా. పర్యావరణ పరిరక్షకుడుగా మంచి పేరు తెచ్చుకున్నారు. చాలా పత్రికలలో కథలకు బొమ్మలు వేస్తున్నారు. తెలుగు భాష మీద ఉన్న మమకారంతో.. ప్రాథమిక స్థాయి నుంచి కాలేజీ విద్యార్థుల వరకు తెలుగు భాష మీద పోటీలు, భాష పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.



**కాళీపట్నపు పేర్రాజు** - **"కాలం సాక్షిగా"** (సెప్టెంబర్ 2026)

శ్రీకాకుళం జిల్లా స్వగ్రామం మురపాక గ్రామంలో నివాసం ఉంటున్న, పేర్రాజు గారు వాసి ఉన్న 15 కథలు,సుమారు 100 వరకు కవితలు,14 బాలల కథలు, 4 వ్యాసాలు వివిధ పత్రికలలో ప్రచురింపబడ్డాయి. వీరి తండ్రిగారు శ్రీ కాళీపట్నపు కృష్ణారావు గారి నుండి అబ్బిన నఖ చిత్రాలు గీయడంలో కూడా ప్రవేశం ఉంది.



**ఎనుగంటి వేణుగోపాల్** - **"ఇక్కడ మంచి పనులకు మార్కులు పడతాయి"** (సెప్టెంబర్ 2026)

జగిత్యాల జిల్లా కేంద్రంలో పుట్టి పెరిగిన రచయిత ఎనుగంటి వేణుగోపాల్ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో ఎస్.ఏ.(ఫిజికల్ సైన్స్) ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్నారు.. సామాజిక స్పృహ, మానవీయ విలువలు, కుటుంబ బంధాలు, గ్రామీణ జీవన సౌందర్యం వంటి విభిన్న అంశాలను తన రచనల్లో ఆవిష్కరిస్తూ, పాఠకుల ప్రశంసలు పొందిన రెండువందలకు పైగా కథలను వివిధ పత్రికలు ప్రచురించాయి. ఆయన రచనలకు అనేక పోటీల్లో బహుమతులు, సాహితీ సంస్థల సన్మానాలు, ప్రభుత్వ పురస్కారాలు లభించాయి. ఇప్పటివరకు 13 పుస్తకాలు వెలువరించారు. తొమ్మిది కథాసంపుటాలు ఉన్నాయి. "రచయితను అతని రచనలే పాఠకులకు పరిచయం చేయాలి" అనే నమ్మకంతో నిరంతరం సాహిత్య సృష్టిలో కొనసాగుతున్నారు.



# మా జట్టు

సంపాదకుడు

జయంతి ప్రకాశ శర్మ

ప్రచురణ కర్త

అవసరాల వెంకటరావు

సంపాదక సహకారం

ఎం.ఏ. పద్మనాభరావు

కృపాకర్ పోతుల

నండూరి సుందరీ నాగమణి

ప్రచురణా సహకారం

ఎం.ఎల్. కాంతారావు

సాంకేతిక సహకారం

Harbinger Publishing

బొమ్మలు

కొయిలాడ రామ్మోహనరావు

కొచ్చెర్ల వి.ఆర్.

సూరంపూడి చలపతిరావు

***

# కథామంజరి శ్రావ్యసంచిక



## ఈ నెల శ్రావ్యసంచికకి సహకారం అందించిన గళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వరరావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్నగారు
- అవసరాల వెంకటరావు గారు
- చీమలపాటి శ్రీనివాసరావు గారు
- సమ్మెట ఉమాదేవి గారు
- పసుమర్తి వల్లీకృష్ణ గారు
- నందిరాజు పద్మలతా జయరాం గారు

**శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి**

## శీర్షికలు


కథాకీయం ... ... ... ... ... ... i

విశిష్ట అతిథి ... ... ... ... ... ... ii

కథా మార్గదర్శి ... ... ... ... ... ... iii

కథాపుస్తక విశ్లేషణ ... ... ... ... ... ... iv

వినదగునెవ్వరు చెప్పిన .. ... ... ... ... ... ... v


## కథలు


పగటి వేషగాడు ... వేలూరి ప్రమీలాశర్మ ... ... 1

నగరంలో ఓ సాయంత్రం! ... ఎస్వీకె. సంహితానాయుడు ... 7

తంబురా! ... కర్లపాలెం హనుమంతరావు ... 13

దిగ్దర్శనం ... తోట సుబ్రహ్మణ్యం ... ... 21

నాయిన మన ఊరు పోదాం! ... సి. వి. శాస్త్రి ... ... ... 27

పాపప్రక్షాళన ... మాధవి బైటారు ... ... ... 32

అపహాస్యం! ... మహంకాళి స్వాతి ... ... 40

చీకటంటే భయమా? ... నారంశెట్టి ఉమామహేశ్వరరావు ... 43

భవతీ భిక్షాందేహి...! ... తురగా జయశ్యామల ... ... 46

మద్రాసు ఏమయేటట్టు? ... వాసిరెడ్డి నారాయణరావు ... 53


Cover Page Credit : Ms Johannes Andersson, Sweden



# కథాకీయం

మొన్నీమధ్య ఓ పత్రిక నవలల పోటీల ప్రకటనలో.. ముఖ్యమైన నిబంధన చూసి ఆశ్చర్యం వేసింది. నిజానికి ఈ పరిస్థితి ఎప్పుడో ఒకప్పుడు వస్తుందని ఊహించి, పలు సందర్భాల్లో ప్రస్తావించడం కూడా జరిగింది. ఇంతకీ ఆ నిబంధన ఏమిటంటే.. "ఏఐ ద్వారా రచించిన నవలలు పోటీలకు అంగీకరించబడవు" అని స్పష్టంగా ప్రకటించింది. అంటే ఈ కృత్రిమ మేధస్సు ద్వారా రచనలు వచ్చేస్తున్నాయన్నమాట! హతోస్మి! అతి వేగంగా మానవాళిని ఆక్రమించుకుంటున్న, కృత్రిమ మేధస్సు అనే భస్మాసుర హస్తం మనిషి నెత్తి మీదకు రావడానికి మరెంతో సమయం పట్టకపోవచ్చును! ఈ నేపథ్యంలో.. 14.09.2026 తేదీన మైక్రోసాఫ్ట్ అధినేత శ్రీ సత్య నాదెళ్ల వ్యక్తపరిచిన అభిప్రాయన్ని ప్రతీ మనిషి తీవ్రంగా తీసుకోవాలి. ఏఐ అభివృద్ధి మానవాళికి సహాయపడేలా ఉండి, పూర్తిగా మానవుల నియంత్రణలోనే ఉండాలని స్పష్టం చేసారు. అలా లేకపోతే ఈ ఏఐ వ్యవస్థ వృథా అవుతుంది. ఏఐ కంటే మనుషులే ముఖ్యం అని కూడా స్పష్టంగా వేశారు.

అయితే ఈ రోజు (16.09.2016) ఓ కార్యక్రమంలో అమెరికాలో స్థిరపడిన ఓ తెలుగు రచయిత.. ఈ కృత్రిమ మేధస్సు మీద మాట్లాడుతూ.. "సాహిత్యపరంగా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. మీరు వ్రాద్దామనుకుంటున్న కథావస్తువును మీ శైలిలో, మీరు కోరిన విధంగా క్షణాల్లో రాసి మీకు అందిస్తుంది. కావాలనుకుంటే, మీ గొంతులో మీ రచనలను చదివి వినిపిస్తుంది." అంటూ విపులంగా వివరించారు.

సరే.. ఏఐ రంగంలో పని చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, మరోవైపు ఇతర రంగ ప్రముఖులు, ముఖ్యంగా డాక్టర్లు ఈ ఏఐ మీద తమతమ వివరణలు ఇస్తున్నారు. వీటన్నింటినీ విన్న తర్వాత.. ఖచ్చితంగా ఒక విషయం చెప్పాలి. మిగతా విషయాలు, రంగాల జోలికి వెళ్ళే తాహతు లేదు గాని, సాహిత్యపరంగా ఏఐ.. ఓ పెద్ద భస్మాసుర హస్తమే అవుతుంది. మనిషిలో ఉండే మేధస్సు, సృజనాత్మకత, సమాజం పట్ల అవగాహన.. మొదలైన అన్ని గుణాలు చచ్చు పడిపోతాయి. మిగతా రంగాల వారి ఆలోచనలు గురించి కాకుండా.. మనం సాహిత్యరంగం గురించి సీరియస్‌గా ఆలోచించవలసిన సమయం అసన్నమయిందనే చెప్పాలి.

ఈ కృత్రిమ మేధస్సును నియంత్రణ చేసుకోవాలంటే.. ముందు పిల్లి మెడలో గంట కట్టే బాధ్యత సాహితీకారులే తీసుకోవాలి. మనిషిలో ఉండే సృజనాత్మకతనూ, కళా నైపుణ్యాన్ని పాతర వేసి పాతి పెట్టి, ఈ కృత్రిమ మేధస్సుని ఈ దశలోనే ఏం చేయాలో ఆలోచించాలి. రవి గాంచని చోటుని రచయితలే చూడగలరు కాబట్టి.. ఏఐ మీద తీవ్రంగా ఆలోచించి, విషయపరిజ్ఞానం సంపాదించి.. తమ రచనలలో తప్పకుండా ప్రస్తావించాలి! భవిష్యత్తులో సాహిత్య సృష్టి చేసే మనిషి కన్ను మూత పడకుండా చూడవలసిన బాధ్యతను చేపట్టాలి!

**సంపాదకుడు**



# విశిష్ట అతిథి

**శ్రీమతి తురగా జయశ్యామల**

మన దేశానికి స్వాతంత్రం రాక ముందు నుంచే తెలుగు సాహిత్య రంగంలో.. ముఖ్యంగా కథ, నవల, కవితా రచనల ప్రక్రియలలో పేరు ప్రఖ్యాతులు పొందిన వారిలో మహిళలు కూడా చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నారు. ఆ రోజుల్లో కట్టుబాట్లు ఎక్కువగా ఉన్నా సరే, చదువుకుని మంచిచెడ్డలు తెలుసుకుని కలం పట్టుకున్న వారు ఎంతోమంది ఉన్నారు. కేవలం పేరు సంపాదించుకోవాలనే కోరికతో కాకుండా, సమాజానికి సాహిత్యం ద్వారా మంచి చేయాలనే తపనతోనే రచనా వ్యాసంగం వైపు అడుగులు వేసిన మహిళామణులు ఎందరో ఉన్నారు. అలాంటి మొన్నటి తరం రచయిత్రులలో మంచి రచనలు అందించి, పేరు సంపాదించుకున్న రచయిత్రి శ్రీమతి తురగా జయశ్యామల గారు!

మనిషి ఎదుగుదల తప్పకుండా పెరిగిన వాతావరణం మీద ఎలా ఉంటుందో.. కలం పట్టుకునే వారి ఆలోచనలు, అక్షర సృష్టి మీద కూడా వారు చదివిన సాహిత్యం యొక్క ప్రభావం ఉంటుంది. ఈ కోవలోనే జయశ్యామలగారు సాహిత్యవనంలోకి అడుగు పెట్టారు. చిన్నతనంలోనే శరత్ బాబు, ప్రేమ్ చంద్, ఠాగూర్ వంటి వారి నవలలతో పాటు కనబడిన ప్రతీ పుస్తకాన్ని చదివేవారు. చివరకు.. ఆ రోజుల్లో పొట్లాలకు వాడే కవర్ల మీద ఏదైనా కథో, విషయమో కనబడితే దాన్ని జాగ్రత్తగా చించి.. అవి కూడా చదివేవారు. ఇలా చదవడానికి ప్రోత్సహించిన వీరి అన్నయ్యగారే కథలు వ్రాయమని కూడా ప్రోత్సహించడంతో.. బాలకథలు వ్రాసి పంపితే బాలమిత్ర పత్రికలో ప్రచురణ జరిగాయి. ఆ తర్వాత వెనక్కి చూడలేదు. ఆ రోజులలో ప్రైవేట్ గా డిగ్రీ చదివిన జయశ్యామల గారిని, కలెక్టరు అవమని అందరు ప్రోత్సాహిస్తే, ఆమె ఆవైపు దృష్టి పడకుండా, చేయి తిరిగిన రచయిత్రిగా స్థిరపడిపోయారు. ఐదు దశాబ్దాల పైగా రచనారంగంలో విజయ విహారం చేస్తున్న జయశ్యామల గారు 350 పైగా కథలు, 43 నవలలు వ్రాసారు. వీటిలో కొన్ని ఇతర భాషల్లోకి అనువాదాలయ్యాయి, కొన్ని రేడియోలో ప్రసారమయ్యాయి.

1953 సెప్టెంబరు 2 తేదిన కృష్ణా జిల్లా కోరుకొల్లు గ్రామంలో మోచర్లవారి కుటుంబంలో జన్మించిన జయశ్యామల గారి భర్త శ్రీ తురగా రవీంద్ర... ప్రస్తుతం ముంబాయిలో చార్టెడ్ అకౌంటెంట్ గా స్థిరపడ్డారు. జయశ్యామల గారు గత ముప్పై సంవత్సరాలుగా ముంబాయి ఆంధ్ర మహాసభ సభ్యులుగా ఉంటూ కొద్దికాలం అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులుగా కూడా సేవలు అందించారు. అక్కడ తెలుగు భాష, తెలుగు సాహిత్యాలకు గుర్తింపు రావడానికి, ఉన్నతస్థానంలో నిలబెట్టడానికి నిరంతరం కృషి చేస్తూనే ఉన్నారు. పలు అవార్డులు, సత్కారాలు అందుకున్న శ్రీమతి తురగా జయశ్యామల గారు.. కథామంజరి కోరిన వెంటనే విశిష్ట అతిథిగా విచ్చేయడానికి అంగీకరించి, ఎన్నో సాహితీ విషయాలను పంచుకున్నందులకు ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాం.

**కథామంజరి బృందం**



# కథా మార్గదర్శి

**కీ.శే. వాసిరెడ్డి నారాయణరావు**

ఒక కథ చదువుతున్నప్పుడు.. కళ్లు చెమర్చడం, నవ్వు రావడం, ఓ రకమైన ఉద్వేగం కలగడం.. అయితే ఆ కథ ఆ రసానుభూతిని కలిగించినట్టు. అన్ని రసానుభూతులను ఒకే కథ అందించగలిగేలా రచించడం చాలా కష్టం! అలా రాయగల నైపుణ్యాన్ని సాధించిన తెలుగు రచయితల్ని వేళ్లతో లెక్క పెట్టవచ్చు! వారిలో చెప్పుకోదగ్గ రచయిత కీ.శే. వాసిరెడ్డి నారాయణరావు గారు.

నారాయణరావు గారు ఇరవై సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు.. ఓ రచయిత మీద వ్యంగ్య బాణాలు సంధించడానికి ఓ కథ రాస్తే.. అదే ఆయన్ను కథకుడిగా మార్చింది. 1951 సంవత్సరంలో ఆయన వ్రాసిన మొదటి కథ 'తీగ తెచ్చిన సంపద'.. తెలుగు స్వతంత్ర పత్రికలో ప్రచురితమయిన తర్వాతి నాలుగు సంవత్సరాలలో అరవై కథలు వ్రాశారు. దరిమిలా ముప్పై సంవత్సరాలు.. అంటే ఉద్యోగం పదవీవిరమణ చేసే వరకు రచనల జోలికి వెళ్ళలేదు. తర్వాత తిరిగి రచనా ప్రవేశం చేసి.. తొంభై ఏళ్ళ వయసులో కూడా "అనగనగా ఒక ఈగ ఇల్లలుకుతూ.. పేరు మర్చిపోయింది' పేరిట ఓ నవలిక వ్రాశారు. వనశ్రీ, నరేంద్ర, రహింషా.. మొదలగు కలం పేర్లతో రచనలు చేసిన నారాయణరావు గారు.. కథలు, సాంఘిక నవలలతో పాటు డిటెక్టివ్ నవలలు కూడా వ్రాసారు. నాటకాలంటే అమితంగా అభిమానించే నారాయణరావు గారు.. చాలా నాటిక పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. హేతువాదం, మార్క్సిజాల ప్రభావం ఉన్న నారాయణరావు గారి రచనలలో మనదేశంలో కనబడే సామాజిక అంశాలు ఎన్నో ఉంటాయి. దోపిడి విధానాలు, భ్రష్టు పట్టిన రాజకీయ వ్యవస్థ, ప్రజల అమాయకత్వం.. వంటి సహజమైన అంశాలు.. ఆయన కథల్లో కనబడతాయి. వ్యంగ్యం, వెటకారంతో పాటు.. ఆయన కథల్లో జీవితాలు, మానవీయత కనబడతాయి. ఆయన ప్రతీ రచనలో.. సమాజానికి హితమైన విషయాన్ని అందించాలనే చిత్తశుద్ధి, తపన కనబడతాయి. సామెతలు, పలుకుబడులు ఆయన రచనల్లో గుబాళిస్తాయి. ఆ రోజుల్లో కొడవటిగంటి కుటుంబరావు, చలం.. వంటి రచయితల ప్రభావం చాలామంది రచయితల్లో కనబడేది, కాని నారాయణరావు గారు.. వారిరువురి మీద అపారమైన గౌరవం, వారి రచనల అంటే ఇష్టం ఉన్నా సరే, వారి ప్రభావం పడకుండా.. తనకంటూ ఓ ప్రత్యేకతను సంతరించుకున్నారు.

15 నవంబర్ 1929న జన్మించిన నారాయణరావు గారి విద్యాభ్యాసం గుంటూరు, మద్రాసులలో జరిగి, మత్స్యశాఖలో ఉద్యోగం చేసారు. సుప్రసిద్ధ రచయిత కీ.శే. వాసిరెడ్డి సీతాదేవిగారి సోదరుడు. ఆమె రచించిన "మట్టి మనిషి" నవలను.. ప్రసిద్ధ రచయిత శ్రీ వల్లూరు శివప్రసాద్ గారు నాటకీకరించారు. విశేషమైన ప్రేక్షకుల ఆదరణ పొందిన ఆ నాటకాన్ని పుస్తకంగా రూపొందించి, హైదరాబాదులో ఆగస్టు 2, 2026 తేదిన ఆవిష్కరణ జరగబోయే ముందు రోజే.. నారాయణరావు గారింట్లో అ ప్రతి అందుకుని చూసి చాలాసేపు ముచ్చటించారు. దురదృష్టం ఆ సభలో ఆయన మృతికి సంతాపం తెలియచేయవలసి వచ్చింది.

చివరి క్షణం వరకు తను నమ్మిన సిద్ధాంతాల కోసం తపించి, శ్రమించిన మానవతావాది కీ.శే. వాసిరెడ్డి నారాయణరావు గారికి ప్రగాఢమైన నివాళులు అర్పించుకుంటున్నాం!

**కథామంజరి బృందం**



# కథాపుస్తక విశ్లేషణ

## సకల రుచుల విందు భోజనం!!




21 కథలతో వెలువడిన సుమారుగా 160 పేజీల కథాసంపుటి ఈ "విందు భోజనం!" వృత్తిరీత్యా బ్యాంకు ఉద్యోగి అయిన రాజేష్ యాళ్ల గారు రచించిన కథలతో వెలువడిన కథా సంపుటి ఇది.

తరగతి గదిలో పాఠాలను ఎంత బాధ్యతతో ఇష్టంతో బోధిస్తారో, అంతే బాధ్యతగా సామాజిక బాధ్యతను ఈ మాస్టారు నిర్వహిస్తారు. ఈ మాస్టారు పనితీరు, మిగిలిన ఉపాధ్యాయులకు నవ్వులాటగా ఉంటుంది. ఒక శిక్షణా కార్యక్రమంలో విద్యాశాఖాధికారి ఆ మాష్టారు గురించి చెప్పిన మాటలను విని అందరూ ఆలోచనల్లో పడ్డారు. ఆ కథ పేరు "భూషణం మేష్టారు".

కొందరి గురించి ఎందుకో మనకు ఒక అభిప్రాయం ఏర్పడుతుంది. అలా నా దృష్టిలో కొందరు మంచివారు గాను, కొందరు చెడ్డవారు గాను ఉండిపోతారు. అసలైన సందర్భం ఎదురైనప్పుడు.. వారి అసలు స్వరూపం తెలుస్తుంది. ఆ సందర్భాల్లోనే చెడ్డవారు అనుకున్నవారు మంచివారు గాను, మంచి అనుకున్న వారు చెడ్డవారు గాను తెలిసిపోతారు. 'కొత్త కోణం' కథ. మరి ఆ సంఘటన జరగకపోతే...!?

మరో కథ ఆపన్న హస్తం. సాకేత్ భార్యకు రెండు కిడ్నీలు చెడిపోయాయి. పది రోజుల్లో కనీసం ఒక కిడ్నీ అయినా మార్చాలి. (సాధారణంగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్లో ఒక కిడ్నీ మాత్రమే మార్చుతారు.) సాకేత్ తన కిడ్నీ ఇవ్వడానికి సిద్ధపడతాడు. ఈ చికిత్సకు చాలా ఖర్చు అవుతుంది. ఒక మామూలు ప్రైవేటు ఉద్యోగి అయిన సాకేత్, అందరి దగ్గర నుంచి సాయం కోరుతాడు. ఆ క్రమంలోనే కథానాయకుడిని కలుస్తాడు. సాకేత్ గురించిన ఆలోచనలతో కథానాయకుడు రాంగ్ సైడ్‌లో వస్తున్న లారీ వలన ప్రమాదానికి గురవుతాడు. శరీరం పైభాగం నుజ్జు నుజ్జు అవుతుంది. కింది భాగం మాత్రం బాగానే ఉంటుంది. తన కిడ్నీని సాకేత్ భార్యకు అమర్చమని చనిపోతాడు. అవయవ దానంపై ఇంకాస్త శ్రద్ధగా, కాస్త ఎక్కువ పరిశోధన చేసి రాయాల్సిన కథ. అయినా రచయిత శైలి కథను చదివిస్తుంది.

ఇలా మొత్తం 21 కథలు అన్ని వేటికవే విభిన్న ప్లాట్లతో రాయబడినవి. ప్రత్యేకించి నన్ను ఎక్కువగా ఆకర్షించిన కథ 'డ్రెస్సింగ్ టేబుల్'. విషాదాంతమైన కథ. మామూలు అంశం అయినా సరే మొదటి నుంచి చివరి వరకు వేగంగా చదివించింది. సమాజంలో ప్రస్తుతం ఎదురవుతున్న వివిధ అంశాలను, నేపథ్యాలను ఎక్కువగా పరిశీలించే ఈ రచయిత నుంచి ఇంకా మంచి మంచి కథలు చాలా ఆశించవచ్చు.

**రాంబో**



# వినదగునెవ్వరు చెప్పిన ..

కళ్ళకు ఆహ్లాదకరంగా నీలి సముద్రపు కాంతి.. రాతి గుట్టపై ఒంటరిగా గంభీరంగా నిలిచిన వృక్షం.. అంతులేని ఆకాశంలో స్వేచ్ఛగా విహరించే పక్షుల గుంపు.. వాటన్నింటికీ అడుగున రంగురంగుల తివాచీలా పరుచుకున్న పూల తోట.. ఇలా ప్రకృతి అందాల హరివిల్లుగా, ఒక సారి వెళ్ళొస్తే బాగుండు అనిపించేలా, మనసును దోచుకొనే ముఖ చిత్రంతో ఆగష్టు–2026 కథామంజరి.. నిశ్శబ్ధంగా నెట్టింట్లో వాలింది.

శాయి రాచకొండ గారు పరిచయం చేసిన 'శతకోటి సుబ్బారావు' కథ భువనచంద్ర గారి ఇతర రచనలు కూడా చదవాలనిపించేలా సాగింది.

మొదటి కథ కందలగడ్డ పావని రచించిన ఒక ప్రేమకథ. కథనం చకచకా సాగింది. సహజంగా ప్రేమకథ అనగానే యువతీ యువకుల ఆకర్షణే కాదు, అనాథ అయిన మనవరాలికి నానమ్మ అందించిన కల్మషం లేని ఆప్యాయత కూడా ఒక అద్భుతమైన ప్రేమకథే అని నిరూపించిన ఆత్మీయ కథనమిది. ఓ రెండు చోట్ల వీర్రాజును మనసులో విసుక్కున్నా, అది బాంధవ్యాల మధ్య సహజమైన చనువుగానే నిలిచింది. అయినా, నాన్నమ్మను చూస్తూ పెరిగాక కూడా, ఓ చోట ఎందుకో మనుషుల మధ్య కల్మషం లేని ప్రేమ ఉండదు అని రచయిత్రి సూత్రీకరించారు.

పద్మావతి రాంభక్త గారి "నడిచే శవాలు" కథ సమాజంలో అమాయక చిన్నారులపై జరుగుతున్న లైంగిక వేధింపులను, వాటి పట్ల మధ్యతరగతి ప్రజలు చూపే ఉదాసీనతను ఎంతో హృదయవిదారకంగా మరియు నిజాయితీగా కళ్లకు కడుతూ, మంచి సందేశాన్ని ఇచ్చింది. అయితే, మొదటిసారి వెళ్ళినప్పుడు కప్పులను టీపాయ్‌పైనే వదిలేసిన పాత్ర, తర్వాతసారి వెళ్ళినప్పుడు మాత్రం సింక్‌లో పెట్టడం తన అలవాటు అని చెప్పడం కథనంలో ఒక స్పష్టమైన లోపం! అలాగే, లోపలి వైపు మాత్రమే ఉండే ఇన్నర్స్ బ్రాండ్ పేరు దుస్తుల పైనుండి స్పష్టంగా కనిపించిందని ప్రస్తావించడం పూర్తిగా వాస్తవ దూరం మరియు రచనా లోపంగా అనిపిస్తుంది.

కోయిలాడ రామమోహనరావు గారి "రెండు ఉత్తరాలు" కథ కేవలం సుగుణ, భరద్వాజ మాస్టార్ రాసుకున్న లేఖల రూపంలో సుమారు 16 ఏళ్ల కాలవ్యవధిని, రెండు తరాల జీవితాలను మరియు ఆనాటి సామాజిక మార్పులను ఎంతో క్లుప్తంగా, ప్రభావవంతంగా ఆవిష్కరిస్తుంది. ఈ కథలోని ఆదర్శవాది అయిన గురువు కొడుకు చేసిన పాపానికి, ఆయన పెంచిన కొడుకు జైరాజ్ నిలబడి ప్రాయశ్చిత్తం చేయడం, తద్వారా గురువు రుణం తీర్చుకొని ఆయన ఆశయాలకు నిజమైన వారసుడిగా మారడం పాఠకుడి మనసును హత్తుకుంటుంది. ఈ ఉదాత్తమైన భావోద్వేగాలు, నాటకీయత మనకు కె. విశ్వనాథ్ గారి క్లాసిక్ చిత్రాలైన 'శంకరాభరణం', 'సాగర సంగమం' సినిమాలను స్ఫురణకు తెస్తుంది.

బొందల నాగేశ్వరరావు గారి "జాలి గుండె" కథ సమాజంలో పేదరికం, వృద్ధాప్య భారాలు, మరియు ఒక అమాయక చిన్నారి బాల కార్మికురాలిగా మారకుండా, మానవత్వంతో ఎలా ఆదుకోవచ్చో ఎంతో హృద్యంగా ఆవిష్కరిస్తుంది. అయితే, కథా

ప్రమాణాల పరంగా చూస్తే ప్రధాన పాత్ర యొక్క క్యారెక్టర్ హార్ట్ చాలా హఠాత్తుగా మారుతుంది. ప్రారంభంలో ఆ పండ్లమ్ముకునే వృద్ధురాలి మురికి రూపాన్ని చూసి, తీవ్ర జుగుప్సతో చేతులు కడుక్కునే పాత్ర, కేవలం ఒకే ఒక్క సంఘటనతో మనసు కరిగి, ఏకంగా వారిద్దరికీ తమ ఇంట్లోనే ఆశ్రయం కల్పించే అంతటి మహోన్నత వ్యక్తిగా మారిపోవడం నాటకీయంగా ఉండి సహజత్వాన్ని కొంత తగ్గిస్తుంది.

అనంతపట్నాయకుని కిశోర్‌గారి "చట్టంలో లేని తీర్పు" కథ, ఆధునిక సమాజంలో క్షీణిస్తున్న సామాజిక విలువలను మరియు తల్లిదండ్రుల పట్ల కొడుకుల నిరాదరణను ఎంతో ఆలోచనాత్మకంగా ఆవిష్కరించింది. కథలో కోర్టు రూమ్ డ్రామా మరియు జడ్జి గారి సుదీర్ఘ సంభాషణలు ఉపన్యాస ధోరణిలో సాగినప్పటికీ, అవి నేటి చేదు వాస్తవాలను ప్రతిబింబించడం వల్ల ఎక్కడా అసంబద్ధంగా అనిపించవు. ముఖ్యంగా, "సర్టిఫికెట్లు రద్దు చేస్తే నీ ఉనికి ఏమవుతుంది?" అనే జడ్జి గారి ప్రశ్న కొడుకులోని సామాజిక, ఆర్థిక భద్రత గురించిన భయాన్ని, అహాన్ని దెబ్బతీసి అతనిలో ఆలోచన రేకెత్తించింది; ముగింపులో అతని మార్పు నాటకీయంగా అనిపించినా, చట్ట పరిమితుల దృష్ట్యా మనస్సాక్షిని నిద్రలేపడమే ఇక్కడ అత్యుత్తమ పరిష్కారం.

వడలి రాధాకృష్ణ గారి "మండుటెండ ముసురు" కథలో వయసు మళ్లిన వృద్ధుడి మానసిక వేదనను చూపించే ప్రయత్నం జరిగినప్పటికీ, కథా ప్రమాణాల పరంగా అనేక బలహీనతలు కనిపిస్తాయి. ముఖ్యంగా, కథానాయకుడు అపవాదులను భరిస్తున్నాడనడానికి కథలో చాలా తక్కువ ఆధారాలు మరియు బలహీనమైన సన్నివేశాలు ఉన్నాయి. దీనికి తోడు, జగదాంబ కూతురైన వసుధను "తన కూతురు వసుధకు..." అని రచయిత పేర్కొనడం పాఠకులను తీవ్ర గందరగోళంలో పడేసే పెద్ద వ్యాకరణ లోపం. వియ్యంకుడు అక్రమ సంబంధం అపవాదు వేస్తున్న సున్నితమైన సందర్భంలో, ఈ అస్పష్టమైన వాక్యం కథను మరింత పక్కదారి పట్టిస్తుంది. చివరిగా, నిద్రమాత్రలు మింగకుండానే పాత్ర మగత నిద్రలోకి జారడం, కేవలం వియ్యంకుడి మరణవార్త వినగానే ఆత్మహత్య నిర్ణయాన్ని విరమించుకోవడం వంటి అంశాలు నాటకీయంగా ఉండి కథా శిల్పాన్ని పూర్తిగా దెబ్బతీశాయి!

**రాంబో**

*(సెప్టెంబర్ 2026)*

మాతృభాషసంస్కృతిని, సాహిత్యాన్ని తరతరాలకు అందించడం అనేది ప్రతి తరం చేయాల్సిన అత్యంత బాధ్యతాయుతమైన పని. ఆ బాధ్యతను సగర్వంగా తలకెత్తుకొని కథామంజరి బృందం చేస్తున్న కథాయజ్ఞం అభినందనీయం. ఆ క్రతువులోనుండి పుట్టిన సెప్టెంబర్ సంచిక చక్కని కథలతో ముందుకొచ్చింది.

కాళీపట్నపు పేర్రాజు గారు రచించిన "కాలం సాక్షిగా" కథ "కష్టపడి తిన్న ముద్దే రుచి" అనే సార్వజనీన సందేశాన్ని మనసుకు హత్తుకునేలా అందించింది. సాధారణంగా కథల్లో ఉండే పెద్ద పెద్ద మలుపులు లేదా క్లైమాక్స్ వంటి కథా లక్షణాలు ఇందులో కనిపించకపోయినా ఒక చక్కని క్యారెక్టర్ చిత్రణ కనిపిస్తుంది. సంభాషణలు అలరించినా, కొన్ని వర్ణనలు అసహజంగా ఉన్నాయి. వర్ణన కథకు బలాన్ని ఇవ్వాలి కానీ, బలవంతపు కవిత్వంలా ఉండకూడదు కదా.

ఎనుగంటి వేణుగోపాల్‌గారి " ఇచ్చట మంచిపనికి మార్కులు పడతాయి" ఒక కొత్త సాంకేతిక ప్రపంచాన్ని పరిచయం చేస్తూ, లోకంలో రీల్స్ పేరుతో జరుగుతున్న రచ్చకు అద్దం పడుతూ, మానవ సంబంధాల విలువలను తెలియజెప్పింది.

ఎంత యాప్‌లకు అలవాటు పడినా కళ్లముందు కన్నతల్లి పడిపోతుంటే బయట వాళ్లకు సహాయం చేయడానికి వెళ్ళే రియా స్వభావం కొంచెం అతిగా అనిపిస్తుంది. అంతేకాకుండా, అంతటి కఠిన ప్రవర్తన కలిగిన పాత్ర ఒక్కసారిగా మారిపోవడం అనేది బలహీనమైన పాత్ర చిత్రణను మరియు కథనాన్ని సూచిస్తుంది.

ఆదోని బాషా గారి "దాహం" కథ ద్వారా "నేటి వలపులు – నీటి బుడగలు" అనే అంశాన్ని నిరూపించడానికి రచయిత ఒక భౌతికమైన అసౌకర్యాన్ని ఎంచుకున్నారు. ఈ తరం ప్రేమల్లో లోతు లేదని, అవి చిన్న కష్టాన్ని కూడా తట్టుకోలేవని చెప్పడం ఆయన ఉద్దేశం కావచ్చు. కానీ, ప్రాణం కంటే మిన్నగా ప్రేమించానని, గంజినీళ్లు తాగైనా బతుకుతానని అన్న రాధిక... కేవలం ఒక గంట దాహాన్ని తట్టుకోలేక, ప్రియుడి కోసం ఎదురుచూడకుండా వెళ్ళిపోవడం చాలా హాస్యాస్పదంగా అనిపిస్తుంది. ఇక కథకుడి విషయానికొస్తే, కథ అనేది అనుభవంలో నుండి పుట్టకుండా ఇలా అన్వేషణ ద్వారా సృష్టించాలనుకోవడం అతిగా అనిపించడమే కాకుండా, కొందరి రచయితల దుస్థితిని ప్రతిబింబిస్తోంది.

అనురాధ గారి "అరుంధతి" కథ సమాజంలో పెద్ద మనుషుల ముసుగులో ఉండే 'వికాస్' లాంటి వారి సంకుచిత మనస్తత్వాన్ని చక్కగా బయటపెట్టినప్పటికీ, పాత్రల చిత్రణలో కొన్ని లోపాలు కనిపిస్తాయి. జులాయి అయిన కృష్ణ పాత్రలో ఎలాంటి బలమైన ప్రేరణ లేకుండానే హఠాత్తుగా అంతటి ఉదాత్తమైన మార్పు రావడం అసహజంగా ఉంది. అలాగే, కాలనీ వాళ్లవి పుకార్లని ఒకవైపు చెబుతూనే, మరోవైపు అరుంధతి అవసరానికి ఒళ్లు అమ్ముకుందని చూపించడం పాత్ర చిత్రణలోని పెద్ద వైరుధ్యం. రచయిత్రి ఆ ఒక్క అంశాన్ని మినహాయించి ఉంటే అరుంధతి పాత్ర మరింత సహజంగా, బలంగా ఉండేది.

శ్రీనివాసరావు గారి "పాత్రమెరిగిన ఫలం" కథ నిరుపేదలకు సహాయం చేయాలనే నిస్వార్థ ఆశయాన్ని చక్కగా చాటిచెప్పినప్పటికీ, పాత్రల చిత్రణలో వాస్తవికత లోపించింది. నెలకు ఇరవై వేల రూపాయల జీతం వచ్చే ఒక సాధారణ అటెండర్, తన సొంత ఇల్లే గడవని పరిస్థితిలో ఉంటూ సమాజ సేవ కోసం అంతగా ప్రాకులాడటం కేవలం రచయిత ఊహల్లో నుండి పుట్టిన అతిగా అనిపిస్తుంది. మొత్తం మీద, సమాజంలో ఎవరికి సహాయం చేయాలో ఎంచుకోవాలనే మంచి సందేశాన్ని ఇచ్చినప్పటికీ, పాత్రల ప్రవర్తనలో లాజిక్ లోపించడం వల్ల కథనం అంతగా పండలేదు. ఇంతకీ రేవంత్ ఎవరు?

కోనే నాగ వెంకట ఆంజనేయులు గారి "కలి(సి)విడిగా..." కథలో తామిద్దరూ ఒకేసారి చనిపోతే ఆశ్రమంలోని అనాథ పిల్లలు మళ్లీ దిక్కులేనివారవుతారనే ఉద్దేశంతో సీతారాం మావయ్య, అత్తయ్యలు వేర్వేరు విమానాల్లో ప్రయాణించడం, వేర్వేరు హోటళ్లలో బస చేయడం, విడివిడిగా భోజనం చేయడం వంటి జాగ్రత్తలు కథాపరంగా వారి ఉదాత్తతను చాటినప్పటికీ, ప్రాక్టికల్‌గా చూసినప్పుడు తీవ్రమైన అతిగానూ, నవ్వు తెప్పించేదిగానూ అనిపిస్తుంది. ప్రయాణాల్లో అంతగా విడివిడిగా ఉండే ఈ దంపతులు, నిత్యం గుంటూరులోని ఆశ్రమంలో కలిసి ఉన్నప్పుడు లేదా ఒకే ఇంట్లో నివసిస్తున్నప్పుడు హఠాత్తుగా భూకంపం లాంటి ప్రకృతి వైపరీత్యం వస్తే ఇద్దరూ ఒకేసారి ప్రమాదంలో పడే అవకాశం ఉంది కదా! ఆశ్రమంలో ఒక నమ్మకమైన సెకండ్-లైన్ మేనేజ్‌మెంట్‌ను లేదా ట్రస్టీలను ఏర్పాటు చేయాలనే ప్రాథమిక ఆలోచనను పక్కనపెట్టి, పాత్రల చేత ఇలాంటి వింత నియమాలు పాటించేలా చేయడం కథా వస్తువులోని పెద్ద లోపంగా నిలుస్తుంది.

మాచిరాజు కామేశ్వరరావు గారి "స్నేహితులు" కథ పిల్లలను ఎంతగానో ఆకట్టుకునేలా, స్నేహం యొక్క విలువను మరియు జంతువుల పట్ల ప్రేమను చాలా సున్నితంగా చాటిచెప్పింది. చీకటి అడవిలో మిణుగురు పురుగులు దారి చూపించడం,

ఆవుకు దూడ పుట్టడం వంటి సన్నివేశాలు పిల్లల్లో ఒక అద్భుతమైన అనుభూతిని కలిగిస్తూ వారి హృదయాలకు హత్తుకుపోతాయి.

సాయి కమల్‌గారి "కప్పల తక్కెడ" కథ ఒకే పని మీద దృష్టి పెట్టకుండా, ఒక రంగంలో నైపుణ్యం సంపాదించకుండా, కప్పల తక్కెడలా నిలకడలేకుండా మారే మానవ నైజానికి అద్దం పడుతూ పిల్లలను అలరిస్తుంది.

విశిష్ట అతిథి అలపర్తి రామకృష్ణ గారి " అమ్మ సహించనిది", కథా మార్గదర్శి కీ.శే.వీరాజీ గారి "మంచీ-చెడ్డా" కథలు అలనాటి రచయితల కథన పద్ధతులను తెలుసుకోడానికి రిఫరెన్స్‌గా పరిగణిస్తూ ఈ నెల సమీక్షలు ముగిస్తున్నాను.

**రాంబో**

*(అక్టోబర్ 2026)*

స్వర్గీయ నాగుల సన్యాసిరావు స్మారక కథల పోటీ
ప్రత్యేక బహుమతి పొందిన కథ
జన్మదిన ప్రత్యేక సంచిక - 2026

# పగటి వేషగాడు


వేలూరి ప్రమీలాశర్మ

✆ 9492535415




గత ఇరవై సంవత్సరాలుగా సాహితీ ప్రయాణంలో కథలు, కథానికలు, నాటికలు, ధారావాహికలు, నవలికలు వ్రాస్తున్నారు.. ఇవే కాక, వివిధ సాహితీ ప్రక్రియలపై మక్కువతో పద్య రచన, గజల్స్ కూడా వ్రాసి పుస్తకాలు ముద్రించడం జరిగింది. ఇంతవరకూ వివిధ పత్రికలలో సుమారుగా 200 కథలు ప్రచురించబడగా, పలు కథల పోటీలలో బహుమతులు, పురస్కారాలు గెల్చుకున్నారు. "సాహితీ సాగరంలో నీటి బొట్టునై, సమాజానికి సందేశాన్ని ఇచ్చే కథలు వ్రాయాలి" అన్న అభిలాషతో, ఎక్కువగా వాస్తవ సంఘటనలను కథలుగా ఆవిష్కరిస్తున్నారు.

***"మా ఊరి పెద్దాయన వొద్దంతన్నా యినకుండా టిక్కేటు తీసి నన్నీ బోగీలో ఎక్కించినాడు. నన్నెవురయ్యా ఎక్కనిస్తరు అని సెబుతానే ఉండాను. యింటే గదా! యిప్పుడు సూడు ఎట్లయ్యిందో?" అంటూ కళ్ళు తుడుచుకుంటూ... గుప్పెట్లో బిగించి పట్టుకున్న బంగారు వస్తువులు పెద్దావిడ చేతికి అందించాడు.***

***అతని పరిస్థితికి నా కళ్ళల్లో గిర్రున నీళ్లు తిరిగాయి. మొదట్నుంచీ నా మనస్సాక్షి చెబుతూనే ఉంది... అతను దొంగ కాదని!***

మండు వేసవి ఎండ తీవ్రతకు ఒంట్లో ఆవిర్లు పుడుతున్నాయి!

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకోవడానికి, ఇరవై కిలోమీటర్ల దూరంనుంచి మధ్యాహ్నం మూడుగంటలకు బయలుదేరాను. వేడిగాలుల మధ్య ఆటోలో ప్రయాణం. వడదెబ్బ తగిలేట్టు అనిపించింది. వేసుకున్న డ్రెస్ మీది కాటన్ చున్నీ తీసి ముక్కూ, చెవులూ కవరయ్యేలా ముఖం చుట్టూ చుట్టుకున్నాను. ట్రాఫిక్‌ను దాటుకుంటూ గంటంపావు తర్వాత రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాను.

నిండుగర్భిణిలా ఉన్న సూట్‌కేసును చక్రాలపై లాక్కుంటూ, మొదటి ప్లాట్‌ఫామ్ పైకి చేరుకున్నాను. నేను ఎక్కాల్సిన రైలు రావడానికి ఇంకా నలభై నిమిషాలు సమయం ఉంది. తాగడానికి ఏవైనా దొరుకుతాయోమోనని చుట్టూ చూశాను. కొద్ది అడుగుల దూరంలో ఉన్న స్టాల్‌లో వాటర్‌బాటిల్స్‌తో పాటు, ఒక ప్లాస్టిక్ తొట్టెలో బటర్‌మిల్క్ ప్యాకెట్లు కూడా పేర్చి ఉన్నాయి.



చల్లని మంచినీళ్ల బాటిల్‌తో పాటు, రెండు బటర్ మిల్క్ ప్యాకెట్లు కూడా కొనుక్కుని, వెంటనే బటర్ మిల్క్ తాగేసాను. దగ్గర్లో కూర్చోవడానికి బెంచ్ ఏదీ ఖాళీ లేకపోవడంతో, సూట్‌కేసును కింద వాల్చి, దానిపైనే కూర్చున్నాను.

రైలు కరెక్ట్ టైముకే వచ్చింది. నేల ఈనినట్టున్న జనాన్ని తోసుకుంటూ, నేనెక్కవలసిన థర్డ్ ఏసి బోగీలోకి చేరుకున్నాను. డోరుకి పక్కనే సైడ్ లోయర్లో నా నెంబర్ కేటాయించబడి ఉండడంతో ఉసూరుమనుకుంటూ సీట్లో కూలబడ్డాను.

రైలు కదులుతుండగా పరుగు పరుగున వచ్చి, సామాన్లు లోపలికి విసిరి బోగీలోకి ఎక్కాడు ఒక వ్యక్తి. ఆయాసపడుతూ బోగీలోకి దూసుకువస్తున్న అతని వాలకం చూసి కొందరు నవ్వుకున్నారు. నేరుగా వచ్చి అతను నా పక్కనే కూర్చున్నాడు.

"ఇది రిజర్వేషన్ బోగీ. తెలిసే ఎక్కారా?" అని మెల్లగా అడిగాను.

తెలుసన్నట్టు తల ఊపాడు.

అతని వాలకం, వస్త్రధారణ చూసి నేను కొంచెం దూరంగా జరిగి కూర్చున్నాను.

నల్లగా, ఎత్తుగా ఉన్న అతని వయసు ముప్పై అయిదు, నలభై మధ్య ఉండొచ్చు. భుజాల కిందివరకూ జులపాల జుత్తు, ముక్కుకి నత్తు, బుర్రమీసాలు, మెడలో పెద్దపెద్ద పూసలతో గుచ్చిన రెండుదండలు, నుదుటిపై రూపాయిబిళ్ళ సైజులో బొట్టు, చెవులకు దుద్దులతో ఉన్న అతనిని దగ్గరగా చూస్తే... మొదట నాకు కొంచెం భయం వేసింది. లుంగీపై మోచేతుల కింది వరకూ చేతులున్న కాటన్ చొక్కా ధరించి ఉన్న అతని శరీరంనుంచి ముక్కవాసన వస్తోంది.

ఆ వేషం చూస్తే, చిన్నప్పుడు అమ్మమ్మగారి ఊరిలో పండుగలప్పుడు చందాకి వచ్చే పగటి వేషగాడు గుర్తొచ్చాడు. జాతరలో పగటివేషం కట్టేవాళ్ళలో, అర్ధనారీశ్వరుని వేషం అంటే నాకు చాలా ఇష్టం. ఓ వైపు ఒళ్ళంతా నీలం రంగు, నడుం చుట్టూ బిగించి కట్టిన పులిచర్మం, మెడలో చుట్టిన నాగులూ, మరోవైపు గంధం పూసుకున్న ఒంటిపై ధరించిన ఎఱ్ఱని జరీచీర, మెడలో నిండైన ఆభరణాలూ, అందమైన పూలజడ... అద్భుతమైన ఆ వస్త్రధారణ కళ్ళల్లో ఇప్పటికీ అలాగే ఉంది. తలమీదుగా వేసుకున్న ముసుగును రెండు వైపులకీ మార్చుతూ ఢమరుక నాదంతో పద్యాలు పాడుతూ వీధుల్లో తిరిగే పగటి వేషగాళ్ళని కిటికీలో కూచుని ఊచల మధ్య నుంచి చూడ్డమే కానీ, దగ్గరగా చూడలేదు. పురాణగాథల్ని పద్యాలుగా కట్టి కీర్తిస్తూ సాగే వారివైపు వింతగా చూసేదాన్ని!

"ఈ పగటి వేషగాళ్ళు మనింటి ముందు నుంచుని గానం చేస్తే, మనకి శుభం కలుగుతుంది. పళ్ళెంలో బియ్యం, మామిడిపళ్ళు పెట్టి ఉంచాను. కల్మషం లేని మనుషులు, ఆ భగవంతుడి సేవలో తరిస్తున్నారు. ఇందా... నీచేత్తో ఇవన్నీ ఇచ్చి, వారి ఆశీర్వాదం తీసుకో!" అంటూ నాచేత వారికి ఇప్పించేది అమ్మమ్మ.

దాంతో పాటు అమ్మమ్మ తన పాతవస్త్రాలూ, కొంతసొమ్మూ కూడా వారికి ఇచ్చేది.

ఇతన్ని చూడగానే ఆ జ్ఞాపకాలన్నీ కళ్ళముందు రీలులా కదిలాయి. ఆలోచనల్లో ఉన్న నా కాళ్లపై అతను చేత్తో చిన్నగా తట్టి, కాళ్లు కాస్త పక్కకు జరపమన్నట్టు సైగ చేసాడు. సీటు కిందకి తాను తెచ్చుకున్న లగేజ్‌ని సర్దుతున్నాడు. మూతి బిగించి కట్టిన ఓ సంచినీ, మాసిపోయిన ఓ పెద్ద సైజు పాత సూట్‌కేసునూ బెర్త్ కిందకి బలవంతంగా తోసాడు. ఆ సంచిలో ఏవో సీమవెండి సామాన్లున్నట్టు చప్పుడు అవడంతో.. ఎదురుగా కూర్చున్నతను గట్టిగా నవ్వాడు.

"ఇలాంటి వాళ్లు కూడా ఏసీ బోగీలో ఎక్కేస్తే, ఇక మనలాంటి వాళ్ళం ఎక్కడికి పోవాలి?" అంటూ పళ్ళు బయటపెట్టి వ్యంగ్యంగా అన్నాడు.

ఆ మాటలు తనకేమీ వినబడనట్టే నా పక్క సీటులో సగం పైకి మడిచి ఉన్న బెర్త్‌ను కిందికి వాల్చి కూర్చున్నాడతను. రాత్రి ఎనిమిది కావస్తుండగా, చేతిసంచిలోంచి స్టీలు క్యాను బయటకి తీసి, బెర్తుపై అటువైపు తిరిగి కూర్చుని తినడం మొదలుపెట్టాడు. పక్క కూపేలో పై బెర్త్ మీదున్న ఓ యువకుడు ఈ పల్లెటూరి వ్యక్తిని తన మొబైల్‌లో బంధిస్తున్నాడు. వద్దన్నట్టు కళ్ళతోనే

వారించాను. కానీ అదేమీ పట్టించుకోకుండా తానుతీసిన ఫోటోలు, వీడియోలూ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ నవ్వుకుంటున్నాడు.

అన్నం తినడం పూర్తయ్యాక చేతివేళ్ళు లోపలికి పెట్టి నాక్కొంటూ, సీటుపై పడిన మెతుకుల్ని చేత్తో అద్ది, డబ్బాలోకి వేసి మూత పెట్టాడతను. చుట్టూ ఉన్నవారు మొహం చిట్లించుకుని చూస్తున్నా, అతనికేమీ పట్టడం లేదు. 'పాపం!' అనిపించింది.

రాగిబాటిల్ లోంచి మంచినీళ్లు నోట్లోకి వంపుకొని, గరగరా శబ్దం చేస్తూ నోటినిండా పుక్కిలి పడుతుంటే, గులకరాళ్లు డబ్బాలో వేసి కదిపినట్టుగా శబ్దం వచ్చింది. అతనివైపు చూస్తే ఇబ్బంది పడతాడనిపించి, బ్లూటూత్‌లో పాటలు పెట్టుకుని, ఇయర్ బడ్స్ చెవిలో దూర్చుకుని ఇటుతిరిగి కూర్చున్నాను.

తొమ్మిదికాగానే అందరూ బెర్తులు వాల్చేశారు. నా బెర్తు మీదనుంచి అతన్ని లేవమని చెప్పి పక్క పరచుకోవడంతో, పై బెర్తు మీదకెక్కి కూర్చున్నాడు. కాస్సేపటికే నేను నిద్రలోకి జారుకున్నాను.

★★★

రైలు విజయవాడ స్టేషన్‌లో ఆగినట్టుంది. ఎక్కేవాళ్ళ గోలకి నిద్ర లేచి చూసాను. పై బెర్త్ మీద నుంచి రగ్గు కిందకి వేలాడుతోంది. విసుక్కుంటూ దాన్ని చేత్తో పైకి విసిరాను. అక్కడ అతను కనబడలేదు. దిగిపోయి ఉంటాడనుకుని బెర్త్ కిందకి వంగి చూస్తే... అతని పెట్టె, సంచీ అక్కడే ఉన్నాయి.

ట్రైను విజయవాడ వదిలి బయలుదేరుతుండగా గబగబా బోగీలోకి ఎక్కాడు. ట్రైను స్టేషన్‌లో ఎక్కువ సేపు ఆగడం వల్ల, చుట్ట ముట్టించుకోవడానికి కిందకి దిగాడని అర్థమైంది. అడ్డచుట్ట ఆర్పేసి, బోగీలోకి రాగానే ఏసీ బోగీ అవడం వల్ల అతని ఒంటి మీదున్న బట్టలతో సహా గుప్పున పొగవాసన కొట్టింది.

ఒకరిద్దరు 'ఛీ ఛీ' అని సణుక్కుంటూ, దుప్పటి మొహంమీదుగా కప్పుకుని పడుకున్నారు.

"ఇసాపట్నవేనా?" వంగుని నన్నుద్దేశించి మెల్లగా అడిగాడు.

చుట్టవాసనకి కడుపులో దేవినట్టయ్యి మొహం తిప్పుకున్నాను. ఏమనుకున్నాడో కానీ మాట్లాడకుండా పైకెక్కి పడుకున్నాడు. కాసిని మంచినీళ్లు తాగి, తిరిగి నిద్రలోకి జారుకున్నాను.

తెల్లారి నాలుగ్గంటలు కావస్తుండగా మళ్లీ అతను పైనుంచి కిందకు దిగాడు. బెర్త్ కిందున్న సంచిని చేత్తో పట్టి బర్రున లాగడంతో మెలకువ వచ్చి లేచాను. అందులోనించి ఏవో తీసుకుంటున్నాడు. విసుక్కుంటూ లేచి, తల అటువైపుకి పెట్టుకుని పడుకోబోయాను.

"సారీ!" అన్నట్టుగా నా వైపు చూసాడు.

నా కాళ్ళ మీదున్న దుప్పటి సరిచేసి, మళ్ళీ సంచిలో ఏదో వెతుకుతున్నాడు.

ఇంతలో అతనిని దాటుకుని ఓ పెద్దావిడ వాష్‌రూమ్స్ వైపుకి వెళ్ళింది. మరో ఐదు నిమిషాల తర్వాత సంచి మూతి బిగించి కట్టి, మళ్లీ బెర్త్ కిందకి తోసి అతను కూడా వాష్‌రూమ్స్ వైపుకి వెళ్ళాడు.

మెలకువ వచ్చేయడంతో అటూఇటూ దొర్లుతున్నాను. సరిగ్గా ఐదు నిమిషాల తర్వాత ఆ పెద్దావిడ డోరు దగ్గర నుంచుని, ఎవరితోనో పెనుగులాడుతూ గట్టిగా అరుస్తోంది. నాది డోరుపక్క బెర్తే కావడంతో కేకలు వినిపిస్తున్నాయి. ఆలస్యం చేయకుండా లైట్లు వేసి బోగీలోని వారినందరినీ అలర్ట్ చేసాను.

ఒక్కసారిగా బోగీలో కలకలం మొదలయ్యింది. వాష్‌రూమ్స్ బయట నుంచున్న పెద్దావిడ గట్టిగా ఏడుస్తోంది.

"ఏం జరిగింది?" అని అడిగితే... 'మెడలో ఉన్న బంగారు గొలుసూ, చేతికున్న గాజులూ ఎవరో బలవంతంగా కొట్టి లాక్కున్నారని' ఏడుస్తూ చెప్పింది. ఆ దొంగ పక్క బోగీలోకి పారిపోయాడని చెప్పడంతో కొందరు అటువైపుకి పరిగెత్తారు.

జరిగిన సంఘటనపై నలుగురూ నాలుగు రకాలుగా అనుమానం వ్యక్తం చేశారు. చివరికి అందరూ కలిసి, నా పైబెర్తు వ్యక్తినే దొంగగా నిర్ధారించారు.

"అతని వాలకం చూస్తే మొదట్నుంచీ నాకనుమానంగానే ఉంది. ఇలాంటి వాళ్ళని బోగీలోకి ఎక్కనివ్వడమే తప్పు." ఓ పెద్దమనిషి అతనే దొంగ అని కరాఖండిగా తేల్చేశాడు.

నాకెందుకో అతను దొంగ కాదని బలంగా అనిపించింది. ఒకరి వస్త్రధారణ చూసి తేలిగ్గా నిందవేయడం సబబు కాదేమో అనిపించి, అదే మాట పైకి అన్నాను.

"చిన్నపిల్లవి... లోకంపోకడ నీకేం తెలుసు? అవసరం ఎంతకైనా తెగించేలా చేస్తుంది. ఆ పెద్దావిడవేనా? ఇంకా ఎవరివైనా తస్కరించాడేమో... ఓసారి అందరం చెక్ చేస్కుంటే మంచిది!" అన్నాడు మరో పెద్దమనిషి.

అక్కడున్న మిగతావారు కూడా అతనికి వంతపాడారు. వాళ్లతో వాదించలేక మౌనం వహించాను.

ఈలోగా ఎవరో సెక్యూరిటీకి సమాచారం అందించినట్టున్నారు. కానిస్టేబుల్ బోగీలోకి వచ్చి వివరాలు అడుగుతున్నాడు. పెద్దావిడని లోపలికి తీసుకొచ్చి, కూర్చోబెట్టి కాసిని మంచినీళ్లు తాగించారు.

ఇరవై నిమిషాల తర్వాత చెదిరిన జుట్టుతో, నుదుటి పైనుంచి ఓ పక్కగా రక్తం కారుతూ అతను బోగీలోకి తిరిగి వచ్చాడు. మళ్లీ అందరిలోనూ ఒక్కసారిగా కలకలం...

ఆవేశంగా ఒకరిద్దరు అతను చెప్పేది వినకుండా అతనిపై చెయ్యి చేసుకున్నారు. వారికి మరో నాలుగు చేతులు తోడయ్యాయి. చోద్యం చూసేవారే తప్ప, ఎవరూ ఆపడానికి ప్రయత్నించడం లేదు. దెబ్బలకి ఒళ్లంతా కమిలిపోయి... పాపం! బట్టలు కూడా చిరిగిపోయాయి. అయినా అతను తిరిగి పైకి లేచే ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు.

చూస్తూ ఊరుకోలేకపోయాను. చెయ్యి ఆసరా ఇచ్చి అతన్ని పైకి లేవదీసాను.

"ఇలాంటి వాళ్ళమీద జాలి చూపించకూడదమ్మా" అంటున్న మిగతావాళ్ళ మాటలు పట్టించుకోకుండా గబగబా బాటిల్ మూత తీసి కాసిని మంచినీళ్లు తాగించాక అతను తేరుకున్నాడు. కృతజ్ఞతగా నాకు దణ్ణం పెట్టాడు. స్థిమితపడమన్నట్టు పైకి లేవనెత్తి బెర్తు మీద కూచోబెట్టాను.

"మా ఊరి పెద్దాయన వొద్దంతన్నా యినకుండా టిక్కేటు తీసి నన్నీ బోగీలో ఎక్కించినాడు. 'నన్నెవురయ్యా ఎక్కనిస్తరు?' అని సెబుతానే ఉండాను. యింటే గదా! యిప్పుడు సూడు ఎట్లయ్యిందో?" అంటూ కళ్ళు తుడుచుకుంటూ... గుప్పెట్లో బిగించి పట్టుకున్న బంగారు వస్తువులు పెద్దావిడ చేతికి అందించాడు.

అతని పరిస్థితికి నా కళ్ళల్లో గిర్రున నీళ్లు తిరిగాయి. మొదట్నుంచీ నా మనస్సాక్షి చెబుతూనే ఉంది... అతను దొంగ కాదని!

“ఆన్ని పట్కుని నాలుగు తన్ని తెచ్చినానమ్మా! సేతికి సిక్కకుండా పారిపోయిండు. రగతం వచ్చీలా నన్ను పట్టి లాగినా, నే ఊకోలే” అంటూ ఆయాసపడుతూ చెబుతూ, నుదుటిపైనుండి కారుతున్న రక్తాన్ని చొక్కా చేతితో తుడుచుకున్నాడు.

“చల్లగా ఉండు బాబూ!” అన్నట్టు ఆ పెద్దావిడ అతని తలపై చెయ్యి ఉంచి దీవించింది.

అక్కడున్నవారందరికీ జరిగిందేంటో మెల్లగా అర్థమయ్యింది. చప్పుడు చెయ్యకుండా ఎవరి సీట్లోకి వాళ్ళు వెళ్ళి కూచున్నారు.

దొంగని ప్రతిఘటించి, రక్తం కారుతున్నా దెబ్బలను లెక్కచేయకుండా ప్రాణాలకు తెగించి, వస్తువులు తిరిగి లాక్కున్న అతన్ని చూస్తే... జాతర సమయంలో కాళికాదేవి వేషం కట్టిన పగటివేషగాడిలా కనిపించి చేతులెత్తి దణ్ణం పెట్టాను.

కల్మషం తెలీని ఇలాంటి వ్యక్తుల్ని అవహేళన చేసే లోకం మీద కోపంతో చాలా అసహనంగా అనిపించింది. బ్యాగ్‌లోంచి పుస్తకం, పెన్నూ తీసి అతనిరూపాన్ని గీతల్లో బంధించే ప్రయత్నం చేసాను.

స్వర్గీయ నాగుల సన్యాసిరావు స్మారక కథల పోటీ
ప్రత్యేక బహుమతి పొందిన కథ
జన్మదిన ప్రత్యేక సంచిక - 2026

# నగరంలో ఓ సాయంత్రం!


## ఎస్వీకె సంహితానాయుడు

✆ 92472 78740




ఇంకా విద్యార్థి దశలో ఉన్న వీరి రచనా అనుభవం.. 20 కవితలు, 20 సినిమా సమీక్షలు, 10 కథలు, 8 వ్యాసాలు (జాతీయ అంశాలపై), 15 వివిధ అంశాలపై అభిప్రాయాలు మరియు ఇతర రచనలు చేశారు. వ్రాసిన కథల్లో చాలా వాటికి బహుమతులు వచ్చాయి. తెలుగు రాష్ట్రాలలో వివిధ సాహితీ సంస్థలూ నిర్వహించిన సదస్సుల్లో పాల్గొని ప్రసాంశా పత్రాలు అందుకున్నారు. ఈ దశ నుంచి తెలుగు రచనలు చేయడంలో మంచి పేరు సంపాదించ కోవడం చాలా అభినందనీయమైన విషయం అని చెప్పాలి.

***రిటైర్ అయిన తర్వాత మిగిలిన మా జీవితకాలాన్ని చుట్టూ వున్న సమాజం కోసం వినియోగించడం, ఇన్నేళ్ల మా అనుభవం, పరిణతితో మా చుట్టుపక్కల వున్న మనుషుల్ని సరిదిద్దడం, పరిస్థితుల్ని చక్కబెట్టడం కూడా సంఘజీవులుగా మావంటి రిటైర్ అయినవారు తప్పకుండా నిర్వర్తించాల్సిన బాధ్యత అని నేను భావిస్తాను.***

రామచంద్రరావు ప్రభుత్వశాఖలో ఒక ఉన్నత అధికారిగా రిటైరై రెండేళ్లు దాటింది.

ముప్పై అయిదేళ్లపాటు ఫైళ్లు, సంతకాలు, మీటింగులు, ఫోన్ కాల్స్‌తో తీరిక లేకుండా గడిపిన ఆయనకు... ఇప్పుడు ఇంట్లో ఖాళీగా కూర్చోవడం నరకంలా అనిపిస్తోంది. ఆయన భార్య జానకమ్మ. పిల్లలిద్దరూ అమెరికాలో స్థిరపడ్డారు. విశాలమైన ఇంట్లో ఆ ఇద్దరు వృద్ధులు, వారి నీడలు మాత్రమే మిగిలాయి.

"జానకీ... ఉద్యోగంలో ఉన్నప్పుడు 'ఆదివారం ఎప్పుడొస్తుందా...' అని ఎదురుచూసేవాడిని! ఇప్పుడు రోజులూ, వారాలూ అన్నీ ఆదివారాల్లాగే ఉన్నాయి. కాలం కదలడం లేదు, నన్ను వెక్కిరిస్తోంది!" అనేవాడు రామచంద్రరావు తరచూ.

కానీ 'ఆరోజు' సాయంత్రం అలా గడవలేదు. ఆ సాయంత్రం వాళ్ళు నగరంలోని అత్యంత రద్దీగా ఉండే ఒక కమర్షియల్ వీధికి వెళ్లారు. అక్కడ ఒక వైపు పెద్ద పెద్ద జ్యువెలరీ షోరూమ్‌లు, మరో వైపు ట్రాఫిక్ పోలీసుల హడావుడి ఉంది.

ఒక పెద్ద జ్యువెలరీ షోరూమ్ ముందు ఒక నిగనిగలాడే ఖరీదైన 'ఆడి' కారు ఆగి వుంది. డ్రైవర్ సీటులో ఎవరూ లేరు. కారు యజమానులు లోపలికి వెళ్లినట్లున్నారు. ఆ కారు అద్దం కొద్దిగా పగిలి వుంది. వెనుక నంబర్ ప్లేట్ కూడా కాస్త వంగి వుంది.

సరిగ్గా అదే సమయానికి ఈశ్వర్ అనే ట్రాఫిక్ పోలీస్ కానిస్టేబుల్ చేతిలో చలాన్ల బుక్కు పట్టుకుని, అక్కడికి వచ్చాడు. 'నో–పార్కింగ్'లో ఉన్న ఆ కారును చూసి చలాన్ రాయడం మొదలుపెట్టాడు.

## నగరంలో ఓ సాయంత్రం!

షోరూమ్ లోంచి అప్పుడే బయటకు వస్తున్న రామచంద్రరావు, జానకమ్మల కన్ను ఆ పోలీస్ మీద పడింది. ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. ఇద్దరి కళ్ళలో ఒక మెరుపు మెరిసింది.

కారు దగ్గరకు వేగంగా నడిచొచ్చారు ఆ వృద్ధ దంపతులు. రామచంద్రరావు ముఖంలో అప్పుడే ఏదో కొంప మునిగిపోయినంత ఆందోళన ఆవరించుకుంది.




"బాబూ... ఆపండి, ఆపండి! ప్లీజ్... చలాన్ రాయకండి!" అంటూ కంగారుగా పోలీస్ దగ్గరకు వెళ్ళాడు రామచంద్రరావు.

కానిస్టేబుల్ ఈశ్వర్ తల పైకెత్తి చూశాడు. తెల్లజుట్టు, కళ్ళజోడు, చేతిలో చిన్నసంచీతో ఉన్న రామచంద్రరావు, సంప్రదాయబద్ధంగా ఉన్న జానకమ్మలను చూస్తూ, "ఏమిటండీ ఇది? ఇంత పెద్ద బోర్డు కనిపిస్తుంటే, నో–పార్కింగ్‌లో కారు ఆపేసి వెళ్తారా? సిటీలో ట్రాఫిక్ రూల్స్ అంటే అస్సలు భయం లేకుండా పోయింది ఈ జెనరేషన్‌కి... కాదు కాదు, మీలాంటి సీనియర్ సిటిజన్స్‌కి కూడా!" అన్నాడు ఈశ్వర్ కఠినంగా.

"అయ్యో బాబూ! మేము లోపలికెళ్లి ఐదునిమిషాలే అయింది. మా ఆవిడ ఏదో చిన్న నెక్లెస్ డిజైన్ చూస్తానంటే వెళ్లాం. ఈ ఒక్కసారికి మమ్మల్ని వదిలేయండి ప్లీజ్!" అని రామచంద్రరావు చేతులు జోడించి బ్రతిమాలారు.

ఈశ్వర్ చలాన్ మెషీన్‌ను గాల్లో ఆడిస్తూ, "అందరూ ఇదేమాట చెప్తారు సార్... 'లోపలికి వెళ్లి ఐదు నిమిషాలే అయింది, రెండు నిమిషాలే అయింది' అని కథలు చెప్తారు. నో–పార్కింగ్ అంటే నో–పార్కింగ్... అంతే! రూల్ ప్రకారం వెయ్యి రూపాయలు జరిమానా కట్టాల్సిందే! జేబులోంచి వెయ్యిరూపాయలు బయటకు తీస్తేనే మీలాంటోళ్ళకి బుద్ధి వస్తుంది, నెక్స్ట్ టైమ్ కరెక్ట్‌గా పార్క్ చేస్తారు!" అన్నాడు కఠినంగా.

రామచంద్రరావు మరింత ఆవేదన చెందుతూ, సమాజంలో రిటైరైన వృద్ధులను ఎలా చూస్తారో గుర్తు చేస్తున్నట్లుగా, "బాబూ! నేను ప్రభుత్వోద్యోగం చేసి రిటైర్ అయ్యాను. సమాజంలో ఎంతో గౌరవంగా బతికాను. కనీసం నా తెల్లజుట్టుకైనా కొంచెం గౌరవం ఇవ్వండి! ఈ వయసులో మమ్మల్నిలా రోడ్డుమీద నిలబెట్టి జరిమానాలు అంటే ఎలా?" అన్నాడు కాస్త వణుకుతున్న గొంతుతో.

ఈశ్వర్ మనసులో ఒక రకమైన ఈర్ష్య, చమత్కారం మిళితమయ్యాయి. ఓసారి కారు వైపు, ఆ వృద్ధుల వైపు మార్చిమార్చి చూశాడు.

"మీరు భలేవారయ్యా పెద్దాయనా! లక్షల ఖరీదున్న కారులో తిరుగుతున్నారు, షోరూమ్‌లోకెళ్లి నగలు కొంటారు... కానీ వెయ్యి రూపాయల జరిమానా కట్టడానికి మాత్రం 'తెల్లజుట్టు, రిటైర్మెంట్' అంటూ సెంటిమెంట్లు మాట్లాడుతున్నారు! సరే... నీ వయస్సుకు, తెల్లజుట్టుకు గౌరవం ఇస్తున్నాను. గవర్నమెంట్ చలాన్ అయితే వెయ్యి అవుతుంది. ఒకపని చెయ్... నాకో రెండువందలిచ్చేసి కారు తీసెయ్... వదిలేస్తాను!" అన్నాడు గొంతు తగ్గించి, చుట్టుపక్కల చూస్తూ.

ఇక్కడే అసలు ట్విస్ట్ మొదలైంది. రామచంద్రరావుకి కావాల్సింది కూడా ఇదే! సమాజంలోని లొసుగులతో ఆడుకోవడం!

"మరి ఈ రెండువందలకి నాకు రశీదు ఇస్తారా బాబూ?" అనడిగాడు అమాయకంగా.

ఈశ్వర్ ముఖం ఒక్కసారిగా మారిపోయింది. "ఏంటీ... రశీదా? రెండు వందలకి రశీదు ఎలా ఇస్తారు సార్? అది నా ఫైన్. అంటే, రశీదు లేని ఫైన్! ఒకవేళ నీకు రూల్స్ ప్రకారం రశీదే కావాలంటే మాత్రం కచ్చితంగా వెయ్యి కట్టాలి. డిసైడ్ చేసుకో... రెండు వందలా? వెయ్యా?" అన్నాడు కోపంగా, విసుగ్గా.

"అదేంటి బాబూ! రశీదు లేకుండా డబ్బులు ఎలాగిస్తాం? చట్టప్రకారం రశీదు ఇచ్చి తీరాల్సిందే కదా? మేము పన్నులు కట్టే పౌరులం. రశీదు లేకుండా రూపాయి కూడా ఇవ్వను!" అని రామచంద్రరావు భీష్మించుకు కూర్చున్నాడు.

పోలీస్ ఈశ్వర్‌కి కోపం నషాళానికి అంటింది. పోనీ కదా, ఏదో పెద్దాయన కదాని దయదలచి, సహాయం చేద్దామని అనుకుంటే... తన దయాగుణాన్ని తప్పు పట్టినట్లు భావించాడు.

"ఓహో! మీరేనా చట్టాన్ని రక్షించేది? మీరు రూల్స్ గురించి ఎక్కువ మాట్లాడుతున్నారు పెద్దాయనా! ఉండండి... ఇప్పుడు మీకు అసలైన రూల్స్ ఏంటో చూపిస్తాను!" అంటూ కారు చుట్టూ తిరగడం మొదలుపెట్టాడు.

కారును నిశితంగా పరిశీలిస్తూ "ఇటు చూడండి... మీ కారు అద్దాలలో ఒకటి పగిలిపోయింది. దీనికి జరిమానా! వెనుక నంబర్ ప్లేట్ కూడా విరిగిపోయింది, నంబర్లు సరిగ్గా కనిపించడం లేదు... దీనికి జరిమానా! అసలు మీ దగ్గర పొల్యూషన్

సర్టిఫికేట్ ఉందా? ఉండదు! ఇన్సూరెన్స్ పేపర్లు ఉన్నాయో, లేదో? వీటన్నిటికీ కలిపి ఇప్పుడు జరిమానా ఎనిమిదివేలు అవుతుంది. రాయమంటారా చలాన్?" అని గర్జించాడు.

సమయం గడుస్తోంది...

దాదాపు ఇరవై నిమిషాలుగా ఈ 'ప్రహసనం' అలా సా...గు...తూ...నే... ఉంది. చుట్టుపక్కల జనం కూడా ఆగి, వీళ్ళవంకే వింతగా చూడటం మొదలుపెట్టారు. ఉత్కంఠ తారస్థాయికి చేరుకుంది.

రామచంద్రరావు వెనక్కితిరిగి భార్య వైపు చూశాడు. "జానకీ! చూశావా... ఈ పోలీసాయన ఎంత కఠినంగా ఉన్నారో! నువ్వైనా ఈయనకి కాస్త నచ్చజెప్పు. ఆడవాళ్ళు చెప్తే వింటారేమో!" అన్నాడు కంటితో సైగ చేస్తూ.

ఇక జానకమ్మ రంగంలోకి దిగింది. ఆ పరిస్థితినుంచి బయటపడటానికి తన చాకచక్యత ఉపయోగించేందుకు ముందుకొచ్చింది.

"అయ్యా బాబూ! మావారికి కాస్త బిపి ఎక్కువ, ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియదు. ముసలాయన... కొంచెం కనికరించండి. అయినా ఈరోజుల్లో అంతా ఆన్‌లైన్ అయిపోయాక కూడా ఇలా రోడ్లమీద వేధించడమేంటి నాయనా? మా అబ్బాయి అమెరికాలో ఉంటాడు, వాడు ఫోన్ చేశాడంటే.. సిటీ కమిషనరే స్వయంగా మా ఇంటికి వస్తారు... తెలుసా?" అంటూ కాస్త బెదిరింపు, మరి కాస్త బ్రతిమిలాడటం కలిపి 'కొత్తరాగం' అందుకుంది.

"అమ్మా! మీ అబ్బాయి అమెరికాలో ఉంటే నాకేంటి? కమిషనర్ మీ ఇంటికి వస్తే నాకేంటి? రూల్స్ అందరికీ ఒకటే. చట్టం తనపని తాను చేసుకుపోతుంది. మీరు కారు పేపర్లు చూపిస్తారా? లేక కారును సీజ్ చేయమంటారా?" అని ఈశ్వర్ మరింత పట్టుదలకు పోయాడు.

ఇలా భార్యాభర్తలిద్దరూ కలిసి, ఆ పోలీస్‌తో పెద్ద వాగ్వాదానికి దిగారు. చట్టాలు, సెక్షన్లు, నీతులు, వయసు... ఇలా అన్ని అంశాలపై చర్చ సాగింది. ఇంకొక ఇరవై నిమిషాలు అలా గడిచిపోయాయి.

ఆ పోలీస్ పూర్తిగా వారిమాటల యుద్ధంలో మునిగిపోయి, వారిద్దరినీ ఎలాగైనా బుక్ చేయాలని కసిగా పేపర్లు రాయసాగాడు.

సరిగ్గా అదే సమయానికి... అందరూ నివ్వెరబోయేలా ఓ సంఘటన జరిగింది!

ఆ రోడ్డు పక్కనే ఉన్న బస్‌స్టాప్‌లోకి ఒక సిటీబస్సు వచ్చి ఆగింది. రామచంద్రరావు చేతి గడియారం చూసుకున్నాడు. వెంటనే జానకమ్మ వైపు చూసి "జానకీ! బస్ వచ్చేసింది... ఇక పదా!" అన్నాడు బిగ్గరగా.

ఠక్కున ఇద్దరూ కలిసి ఆ పోలీస్ వైపు ఒక్కక్షణం చూసి, నవ్వుతూ చకచకా వెళ్ళి ఆ సిటీబస్సు ఎక్కేశారు. బస్సు తలుపులు మూసుకుని, ముందుకు కదిలింది.

పోలీస్ ఈశ్వర్ నోరెళ్లబెట్టాడు. చేతిలో పెన్ను, చలాన్ బుక్కు అలాగే ఉండిపోయాయి. ఆయనకు ఏం జరిగిందో అర్థం కావడానికి కొన్ని సెకన్లు పట్టింది.

ఆ కారు అసలు వారిది కాదు! కారు యజమానులు ఇంకా షోరూమ్ లోపలే ఉన్నారు. ఈ ముసలి దంపతులు కేవలం 'కాలక్షేపం' కోసమే అంతసేపు తనతో వాదించి, ఆటపట్టించి, బస్సెక్కి వెళ్లిపోయారు!

పాపం... ఆ పోలీస్ చేష్టలుడిగి, షాక్‌లో ఆ కదులుతున్న బస్సువైపు అలా చూస్తూ ఉండిపోయాడు. అతడి ముఖంలోని ఆశ్చర్యం, పరాభవం చూడముచ్చటగా ఉన్నాయి.

★★★

బస్సులో కూర్చున్న తర్వాత రామచంద్రరావు, జానకమ్మల ముఖాల్లో ఒక అద్భుతమైన విజయోత్సాహం, గుండెనిండా హాయి కనిపించాయి.

పక్కసీట్లోని ఒక యువకుడు వారి కళ్ళలోని ఆనందాన్ని, వాళ్ళు కిటికీలోంచి వెనక్కి చూస్తూ తమలో తాము నవ్వుకోవడాన్ని గమనించాడు. ఆ యువకుడు తట్టుకోలేక అడిగాడు. "ఏంటి పెద్దాయనా... మీలో మీరే అంతలా నవ్వుకుంటున్నారు? అసలు అక్కడ ఏం జరిగింది? ఆ పోలీస్ మీవైపే ఎందుకలా పిచ్చివాడిలా చూస్తున్నాడు?" అని.

రామచంద్రరావు గట్టిగా నవ్వి, "ఏంలేదు బాబూ... నిన్న ఎవరో నన్ను 'రిటైర్మెంట్ తర్వాత కాలాన్ని ఎలా గడుపుతున్నారు?' అని అడిగారు. దానికి సమాధానమే.. ఇందాక రోడ్డుపై మేమాడిన నాటకం!" అన్నాడు.

యువకుడు ఆశ్చర్యపోతూ "అంటే... ఆ కారు మీది కాదా? మీరు ఊరికినే ఆ పోలీస్‌తో గొడవ పడ్డారా? ఎందుకు సార్ అలా చేశారు?" అని అడిగాడు.

రామచంద్రరావు ముఖంలో నవ్వు మాయమై... అదేస్థానంలో ఒక గంభీరమైన భావం అలముకొంది. అదేభావంతో ఆయన చెప్పసాగాడు.

"బాబూ! మాలాంటివాళ్ళు ఉద్యోగం నుంచి 'రిటైర్' అయ్యారంటేనే... మేమిక ఉద్యోగబాధ్యతలు సక్రమంగా నిర్వహించలేమనీ, మా సేవలు తమకిక అవసరం లేదనీ, ఇకపై జీవితంలో విశ్రాంతి తీసుకోవడమే మేము చేయాల్సిన పని అనీ... మా యాజమాన్యాలు ప్రత్యక్షంగా, ఈ సమాజం పరోక్షంగా నిర్ణయించేసినట్లే కదా! రిటైర్ అయిన తర్వాత మాలాంటి వాళ్ళకు సమాజం ఇచ్చే గుర్తింపు ఏంటి? నాలుగు గోడల మధ్య కూర్చోవడం, టీవీ చూడటం, చావు కోసం ఎదురుచూడటం... ఇదేనా జీవితం?

కాదు బాబూ... నిజానికి రిటైరయిన తర్వాతే మాలాంటివాళ్ళ అసలు కర్తవ్యం మొదలవుతుందని నా అభిప్రాయం. రిటైర్ అయ్యేంత వరకూ మాకోసం, మా కుటుంబం కోసం కష్టపడతాం... వ్యక్తిగతంగా అది మా తప్పనిసరి బాధ్యత! అలాగే రిటైర్ అయిన తర్వాత మిగిలిన మా జీవితకాలాన్ని చుట్టూ ఉన్న సమాజం కోసం వినియోగించడం, ఇన్నేళ్ల మా అనుభవం, పరిణతితో మా చుట్టుపక్కల వున్న మనుషుల్ని సరిదిద్దడం, పరిస్థితుల్ని చక్కబెట్టడం కూడా సంఘజీవులుగా మావంటి రిటైర్ అయినవారు తప్పకుండా నిర్వర్తించాల్సిన బాధ్యత అని నేను భావిస్తాను.

ఈరోజు మేము చేసిన పనిలో రెండు విషయాలు ఉన్నాయి...

ఒకటి... మా కాలం గడిచింది, ఒంటరితనం మమ్మల్ని వేధించలేదు.

రెండు... ఆ పోలీసాయన డ్యూటీ పక్కనపెట్టి రెండు వందల రూపాయల లంచం కోసం ఆశపడ్డాడు. అదే చట్టప్రకారం నిజాయితీగా మొదటి ఐదు నిమిషాల్లో 'నో-పార్కింగ్ చలాన్' రాసివుంటే... మేము ఆ నాటకం ఆడలేక పోయేవాళ్ళం.

ఆయన లంచానికి ఆశపడబట్టే, మేము రూల్స్ మాట్లాడి ఆయన అహాన్ని దెబ్బతీశాం. తద్వారా లంచం అడిగేవారికి ఒక చిన్న గుణపాఠం చెప్పాం.”

అంతలో – జానకమ్మ అందుకొని, “అవును బాబూ… వయసు అయిపోయినంత మాత్రాన మెదడు పనిచేయడం ఆగిపోదు కదా! రిటైర్మెంట్ తర్వాత కాలాన్ని గడపడానికీ, సమాజం కోసం ఏదైనా మేలు చేయడానికీ… ఇలాంటి వేలాదిమార్గాలు ఉంటాయి. కాకపోతే ఎవరికీ హాని చేయకుండా, సమాజంలోని లొసుగులను చూస్తూ నవ్వుకుంటూ చేసే చిన్నచిన్న ప్రయత్నాలు ఇవి!” అంది నవ్వుతూ.

బస్సు ముందుకు సాగిపోతోంది. ఆ వృద్ధదంపతుల ముఖాల్లోని చైతన్యం, జీవితంపై ఉన్న ఉత్సాహం, సమాజం పట్ల ఉన్న మమకారం చూసి ఆ యువకుడు ముగ్ధుడైపోయాడు.

“రిటైర్మెంట్’ అనేది జీవితానికి ముగింపు కాదు… అది మరో అధ్యాయానికీ, ఒక సరికొత్త తరహా స్వేచ్ఛకీ నాంది!” అని ఆరోజు సాయంత్రం జరిగిన సంఘటన నిరూపించింది.

# తంబురా!

కర్లపాలెం హనుమంతరావు
✆ 8142283676

*"ఖామోష్!" అదిలించాడు ఆ మొరటు మనిషి. "నీ దగ్గరున్నదంతా ఇచ్చెయ్ మర్యాదగా! పైసా దాచినా... చచ్చావే నా చేతిలో!" చక్రవర్తి అంత సులువుగా లొంగే ఘటం కాదు.*
*"నేనెవర్నో తెలుసా నీకు?" గట్టిగా బెదిరించాడు.*

*"తెల్సులే బే! ఈ సందులోకి ఎందుకొచ్చావో... అదీ తెల్సు! నీకే తెలీటం లేదు నేనెవర్నో!"*

*అతడెవరో గుర్తు తెచ్చుకోటానికి శతవిధాల ప్రయత్నించాడు చక్రవర్తి.*

చక్రవర్తి ఇంటిముందో పాడుపడ్డ సత్రం ఉండేది. దానికి ఎడంగా గంగిరావి చెట్టూ, చెట్టు కింది చప్టా మీద ఏ అమ్మోరో తెలీదు కానీ... నిలబెట్టిన శిలమీద కొలువై ఉండేది. పూజాపునస్కారాలు లేని ఆ అమ్మవారికి రాత్రిళ్లు తోడుగానో... తనకే అ అమ్మోరు తోడుగానో తెలీదు కానీ... బైరాగి ఒకడు పడుకునేవాడు. ఎప్పుడైనా నిద్ర మధ్యలో మెలుకువ వస్తే, ఆ బైరాగి తంబురా వాయిస్తూ పాడుకొనే తత్వాలు వినిపించేవి. ఆ లోతైన పాటలకు అర్థాలు తెలిసే వయసు కాకపోయినా, ఆ తంబురా తీగల నుంచి వెలికి వచ్చే రాగాలు చెవిన పడితే మనసు అదోలా అయిపోయేది!

ఎవరూ అంత దిగులుగా పాడేదీ? చక్రవర్తికి చూడాలనిపించేది... కాని పదేళ్ళ పిల్లవాడిని రాత్రిళ్ళు బైటకు పోనివ్వరు కదా ఇంట్లోవాళ్ళు? అక్కడికీ కుతూహలం ఆగక అమ్మని అడిగితే, 'వాడో బైరాగోడులే. పగలంతా ఎక్కడెక్కడో తిరిగొస్తాడు. రాత్రిళ్ళు ఈ సత్రంలో పడుకొంటాడు. ఒక్కడే ఉంటాడు కదా... భయమేయకుండా అలా తంబురా వాయించుకొంటాడు' అని చెప్పేది. ఆ బైరాగి ఎలా ఉంటాడో చూడాలనిపించేది కానీ, పగలు అక్కడ కనిపించేవాడు కాదు.

ఆరోజు బడినుంచి ఇంటికి తిరిగొస్తూ సత్రం దగ్గర జనం పోగై వుంటే, చక్రవర్తి ఆసక్తి కొద్దీ ఆ గుంపులో దూరాడు. సత్రం చావిట్లో పడుకొని కనిపించాడు బైరాగి... పైనుంచీ కిందదాకా కాషాయం రంగు బట్టల్లో.. అచేతనంగా! అక్కడి వాళ్ళ మాటల్ని బట్టి అతగాడు చచ్చిపోయినట్లు అర్థమయింది. ఆ బైరాగి పక్కన పడున్న తంబురా ఆకారం చక్రవర్తి మనసులో బలంగా ముద్ర పడింది.

ఇదంతా నలభై ఏళ్ళ కిందటి ముచ్చట! పదోపడిలో పడేవరకూ ఏ చావు చింతా వుండేది కాదు చక్రవర్తికి! తిరుపతి వెళుతూ తిరుమల ఘాట్ మీదనుంచి కారు లోయలో బోల్తా పడి భార్యాబిడ్డలు పోయినప్పట్నుంచే చావుబెంగ పట్టుకుంది. పనిలో ఉన్నప్పుడు ఫరవాలేదు కానీ... విశ్రాంతిగా ఉన్నప్పుడే సమస్యల్లా!

ఒకసారిట్లాగే సింగపూర్ ట్రిప్పులో అకారణంగా మొదలయిందీ చావుభయం! విమానం టేకాఫ్ అవుతున్నప్పుడు చేతులు రెండూ చెమ్మగిల్లాయి. రాబోయే ఘోరప్రమాదాన్ని ఏశక్తీ ఆపలేదనిపించింది. గుండెల్లో దడమొదలయింది. ఊపిరి తీయటం కష్టమయింది. ఇంకొద్ది క్షణాల్లో ఏ 'బే ఆఫ్ బెంగాల్' మీదో ఎగురుతూంటాడు తను! ఖర్మ కాలి అప్పుడే ఇంజన్లు ఫెయిలయితే? వేల అడుగుల లోతుల్లో జారిపడితే? గడ్డ కట్టిన నీళ్లలో, గాలిచొరని పెట్టెలో ఇరుక్కున్న ప్రాణాలు ఇక బైటపడతాయా?



'చచ్చాక సాధించేదేముంది!'

విమానం తిన్నగా కుదురుకుని, ముందుకు సాగిన తరువాత గాని చక్రవర్తి ఆ నిస్పృహనుంచి బైట పడలేకపోయాడు.

కొన్ని నెల్ల తరువాత కలకత్తాలో ఓ హోటల్ పడకమీద మళ్లీ అదే తరహా ఇబ్బంది, గుండెలు బిగపట్టినట్లు! ఇంటికి వేల మైళ్ల దూరంలో అనామకంగా పోతానేమో... అన్న భయం చక్రవర్తిని నిలువెల్లా వణికించింది. డాక్టరు వచ్చేలోపలే ఒళ్ళు చెమటతో తడిసి ముద్దయింది. అన్ని పరీక్షలు చేసి ఆరోగ్యంగానే ఉన్నట్టు ధ్రువీకరించాడు డాక్టరు. 'ఆందోళనల వల్ల ఇల్లా జరుగుతుంది. ఇట్లాంటి సమయాల్లో మనసును మరోవైపు మళ్ళించుకోవాలి. తీరిక చేసుకొని, అలా బైట చల్లటిగాలికి తిరిగొస్తే... ఒత్తిడి తగ్గుతుంది' అని సలహా ఇచ్చాడు ఆయన.

అనుకోని కారణాల వల్ల కాన్ఫరెన్స్ వాయిదా పడ్డది. చక్రవర్తి ఇంకోరోజు హోటల్లో ఉండాల్సొచ్చింది. ఆ రాత్రి డిన్నర్ అయిన తరువాత అతను రోడ్డుకి ఆ పక్కనున్న మైదానం కేసి నడక సాగించాడు.

అమావాస్య చీకటి! ఆకాశంలో నక్షత్రాలు కాంతివంతంగా మెరుస్తున్నాయి. చల్లగాలి మనసుకు తెరిపినిస్తుంది. మైదానం దాదాపు నిర్మానుష్యంగా ఉంది. చక్రవర్తి ఓ ఖాళీబెంచీ చూసుకొని విశ్రాంతిగా చేరగిలబడ్డాడు. కానీ, ఆ చీకటిరాత్రి ఒంటరితనం మళ్ళీ అతగాడిని మృత్యుముఖం ముందు నిలబెట్టింది.

'సాంకేతిక విజ్ఞానం ఇంతలా అభివృద్ధి చెందినా, మరణానికి మందు లేకపోవడం విడ్డూరంగా ఉంది. ఎంత కీర్తిప్రతిష్టలూ, ధనసంపత్తులు కలిగి వుండీ ఏం లాభం? తానిప్పుడు మృత్యుభీతి నుంచి తప్పించుకొనే దారి లేక విలవిల్లాడుతున్నాడు!' నిస్పృహతో లేచి తిరుగు దారి పట్టాడు చక్రవర్తి.

పది అడుగులు పడ్డాయో లేదో, ఎవరో తనను వెంబడిస్తున్న భావన! గిరుక్కున వెనక్కి తిరిగి చూస్తే వీధిదీపం గుడ్డి వెల్తురులో ఒక ఆడమనిషి నిలబడి కనిపించింది.

ఎబ్బెట్టు వస్త్రధారణ. 'కావాలా... బావా?' అంటూ గారపళ్ళు బైటపెట్టి వెకిలిగా అంది. 'ఒన్ అవర్... ఓన్లీ ఫిఫ్టీ రుపీస్. హోల్ నైటుకయితే టూ ఫిఫ్టీ...' చక్రవర్తి నరాల్లో జివ్వుమని రక్తం పొంగింది. ఊహించని కొత్త అనుభవం!

భుజం మీద పడ్డ గాజుల చేతిని గభాలున విదిలించుకొని హోటల్ రూముకు వచ్చి పడ్డాడు ఎట్లాగో! చావు దుఃఖాన్ని గురించి తను ఆవేదన చెందుతుంటే ఛండాలమైన సుఖం వెంటబడింది! కొత్త కొత్త ఆలోచనల్తో వేగిపోతూ ఆ రాత్రంతా నిద్రకు దూరమయ్యాడు చక్రవర్తి... మొదటిసారి!

మర్నాడు కాన్ఫరెన్స్‌లో ఎంత మునిగితేలినా... మనసు అట్టడుగుపొరల కింద ఏదో పొరాడుతున్న ఫీలింగ్! డిన్నర్ ముగించుకొని హోటలుకు తిరిగొస్తూ, దారిలో మైదానం దగ్గర టాక్సీ దిగిపోయాడు. కాలినడకన వెళ్ళాలని ఆలోచన. నిజానికి అది నిజం కాదు. మళ్ళీ ఆ అడమనిషి కనిపిస్తుందేమోనని ఆశ!

క్రితం రాత్రి ఆలోచనలు ఇప్పుడతని మనసులో లేవు. 'చాలామంది పాకులాడే భాగోతాలే ఇవి! కాకపోతే పెద్దమనుషులు కాబట్టి చాటుమాటుగా కానిస్తారు. తను మాత్రం ఎందుకు వెనక్కు తగ్గటం!' రాజీపడ్డ మనసుతో అతగాడు... అక్కడ ఎప్పటి దాకా ఆ మనిషి కోసం ఎదురు చూశాడో! చివరికి ఆశాభంగమే ఎదురయింది!

హోటల్ గదికొచ్చి పడకమీద చేరిన తరువాత గానీ ఇంగితం మేలుకొంది కాదు. 'పేరుప్రఖ్యాతులు పుష్కలంగా గల కుబేరుల్లో తనూ ఒకడు! నడిరాత్రి చీకట్లో ఒక బజారు ఆడమనిషి కోసం అంగలార్చటం లోకం కళ్ళబడితే! ఎంత అప్రతిష్ట! కాసుతో కొండమీది కోతినైనా సులువుగా దించగల తను ఆ స్థాయికి తగ్గట్లు జీవించటమే ఉచితం!'

మూడునెలల తరువాత... మలేసియాలో ఓ ముఖ్యమైన ప్రాజెక్టు విజయవంతంగా ముగించుకొని తిరిగొస్తూ, దారిలో ముంబైలో దిగాడు చక్రవర్తి.

తన హోదాకి తూగే అందాన్ని కేతకి రూపంలో అక్కడ దాచి ఉంచాడతను. ఆమె కోసం రాధానగర్ కాలనీలో ఓ ఫ్లాట్ తీసుకొన్నాడు. మృత్యుభీతి వెంటాడి వేధించే వేళల్లో, తన కల్లోల హృదయం తలదాచుకొనేందుకే, చక్రవర్తి వళ్ళమ్ముకొని జీవించే ఒకానొక స్త్రీ దేహాన్ని అద్దెకు తీసుకొన్నాడు. ఖరీదైన బహుమతులు కిరాయిల కింద ఇచ్చుకొంటున్నాడు.

ఎయిర్పోర్ట్‌లో దిగంగానే చక్రవర్తి ముందుగా చేసిన పని... కేతకికి కాల్ చెయ్యటం! రింగవుతుంది కానీ రెస్పాన్సు లేదు. హోటలుకి వెళ్ళేదారిలో మళ్ళీ మళ్ళీ ట్రై చేసాడు. ఫలితం లేదు. తన నెంబరు చూడగానే రిసీవ్ చేసుకోవాలే! ఎందుకివాళ ఇలా కొత్తగా?

ల్యాండ్‌లైన్ నుంచి కాల్ చేసాడు, హోటలుకి వచ్చీ రాగానే! దానికీ బదులు లేకపోయేసరికి, ఒక్క వుదుటున బట్టలు మార్చుకొని, రోడ్డు మీదకొచ్చాడు.

రాత్రి ఎనిమిది దాటింది. చలికాలం... చీకటి చిక్కబడుతోంది. సన్నగా చినుకులు... సూదులు గుచ్చుతున్నట్లు! కనపడ్డ టాక్సీని ఆపి, ఎక్కడికెళ్ళాలో చెప్పాడు చక్రవర్తి. 'రాధానగర్' పేరు వినగానే, 'రావటం కుదరదు!' అంటూ చక్కా వెళ్ళిపోయాడు టాక్సీ డ్రైవర్.

హోటల్ వాళ్ళకు అద్దెకార్లుంటాయని తెలుసు. అక్కడా ఈ 'రాధానగర్' ప్రాబ్లమే. అలవాటుగా దిగే స్టార్ హోటల్... పరువు సమస్య!

చినుకులు వర్షంగా మారాయి. అక్కడి టీ బంకు ముందు ఆగివున్న ఆటో ఒకటి అడక్కుండానే చక్రవర్తి ముందుకొచ్చి ఆగింది. అడ్రస్ అప్పటికే విన్నట్లుంది డ్రైవర్ "కాలనీ లోపలిదాకా రాలేను సాబ్. రోడ్డు మీద డ్రాప్ చేస్తా కావాలంటే! మీటరు మీద వంద అవుతుంది" అన్నాడు హిందీలో.

ఆటోలో మరో శాల్తీ వున్నా ఎక్కి కూర్చున్నాడు చక్రవర్తి.

సందు మొదట్లో బండి దిగి, కేతకి ఫ్లాట్ చేరే వేళకి వర్షం కుండపోత కిందకు మారింది. కేతకిది థర్డ్ ఫ్లోర్ 'త్రీ నాట్ త్రీ'. లిఫ్ట్ చెడినట్లుంది. జనం మురికి మెట్ల దారి గుండానే తిరుగుతున్నారు. ఇంత గలీజు లొకాలిటీకి ఈ చీకటిరాత్రి చాటున వానకు తడుస్తూ రావాల్సిన దుర్గతి పట్టించినందుకు కేతకిమీద పీకల్దాకా కోపమొచ్చింది చక్రవర్తికి!

మెట్లు గబగబా ఎక్కి తలుపు కొట్టబోయాడు. అంతలోనే ఆగి, జేబునుండి తీసిన తాళంచెవితో డోర్ తెరిచి లోపలికొచ్చాడు.

లివింగ్‌రూమ్ చీకటిగా ఉంది. వారగా వేసున్న బెడ్‌రూము నుంచి... లైటులో కేతకి.. అర్ధనగ్నంగా! చేతిలో టెలిఫోన్ రిసీవర్.

కాలితో డోర్‌ను గట్టిగా తన్ని దురుసుగా లోపలికొచ్చాడు చక్రవర్తి. అనుకోని సంఘటనకు బిత్తరపోయి గభాలున లేచి నిలబడింది కేతకి. కంగారులో రిసీవర్ కింద పడింది. అవతల్నించీ ఓ మగగొంతు... కాస్సేపు!

"ఏం జరుగుతుందిక్కడ? ఎవరాడు?"

"ఎవరూ?"

"అదే నేనడిగేది? ఫోన్లో ఎవర్తోనే నీ..."

"ఛీ.. అట్లా అనద్దు ఛండాలంగా. ఫస్ట్ ఫ్లోరులో ఉంటాడా పెద్దాయన! మీరిక్కడ లేనప్పుడు తనే నాకు అండ!" రోషంగా అంది కేతకి.

"ఆహా! అలాగా! నీ పెద్దాయనకీ రాత్రివేళ అంత పనేంటో... తమరితో? నాతో నాటకాలొద్దు!" హూంకరించాడు చక్రవర్తి.

చటుక్కున తలెత్తి చూసింది కేతకి. "నాకేం ఖర్మ నాటకాలాడ్డానికి! మనవడికి బాలేక ఆసుపత్రిలో చేర్పిస్తే, చూట్టానికి వెళ్ళా! తిరిగొచ్చేటప్పుడే ఈ వర్షం. తడిసిన బట్టలు మార్చుకుంటుంటే ఆ పెద్దాయన్నుంచే ఫోనొచ్చింది! భోరుమంటున్నాడు పాపం! డబ్బవసరం... కాస్త సర్దమని ప్రాధేయపడుతున్నాడు."

"ఆహా! అయితే ఏమాత్రం సర్దుతారో దొరసానిగారీసారి?" చక్రవర్తి మాటల్లో వెటకారం.

కేతకి ముఖం ఎర్రబడింది. కళ్ళెంబడి నీళ్ళు... అవమాన భారంతో!

'ఎన్ని కాల్స్ చేసినా సెల్ ఎందుకెత్తలేద'ని గద్దిద్దామనుకొన్నాడు చక్రవర్తి. కానీ ఆలోచనలో పడ్డాడొక్కసారి. 'సెల్ ఎక్కడో పడిపోయిందనో, ఛార్జయిపోతే చూసుకోలేదనో... ఏదో ఓటి బొంకుతుందీ మహాతల్లి. కొట్లాడేందుకు ఇది సమయం కాదు. తనొచ్చిన పని కానివ్వాలి ముందు' అనుకొన్నాడు చక్రవర్తి.

లేని నవ్వు పెదాల మీదకు తెచ్చుకుంటూ, దగ్గరికొచ్చి కేతకి చుబుకం పైకెత్తి మురిపెంగా, "ఇంత రోషంలో కూడా రాణిగారెంత ముద్దొస్తున్నారో!" అంటూ జేబులోనుంచి బైటికి తీసాడు తెచ్చిన బహుమానాన్ని. ఆ పచ్చలహారం మెళ్ళో వేసే నెపంతో, ఆమెను దగ్గరకి తీసుకుంటూ "ఇహనైనా ప్రసన్నమయినట్లేనా దేవిగారు ఈ దాసుని పట్లా?" అన్నాడు నాటకీయంగా.

సుశిక్షితురాలైన బానిసలా కేతకీ మొహంలో ప్రసన్నత ప్రదర్శించింది. మెడలోని బంగారుహారాన్ని తడుముకొంటూ చిలిపిగా చూసింది చక్రవర్తి కేసి.

ఇంకే మాత్రం ఆలస్యం చేయకుండా ఆమెను పడక మీదకు చేర్చాడు చక్రవర్తి .

కిటికీలు మూసి, లైటు ఆర్పి తన దగ్గరకి చేరిన అతగాణ్ణి అడిగింది కేతకి గోముగా. "మరి ఆ పెద్దాయనకి కాస్త సర్దుదామా?"

"అదింత అంతర్జంటుగా చర్చించాలా?" కసిరాడు చక్రవర్తి.

ఆమె పట్టించుకొనే స్థితిలో లేదు. "పసిబిడ్డ ప్రాణమండీ! గుండె తరుక్కుపోతుంది ముసిలాయన్ని చూస్తే."

విసురుగా లేచి కూర్చున్నాడు చక్రవర్తి. "నంగనాచిలా అడుగుతున్నావిప్పుడు! ఇంతకు ముందెన్నిసార్లు దోచిపెట్టావో నన్నడక్కుండా!"

"దోచిపెట్టటమేంటి? ఆయనడిగింది అప్పుగానే!" ఒళ్ళు మండింది చక్రవర్తికి!

మంచం మీద నుంచి విసురుగా కిందికి దూకి, జారిపోయే లుంగీని పైకెగలాక్కుంటూ గయ్యిమన్నాడు "నేనేమన్నా వడ్డీ వ్యాపారినా? నువ్వు బొడ్డుకు కట్టుకు వెళ్ళాడే తాళాల గుత్తినా? నేనంత శుంఠను కాను అర్థమయిందా!"

ఆమెకు అర్థమయింది కానీ, ఆ సూచనలేమీ ప్రదర్శించలేదు. 'చపలచిత్తుడి మాటకు నిలకడేముంటుందిలే?' అనుకొన్నట్లు... స్తబ్దుగా మంచం మీదే వుండిపోయింది.

ఆడదాని తూష్ణీకరణ మగవాడి అహాన్ని ఎంతలా రెచ్చగొడుతుందో అప్పుడు గాని ఆమెకు తెలిసి రాలేదు.

"నీలాంటి బజారు మనుషులు గొందికొకరు దొరుకుతారే నాకు. ఉద్ధరించింది చాలు గానీ, ఇహ తట్టా బుట్టా సర్దుకో! రేపట్లోగా ఖాళీ చెయ్ ఫ్లాట్! ముందా నెక్లెస్ ఇలా పారెయ్!" అంటూ, అమాంతం అతను ఆమె మీదకు ఎగపడ్డాడు. మెడలోని హారాన్ని గుంజుకుంటుంటే కరెంటు పోయింది. కింద పడ్డ గొలుసును, ఆ చీకటిలోనే తడిమి తడిమి తీసుకొని, చొక్కా జేబులో వేసుకొంటూ రోడ్డుమీదకొచ్చిపడ్డాడు చక్రవర్తి రొప్పుకొంటూ!

బయట తుఫాన్ జోరు కొంత తగ్గింది. మెయిన్ రోడ్డు నుంచి వచ్చే గుడ్డి వెలుగులోనే బురదనీళ్ళకు ఎదురు నడుచుకుంటూ ముందుకి సాగాడు చక్రవర్తి. వీధి చివరికి వచ్చేలోగా, ఎవరో అతన్ని వెనకనుంచి సైడు కాలువలోకి తోసేశారు.

తోసిన మనిషి, చక్రవర్తి చొక్కా పట్టుకొని పైకి లేపి గట్టు మీది చీకట్లోకి ఈడ్చుకెళ్ళాడు. ఏదో పాడుపడ్డ సత్రంలాగా ఉంది. ఓ స్తంభానికి కట్టేసి చక్రవర్తి జేబులు తడమడం మొదలెట్టాడు.

"ఏం చేస్తున్నావ్!" గదిమాడు చక్రవర్తి.

"ఖామోష్!" అదిలించాడు ఆ మొరటు మనిషి. "నీ దగ్గరున్నదంతా ఇచ్చెయ్ మర్యాదగా! పైసా దాచినా... చచ్చావే నా చేతిలో!"

చక్రవర్తి అంత సులువుగా లొంగే ఘటం కాదు. "నేనెవర్నో తెలుసా నీకు?" గట్టిగా బెదిరించాడు.

"తెల్సులే బే! ఈ సందులోకి ఎందుకొచ్చావో... అదీ తెల్సు! నీకే తెలీటం లేదు నేనెవర్నో!"

అతడెవరో గుర్తు తెచ్చుకోటానికి శతవిధాల ప్రయత్నించాడు చక్రవర్తి. ఆనవాలు పడితే ఆనక పోలీస్ కంప్లయింటివ్వడం తేలికవుతుంది.

ఇంతలోనే బైటి నుంచి కేక "ఏంట్రా ఆలస్యం? బీటు పోలీసులొచ్చే టైమయింది. జల్దీ రా!"

అప్పుడర్థమయింది చక్రవర్తికి. కుట్ర! ఆ గొంతు తానొచ్చిన ఆటోడ్రైవర్ది! వీడు ఆ ఆటోలోని కో – పేసింజర్!

అప్పటికే ఆ మనిషి చేతికి చక్రవర్తి జేబులోని పచ్చలహారం తగిలింది. నవ్వుతూ దాన్ని బైటికి తీసి, గాల్లో వూపుతుంటే గట్టిగా అరిచాడు శక్తినంతా కూడదీసుకొని, "చోర్! చోర్! హెల్ప్! హెల్ప్ మీ ప్లీజ్! చోర్... చోర్!"

వెళ్ళబోయే మనిషి వెనక్కి తిరిగొచ్చి చక్రవర్తి పీక పట్టుకొన్నాడు. 'ష్... ష్! బతుకు మీద ఆశుంటే నోర్మూసుకో... అర్థమయిందా!'

బదులివ్వకుండా చేతి కట్లు విడిపించుకొనే ప్రయత్నంలో ఉన్నాడు చక్రవర్తి .

మొరటుమనిషికా మొండితనం పిచ్చకోపం తెప్పించింది. ఎడాపెడా రెండు లెంపలూ వాయించేశాడు. జేబునుంచీ తుపాకీ తీసి, చక్రవర్తి నుదుటిమీద నొక్కి పెట్టాడు.

చీకట్లో కూడా బారెల్ స్పష్టంగా కనిపిస్తోంది. చూస్తుండగానే ఫిట్టొచ్చినట్లయింది చక్రవర్తికి! గుండె దడదడలాడుతోంది. ఒళ్ళంతా చెమటలు. శరీరం ఒకపక్కకు వరిగిపోయింది. కట్టుతాళ్ళు బరువు మోయలేక తెగిపోవటంతో ఖరీదైన సూటుతో సహా చక్రవర్తి బురద నేలను కరుచుకొన్నాడు.

అతగాడి బంగారు కడియం, మనీపర్సు, ఇంపోర్టెడ్ వాచీ, పెలికాన్ టోలిడో బ్లాక్ పైలెట్ పెన్నుతో సహా, సర్వం గుంజేసుకొని పోతూపోతూ, మెత్తటి రుమాలు ఉండలా చుట్టి చక్రవర్తి నోటిలో కుక్కేశాడా మనిషి.

బైట ఆటో స్టార్టయి వెళ్ళిపోతున్న చప్పుళ్ళు.

తెరలు తెరలుగా డోకొచ్చేస్తోంది చక్రవర్తికి. రుమాలు నోటికడ్డుగా వుండటంతో ఊపిరి సలపటం లేదు. ఇంతకాలం భయపెడుతూ వచ్చిన మృత్యుదేవత చివరికి కళ్ళెదుట కొచ్చి, కరాళ నృత్యం చేస్తున్నట్లనిపించింది చక్రవర్తికి! మనసు కల్లోలసంభ్రమయింది. బైరాగితత్వాలు గుర్తు తెచ్చుకోవటానికి ప్రయత్నించాడు. ఊహూఁ! నలభై ఏళ్ళ క్రితం విన్నవి. ఒక్క ముక్కా బుర్రకు తట్టలేదు! అపస్మారకంలోకి జారిపోయాడు అలాగే మెల్లగా మూలుగుతూ!

★★★

ఎవరో తట్టినట్లు అనిపించి, మెల్లగా స్పృహలోకొచ్చాడు చక్రవర్తి! పక్కనుంచి వచ్చి పోయే బళ్ళ హెడ్‌లైట్సు కాంతికి కళ్ళు మిరిమిట్లు గొల్పుతున్నాయి, ప్రశ్న అడిగిన మనిషి ఎవరో స్పష్టంగా కనిపించలేదు.

తెలివి పూర్తిగా వచ్చిన తరువాత గానీ అర్థమయింది కాదు. తన వంకే దీక్షగా చూస్తున్నది కాషాయం బట్టల్లో ఉన్న ఓ బైరాగని!

బైరాగులు దేశ సంచారులు. ప్రాంతాన్ని బట్టి వాళ్ళు మాట్లాడగలరు. చక్రవర్తిని చూస్తే తెలుగువాడని అర్థమయింది బైరాగికి. "ఎట్లా ఉంది ఒంట్లో?" అడిగాడు ఆ బైరాగి .

పేలవంగా నవ్వాడు చక్రవర్తి. ఇప్పుడు నోట్లో గుడ్డ లేదు కానీ మాట్లాడే ఓపిక లేదు.

చొప్పకట్టెలా పడున్న చక్రవర్తిని చూసి "లేవరాదూ! ఎంత సేపిట్లా పడుంటావూ... "

"ఓపిక లేదు. చచ్చిపోతానేమోనని భయంగా ఉంది!"

కిసుక్కున నవ్వాడా బైరాగి. "ఈ కూస్త దానికే! గొప్పోడిలాగున్నావు, నీకూ భయమేనా చావంటే! భయపడే వాళ్ళనే భయపెట్టుద్ది సామీ చావు. అందరూ చచ్చేవాళ్ళే! ఆళ్ళకు లేని భయం నీకెందుకూ?"

ఆ ఒక్కవాక్యంలోనే జీవితసారమంతా ఇమిడి వుందనిపించింది చక్రవర్తికి! ఓపిక చేసుకొని లేచి కూర్చున్నాడు. బైరాగి సాయం పట్టాడు.

"ఎవర్నువ్వు? ఇక్కడేం చేస్తున్నావ్?" కృతజ్ఞత ఉట్టిపడే గొంతుతో అడిగాడు చక్రవర్తి.

"బైరాగోణ్ణి. రాత్రిళ్ళు ఈ సత్రం చావిడిలోనే పడుకొనేది. కాబట్టే నిన్నిక్కడ చూసి మురికి కాలవలోంచి బైటకు లాగింది" అన్నాడు బైరాగి.

చిన్నప్పటి బైరాగి మనసులో మెదిలాడు చక్రవర్తికి. అప్పుడతగాడు కనిపిస్తే తీర్చుకోవాలనుకొన్న సందేహం ఇప్పుడు ఈ బైరాగి ముందు పెట్టాడు... అంతా బాధలో కూడా!

“ఒక్కడివే ఉంటావ్! భయమెయ్యదా?”

“ఎందుకెయ్యదూ! ఏస్తుంది. అట్లాంటప్పుడు ఇదే నాకు తోడు” అంటూ, మూటలో నుంచి తీసి చూపించాడు తంబురా!

దారినపోయే ఆటోని ఆ బైరాగే ఆపాడు. “బండెక్కు సామీ! తిన్నగా ఇంటి కెళ్ళు! భయపడమాక! మరీ అంత భయమనిపిస్తే ఇదిగో ఇట్లాంటిదే ఏదో ఒకటి కొనుక్కొని వాయించుకో!” అన్నాడు తంబురా అందిస్తూ!

# దిగ్దర్శనం

తోట సుబ్రహ్మణ్యం
✆ 9908893669

***"ఇంట్లో కొడుకూ కోడలూ ఆనందంగా జీవిస్తుంటే, మేం మనవలతో కాలక్షేపం చేయడం మనసుకు ఎంతో హాయిగా ఉందండి. ఈ వయసులో మాకు కావలసింది ఇదే కదాండీ! ఇది మీ వల్లే సాధ్యమైందండి."***
***శరత్‌కు ఆనందంతో కళ్ళు కాస్తంత తడవకుండా ఉండడం సాధ్యం కాలేదు. ఆ తడిని వాళ్ళకు కనపడనీయలేదు.***

"శరత్ నాయుడు గారూ! నమస్కారమండీ! బాగున్నారా?" రెండుచేతులూ జోడించి పలకరించాడు రామచంద్రయ్య అనే ఓ పెద్దాయన.

మార్నింగ్ వాకింగ్ ముగించుకుని ఓ చెట్టు చుట్టూ ఉన్న అరుగు మీద కూర్చున్న శరత్ తలెత్తి చూశాడు.

రామచంద్రయ్య కూడా వాకింగ్ ముగించుకుని వస్తున్నాడు. వచ్చి శరత్ పక్కన కూర్చున్నాడు.

"ఆఁ... బాగున్నానండీ! పెద్దవారు మీరు నాకు నమస్కరించకూడదు" ప్రతి నమస్కారం చేసి అన్నాడు శరత్.

"నాది వయసుతో వచ్చిన పెద్దరికం. మీది జ్ఞానంతో పొందిన గౌరవం. దానికి నమస్కరించడం తప్పేమీ కాదులెండి!"

"ఏంటో... మీరెప్పుడూ నన్ను ఆకాశానికి ఎత్తేస్తుంటారు. నేనంత గొప్ప జ్ఞానినేమీ కాదంటే వినరు మీరు!"

"మీ రచనలు చదివిన వాడెవడూ... మీరిప్పుడు చెప్పింది అంగీకరించలేడు" అని క్షణమాగి, "మీరీ మధ్య ఏమీ రాస్తున్నట్టు లేరు... పత్రికల్లో గానీ, సామాజిక మాధ్యమాల్లో గానీ కనిపించడం లేదు!" శరత్ వైపు సంశయంగా చూస్తూ అన్నాడు రామచంద్రయ్య.

"మానేశానండి."

"మానేశారా?" ఆశ్చర్యపోతూ శరత్‌ని చూశాడాయన.

"అవునండి."

"చాలా తప్పు కదాండీ! సరైన కథావస్తువు గానీ, కవితావస్తువు గానీ మెదడుకు తట్టక విరామమివ్వొచ్చు గానీ, మానేయడం ఏమిటండీ?"

రెండుక్షణాలు నిశ్శబ్దంగా ఉండిపోయాడు శరత్.

"పాలిచ్చే ఆవు పాలివ్వాలి. కాయలు కాసే చెట్టు కాయాలి. పంట పండే పొలం పండాలి. దేని పనది చేయాలి. లేకపోతే, సృష్టి స్తంభించిపోతుంది. అలాగే, కదిలే కలం కదలాలి. ఆగిపోతే, సమాజానికి చాలా నష్టం జరుగుతుంది" తమ మధ్య నిశ్శబ్దాన్ని భంగపరిచాడు పెద్దాయన.

"కొన్ని అనుభవాలు నన్ను రాయనివ్వకుండా చేశాయండి."

"ఏంటండవి?"

"నిత్య జీవిత సంఘటనలు!"



"చెప్పిందే మరలా చెప్పినట్టుంది."

"నేను రాసేవన్నీ పచ్చి అబద్ధాలని నిజ జీవితం తెలియజేస్తోందండీ!"

"కథలు కల్పితాలే కదాండీ, నిజాలు కాదు కదా!"

"వాస్తవప్రపంచంలో మచ్చుకైనా కనిపించని పాత్రలు, సంఘటనలు కళ్ళముందు కనిపిస్తున్నట్లు రాయడం... అబద్ధాలతో పాఠకులను మోసం చేస్తున్నట్లేనండి! ముఖ్యంగా నన్ను నేను మోసం చేసుకుంటున్నట్లుంది!"

ఈసారి రాంచంద్రయ్యను నిశ్శబ్దం ఆవహించింది. కొన్ని క్షణాలు ఆలోచించి ఏదో చెప్పబోయాడు.

అప్పటికే శరత్ బయలుదేరడానికి ఉద్యుక్తుడవుతున్నాడు.

“ఒక్క నిమిషమండి” అన్నాడు రాంచంద్రయ్య.

లేచి నుంచోబోతున్న శరత్ ఆ ప్రయత్నాన్ని విరమించుకుని కూర్చున్నాడు.

“సాహిత్యం సమాజానికి దిక్సూచండి. ఆటవికమనిషి నుండి నేటిమానవుడి వరకూ ఇంత నాగరికత సాధించామంటే, అది అనేక సాహిత్య ప్రక్రియల వల్లే కదాండి!”

“నేను మానవసంబంధాల గురించీ, మానవత్వం గురించీ, నైతికవిలువల గురించీ రాస్తుంటాను. కానీ జీవితంలో... వాటిని నేను కలిగుండలేని పరిస్థితి! వాటిని ఆచరిద్దామని ప్రయత్నిస్తుంటాను. ఎదుటివారు అటువంటి అవకాశాన్నే కలగనివ్వడంలేదు. అటువంటి పరిస్థితుల్లో నేను కూడా వాళ్ళలానే ప్రవర్తించవలసి వస్తోంది.”

“మీరు రాస్తున్నట్లు, వాస్తవప్రపంచంలో లేకపోవడాన్ని మీరు చూస్తుండవచ్చు! కానీ మీరు రాసినవి ఎక్కడెక్కడో సత్ఫలితాలను ఇస్తూండవచ్చు! అది మీకు తెలియకపోతుండవచ్చు!”

“నా భార్యే ఇదొక పనికిమాలిన పనిలా భావిస్తుంటుంది. ‘ఎందుకు ఇంత శ్రమ పడతారు? కూటికా? గుడ్డకా?’ అంటుంది. ‘సమాజం కోసం’ అని నేనంటే, ‘ఇటువంటి రచనలు చదివే తీరుబడి ఎవరికుంది? ఒకరిద్దరు చదివినా, జీవితానికి అన్వయించుకునే తత్వం గానీ, ఆచరించే సహృదయం గానీ ఎవరికుంది ఈరోజుల్లో...’ అంటుంది.”

“ఆమె అదృష్టం ఆమె గుర్తించలేపోతోంది. రచనావ్యాసంగం అందరూ చేయగలిగేది కాదు. లలితకళల్లో ఒకటైన అది కలిగివున్న వ్యక్తి జీవితభాగస్వామి కావడం ఎంత అదృష్టమో తెలుసుకోలేకపోవడం ఆమె దురదృష్టం” కొంచెం సంశయిస్తూ అన్నాడు.

భార్యను అలా అంటే శరత్‌కు కోపం వస్తుందేమోనని కొంచెం భయపడ్డాడాయన.

“బొత్తిగా సాహిత్యాభిలాషలేని వ్యక్తి కాదండి. నేటి సమాజం సామాజిక మాధ్యమాల్లోని వీడియోలు, రీల్స్‌లో మునిగితేలుతోంది తప్ప, సాహిత్యం పట్ల ఆసక్తి కలిగి లేదని ఆమె అభిప్రాయం. నా కృషి, శ్రమ బూడిదలో పోసిన పన్నీరవుతోందని భావిస్తోంది.”

“మీరూ అలానే భావిస్తున్నారా?”

“రాయకుండా ఉండలేని నేను, ఆమెతో మొదట ఏకీభవించలేదు. కానీ, నేను రాసింది నేనే ఆచరించలేని దుస్థితిని తరుచుగా చవిచూసిన మీదట, ఆమెకన్నా ఎక్కువగా నా వ్యాసంగం మీద నాకే ఏవగింపు కలిగింది.”

“మీరు అనుమతిస్తే, సాయంత్రం నేను మీ ఇంటికి వచ్చి మిమ్మల్ని మా ఇంటికి తీసుకువెళ్ళాలనుకుంటున్నాను!” అన్నాడు రామచంద్రయ్య.

ఎందుకన్నట్లు ఆశ్చర్యంగా చూశాడు శరత్ అతని వైపు.

చిరునవ్వు నవ్వుతూ “ఒక్కసారి... ప్లీజ్” అన్నాడు పెద్దాయన.

కాదనలేకపోయాడు శరత్. "సరే, మీ ఇష్టం" అన్నాడు.

సాయంత్రం నాలుగుగంటలకు శరత్‌కు రామచంద్రయ్య ఫోన్ చేశాడు. అతను వస్తాడన్న విషయం మరిచిపోయాడు శరత్. పక్క ఊరిలోని తన పొలంలో మధ్యాహ్నం ఒంటిగంట వరకూ నలుగురు మనుషులతో పనిచేయించి వచ్చాడు. వ్యవసాయమే సర్వస్వంగా భావించే రైతు అతను. అందుకే రామచంద్రయ్య వస్తాడన్న విషయం అతని మెదడులో కాస్త మరుగున పడింది. ఆ ఫోన్ కాల్ తర్వాత, త్వరగా రెడీ అయి, ఆయన వచ్చేటప్పటికి సిద్ధంగా ఉన్నాడు.

స్కూటీమీద వెనక కూర్చున్న శరత్‌తో మాట్లాడుతూ డ్రైవ్ చేస్తున్నాడు పెద్దాయన.

"నాకు ఓ అమ్మాయి, అబ్బాయండి. అమ్మాయికి పెళ్ళిచేశాను. మంచి భర్తా, పిల్లాపాపలతో హాయిగా ఉంది. అబ్బాయి ఓ అమ్మాయిని ప్రేమించానన్నాడు. ఆమెకూడా వీడిని ప్రేమిస్తోందని తెలుసుకుని, వాళ్ళ పెద్దలను ఒప్పించి పెళ్ళిచేశాను."

"మీరు పెద్దవారైనా ఆధునిక ఆలోచనలు కలిగి ఉంటారన్నమాట!"

"ఇద్దరూ రెండు సంవత్సరాలు సంతోషంగా జీవించారు. ఓ మనవరాలు కూడా పుట్టింది, మొదటి జన్మదినం ఘనంగా చేశాం! ఆ తర్వాత వాళ్ళిద్దరి మధ్య ఏం గొడవలొచ్చాయో, ఏంటోనండి! చినికి చినికి గాలివాన అయినట్లు గొడవ పెద్దదైంది. ఎంత పెద్దగా అంటే, కోడలు తన బిడ్డను తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోయేటంతండి!"

ఓ పెద్ద వాహనం అడ్డు రావడంతో స్కూటీ ఆపాడాయన.

"మీరు, మీ భార్య… వాళ్ళ మధ్య గొడవలను సద్దుమణిగేలా చేయడానికి ప్రయత్నించ లేదాండీ?" శరత్ ప్రశ్నించాడు.

మెల్లగా స్కూటీని పెద్దవాహనం పక్క నుంచి పోనిచ్చి, దాన్ని దాటిన తర్వాత మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాడు రాంచంద్రయ్య.

"మొదట 'వాళ్ళే సర్దుకుంటారులే' అని, మేం కలగజేసుకోలేదు గానండీ, తర్వాత ఇద్దరికీ నచ్చచెప్పడానికి చాలా ప్రయత్నించాం! ఎంత చెప్పినా కోడలు వినలేదండి."

"ఆమె వెళ్ళిపోయిన కొన్నిరోజుల తర్వాత ఆమె కోపం తగ్గుతుంది కాబట్టి, మీరు వెళ్ళి తీసుకువచ్చే ప్రయత్నం చేయవలసిందండి. ఆమె తల్లిదండ్రులు కూడా ఏ ప్రయత్నమూ చేయలేదాండీ?"

"నేను ఫోన్ చేసి మాట్లాడుతూ ఆమె మనసు మార్చడానికి చాలా ప్రయత్నించాను. నేను అస్తమానూ ఫోన్ చేస్తున్నానని నా నెంబర్‌ని బ్లాక్ చేసింది. మావాడు, ఆమె మీద బెంగపెట్టుకుని పిచ్చోడిలా అయ్యాడు గానీ, అహం పక్కన పెట్టి ఆమెకు ఫోన్ చేయలేదు. చివరకు నేనూ, నా భార్య వాళ్ళింటికి వెళ్ళాం! ఆమె తల్లిదండ్రులు కూడా మూర్ఖత్వమే చూపించారు."

"ఏమన్నారు?"

"వాళ్ళమ్మాయి విడాకులు కోరుకుంటోందని చెప్పారు."

స్కూటీ ఓ ఇంటి ముందు ఆగింది.

"ఇదేనాండీ మీ ఇల్లు?" శరత్ అడిగాడు.

"అవునండి."

ఇద్దరూ ఇంట్లోకి వెళ్ళి హాల్లో కూర్చున్నారు.

"అమ్మా ప్రశాంతీ, ఎవరొచ్చారో చూడు" అన్నాడు రామచంద్రయ్య.

సుమారు ఓ ముప్పై మూడేళ్ళ స్త్రీ వచ్చి శరత్‌కి నమస్కరించింది. ఆమె ముఖంలో ఎంతో ఆనందం, చాలా ఆత్మీయులను చూసిన అనురాగం ప్రస్ఫుటమయ్యాయి.

"మా కోడలండి" అన్నాడు రాంచంద్రయ్య.

ఆ మాట వినగానే కలిగిన ఆశ్చర్యాన్ని అణచిపెట్టుకోవడం చాలా కష్టమైంది శరత్‌కి! పుట్టింటిలో ఉందనుకున్నామెను... అత్తింట్లో చూడ్డం అతని ఆశ్చర్యానికి కారణం!

తామిద్దరూ ఇప్పటివరకూ ఆమె గురించే మాట్లాడుకున్నారని ఆమెకు తెలియకూడదన్నది అతని ఆలోచన.

ప్రతినమస్కారం చేశాడు. "బాగున్నారా?" అని అడిగాడు.

ప్రశాంతి మాట్లాడ్డానికి కొంచెం సంశయిస్తూ "ఊఁ.." అంది.

"మనం ఇంత ఆనందంగా ఉండడానికి... ఆయనే కారణమని చెప్పమ్మా! నీకైన దిగ్దర్శనం గురించి చెప్పు." రామచంద్రయ్యకు తెలుగుభాష మీద మంచి పట్టుంది. దిగ్దర్శనమంటే, సరైన దిక్కును చూడడం!

శరత్ మరోసారి ఆశ్చర్యానికి గురయ్యాడు. తనకూ, వాళ్ళు ఆనందంగా ఉండడానికీ, ఆమె సరైన దిశను ఎంచుకోవడానికి సంబంధం ఏంటో అతనికి అర్థం కాలేదు.

"మీ దయ వల్ల నా భర్తా, ఇద్దరు పిల్లలతో సంతోషంగా ఉన్నానండి. లేకపోతే, అనవసరంగా నా జీవితం విచ్ఛిన్నమైపోయేది. పిచ్చికోపం, పనికిమాలిన అహంతో ఉన్న నన్ను... ఇంత మంచి కుటుంబానికి దూరమవకుండా చేసింది, ఆరేళ్ళ క్రితం మీరు రాసిన ఓ కథ!"

"నేను రాసిన కథా?!" మామాకోడళ్ళు ఆశ్చర్యం మీద ఆశ్చర్యం కలిగిస్తుంటే ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు శరత్.

"అవునండీ! నేను విడాకులు తీసుకోవడానికి సిద్ధమవుతున్న సమయంలో... ఓ రోజున ఏమీతోచక దినపత్రిక తిరగేస్తున్నాను. ఆ రోజు ఆదివారం అనుబంధం పుస్తకంలో ప్రచురిమైన ఓ కథకు వేసిన చిత్రం నన్నాకర్షించింది. కథ చదవడం మొదలుపెట్టాను. చివరి అక్షరం వరకూ ఆగలేదు."

"అంత బాగుందాండీ?"

"నేను విడాకుల ఆలోచన విరమించుకునేంత బాగుందండి. నా భర్తకు ఆ కథను వాట్సాప్ చేశాను. తనకు కూడా బాగా నచ్చిందని నాకు ఫోన్ చేసి చెప్పారు. దాని సారాంశం మా మధ్య దూరాన్ని తొలగించింది. అప్పటినుంచీ మీరు రాసిన కథ ఎక్కడ కనిపించినా వదలకుండా చదువుతున్నానండి."

"నేను అంతకుముందునుంచీ మీ పాఠకుణ్ణి. మా కోడలు మా ఇంటికి తిరిగివచ్చిన దగ్గర నుంచీ వీరాభిమాన పాఠకుణ్ణయ్యాను" రామచంద్రయ్య చెమర్చిన కళ్ళతో శరత్‌ను చూస్తూ అన్నాడు.

రెండు ప్లేటుల్లో అల్పాహారం తీసుకువచ్చిన అతని భార్య, వాటిని టీపాయ్ మీద పెట్టి అంది.. "ఇంట్లో కొడుకూ కోడలూ ఆనందంగా జీవిస్తుంటే, మేం మనవలతో కాలక్షేపం చేయడం మనసుకు ఎంతో హాయిగా ఉందండి. ఈ వయసులో మాకు

కావలసింది ఇదే కదాండీ! ఇది మీ వల్లే సాధ్యమైందండి."

శరత్‌కు ఆనందంతో కళ్ళు కాస్తంత తడవకుండా ఉండడం సాధ్యం కాలేదు. ఆ తడిని వాళ్ళకు కనపడనీయలేదు.

ఇంతలో ప్రశాంతి లోపలకు వెళ్ళి, పలచని ఓ పాత పుస్తకం తెచ్చింది.

"అదేం కథ?" అని శరత్ అనబోతుండగా ఆ కథ మొదటి పేజీని తెరిచి చూపిందామె.

"సరి చేసుకుందాం!" అని చదివాడు శీర్షికను. దాని క్రింద 'శరత్ నాయుడు' అనుంది.

"ఇప్పుడు చెప్పండి. రాయడం మానేస్తారా?" రాంచంద్రయ్య అడిగాడు.

"మాననండి" గద్గద స్వరంతో అన్నాడు శరత్.

బడి నుంచి ప్రశాంతి ఏడేళ్ళ కూతురు, ఐదేళ్ళ కొడుకు వచ్చారు. వాళ్ళను ఆత్మీయంగా పలకరించి దగ్గరకు పిలిచి, చెరో ఐదొందలు ఇచ్చాడు.

పెద్దలు ముగ్గురూ వద్దని వారించారు.

"నా మేనకోడలు, మేనల్లుడులకు ఇవ్వనివ్వండి" అంటూ పిల్లలకు డబ్బులిచ్చేసి పైకి లేచాడు.

ఇంతలో ప్రశాంతి భర్త వచ్చాడు. పరిచయాలు అయిన తర్వాత భార్యాభర్తలిద్దరూ శరత్ కాళ్ళకు నమస్కరించారు.

వాళ్ళను దీవించి బయటకు నడిచాడు. రామచంద్రయ్య అతన్ని అనుసరించి, స్కూటీ స్టార్ట్ చేశాడు.

ఇంట్లోకి వెళ్ళగానే, "భ్రమరాంబా, నీకో విషయం చెప్పాలి" అన్నాడు భార్యతో శరత్.

"ముందు నన్నో విషయం చెప్పనివ్వండి. మీరు రచనలు చేయడం ఆపొద్దు" అంటూ ల్యాప్‌టాప్ తెచ్చి అందించింది.

'ఈమెకూడా ఆశ్చర్యాన్నే కలిగిస్తుందేంటీ?' అనుకుని, "ఇప్పటికిప్పుడు రాసేయడానికి మీ అమ్మానాన్నలకు ఉత్తరం రాయడం లాంటిది అనుకుంటున్నావా?" అన్నాడు.

"సెల్లులు వచ్చిన తర్వాత, ముఖ్యంగా అన్‌లిమిటెడ్ టాక్‌టైం వచ్చిన తర్వాత ఎవరూ ఉత్తరాలు రాయడం లేదు గానీ, చెప్పేది వినండి. నా చిన్ననాటి స్నేహితురాలు ఫోన్ చేసింది. పదో తరగతిలో ఉన్నప్పట్నుంచీ మేమిద్దరం మాట్లాడుకోవడం లేదు."

ఎందుకన్నట్లు చూశాడతడు.

అదేం పట్టించుకోకుండా, "తనేదో ఓ పాతపత్రికలోని కథ చదివిందట. అది చదివిన తర్వాత అహం, పట్టుదల లాంటివి పక్కన పెట్టేసి, నా ఫోన్ నెంబర్ తెలుసుకుని ఫోన్ చేయాలనిపించిందట. కథ పేరూ, రచయిత పేరూ అడిగాను. అది మీ కథే..." ఆనందంగా చెప్పుకుంటూ పోతోంది భ్రమరాంబ.

అతను అవాక్కై, ఆమెను చూస్తూ, వింటూ ఉండిపోయాడు. అదే సమయంలో అతని మెదడులో ఓ మంచికథకు బీజం పడింది.

# నాయిన మన ఊరు పోదాం!

**సి. వి. శాస్త్రి**

***ప్రొప్రైటర్ కౌంటర్‌లో కూర్చొని మొబైల్ చూసుకుంటున్నాడు. కిటికీలు, తలుపులు అన్ని వేసేసారు. బయట తలుపు కూడా గొళ్లెం పెట్టారు. ఒక్కసారి కౌంటర్ వైపు దూసుకొచ్చారు. సి సి కెమెరాలని ఆపేసారు. మునియప్ప కొడుకు ప్రొప్రైటర్ చేతిలో మొబైల్ తీసి నేలకేసి కొట్టాడు. అరవబోయిన అతని నోట్లో గుడ్డలు కుక్కాడు. మునియప్ప, కొడుకు కలిసి అతని చేతులు, కాళ్ళు తాళ్ళతో కట్టేసారు. మునియప్ప కౌంటర్‌లో కర్ర తీసాడు.***

ట్రైన్ మధ్యాహ్నం మూడుగంటలకి తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఆగింది. బయట భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. స్టేషన్ కిటకిటలాడుతోంది. ఏసీ ట్రైన్‌లో దిగిన ప్రయాణికులు గిజగిజలాడిపోతున్నారు. వెయిటింగ్ హాల్స్ ఎక్కడా ఖాళీ లేవు. ప్లాట్ఫామ్ మీద ఫ్యాన్లు తిరుగుతున్నా గాలి వేడిగా వస్తోంది. స్టేషను దగ్గరలో నాలుగైదు పెద్దహోటల్స్ ఉన్నాయి. ఎక్కాల్సిన రైలుకి రెండుమూడు గంటల సమయం ఉన్న ప్రయాణికులందరూ ఆ హోటల్స్ బాటపట్టారు, ఏసీలో కాసేపు సేదతీరచ్చని! స్టేషన్ దగ్గరలో ఉన్న ఓ హోటల్లో వందమంది వరకూ కస్టమర్లు చేరారు. హోటల్లో పనిచేసే పాతిక, ముప్పైమంది స్టాఫ్ అప్రమత్తమయ్యారు.

ఎనిమిదవ టేబిల్ సర్వర్ మునియప్ప విచారంగా ఉన్నాడు. ప్రొప్రైటర్ కోపంగా చూస్తున్నాడు అతనివైపు! మునియప్పని ప్రొప్రైటర్ని మార్చిమార్చి చూస్తున్న కస్టమర్ “ఏమైందయ్యా?” అన్నాడు.

“ఏంలేదు సార్” మెల్లగా సమాధానం చెప్పి ఆర్డర్ తీసుకుని వెళ్లిపోయాడు.

ఆ రోజు జరిగినదంతా మననం చేసుకున్నాడు మునియప్ప!

ఆ ఊరికి పాతికమైళ్ళ దూరంలో ఓ పల్లెటూర్లో ఉండేవాడు. ఓ చిన్నకారు రైతు. తను, భార్య, కొడుకు, కూతురు చిన్న కంబలింట్లో ఉండేవారు. ఓ ఎకరం భూమి, రెండు ఆవులు. ఏదో బాగుందనుకునే సమయంలో, కొండమీద సామికి ఏం కోపమొచ్చిందో... భార్యకీ పెద్దోళ్ళకి రాకూడని పెద్ద జబ్బొచ్చింది. ఆర్నెల్లముందే పక్కూరు రైసుమిల్లులో పనిచేసే కుర్రాడికి అమ్మాయినిచ్చి పెళ్లి చేయగా, చేతిలో మిగిలిన డబ్బు, ఆవుల్ని అమ్మిన డబ్బు, భూమి తనఖాపెట్టి తీసుకున్న డబ్బు... అన్నీ ఖర్చయ్యేదాకా ఉండి భార్య పోయింది.

తాను, కొడుకు మిగిలారు. ఆ ఊళ్ళో చేయడానికి పనిలేక, అక్కడ ఉండలేక... ధైర్యం చేసి తిరుపతి వచ్చేసారు. ఎవరో చెబితే ఈ హోటల్‌లో చేరారు. అబ్బాయి టీ, కాఫీ కలుపుతాడు. తను సర్వరు. హోటల్లో సౌలభ్యం తిండికి వెతుక్కోనక్కర్లేదు.

రెండుపూటలూ తిండి పెట్టి, నెలకు పదివేలు ఇస్తున్నారు ఇద్దరికీ కలిపి! ఊరికి దూరంగా ఓ వెయ్యి రూపాయలకి చిన్నగది అద్దెకు తీసుకుని రోజూ సైకిలుమీద వచ్చి వెళుతున్నారు. ఏదో బాగానే గడిచిపోతోంది.

మధ్యాహ్నం పన్నెండు గంటలకి... మంచి ఎండలో వచ్చారు కూతురు, అల్లుడు. “కొండకొచ్చాం. మిమ్మల్ని ఓసారి చూసి పోదామని వచ్చాం!” అన్నారు.



వాళ్ళు వచ్చినందుకు ఆనందంగానే ఉన్నా, వాళ్ళ చేతుల్లో పెట్టడానికి పదిరూపాయలు కూడా లేవు. భోజనం పెడదామంటే ఓనర్ ఏం అంటాడో తెలియదు. భయం భయంగా ప్రొప్రైటర్ దగ్గరికెళ్ళారు తండ్రీకొడుకులు.

“అలగా జనానికి అన్నం పెట్టడానికి ఇదేం ధర్మసత్రం కాదు” వాళ్ళ మనస్సులు చివుక్కుమన్నాయి.

“సార్, ఓ వంద రూపాయలు ఇవ్వండి. ఇవీ, ఇద్దరి భోజనానికి అయ్యే డబ్బు మా జీతంలో కోసుకోండి!”

మునియప్ప సౌమ్యంగా చెప్పినా, ఏదో తిరుగుబాటు ధోరణి కనిపించింది ప్రొప్రైటర్‌కి. ఏమనుకున్నాడో... ఏమో, ఏమీ అనకుండా "సరే" అన్నాడు కౌంటర్లో నుంచి వందనోటు తీసిస్తూ!

కొడుకు ఇద్దరినీ ఏసీ గదిలోకి తీసుకెళ్లి భోజనం పెట్టాడు. "ఇక్కడ ఎందుకురా?" నసిగాడు మునియప్ప. "డబ్బులిస్తున్నాం కదా. ఏసీ డబ్బులు తీసుకోమను." ఉడుకురక్తం. లోకంపోకడ పూర్తిగా తెలియదు.

భోజనం పెట్టి, వందరూపాయలు చేతిలో పెట్టి అమ్మాయిని పంపి ఊపిరి పీల్చుకున్నాడు. ఎండ తగ్గాక వెళ్ళమని చెబుదామనుకొని, ఏదైనా గొడవ జరిగితే అమ్మాయి నొచ్చుకుంటుందని ఊరుకున్నాడు.

రెస్టారెంట్ అంతా నిండుగా ఉంది. బయట వేడి అలాగే ఉంది. వర్కర్స్ అందరూ బిజీబిజీగా ఉన్నారు. ప్రొప్రైటర్ ఎదురుగా ప్రవేశద్వారానికి కుడివైపు గోవిందయ్య కూర్చున్నాడు. పార్సిల్స్ కావలసిన వాళ్ళకి ఏం కావాలో అడిగి, ఎంత బిల్ అవుతుందో రాసివ్వడం అతని పని! ఆ చీటీ తీసుకుని, కౌంటర్‌లో డబ్బులు కట్టి పార్సిల్స్ తీసుకోవాలి. గోవిందయ్య చదువుకున్నవాడు. సౌమ్యుడు. పనిచేసే అందరికీ తలలో నాలుకలా ఉంటాడు.

టైము మెల్లగా నడుస్తోంది. అంతా యంత్రాల్లా పనిచేస్తున్నారు. మునియప్ప ఆర్డర్ తీసుకొని తేవడానికి వెళ్తున్నాడు. వేరే టేబుల్ దగ్గర కస్టమర్ ఆపాడు. "సాయంత్రం కర్డు రైస్ ఎన్ని గంటలు ఇస్తారు?"

"ఐదున్నర అవుతుందండి."

కస్టమర్ వాచీ చూసుకున్నాడు. పది నిమిషాలు తక్కువ ఐదు అయింది. "సరే, ఒక అరగంట ఆగి తీసుకుని వెళ్లిపోతాం. మళ్లీ రానక్కర్లేదు."

"అదే మంచిదండి. బయట చాలా వేడిగా కూడా ఉంది!" మునియప్ప నవ్వుతూ అన్నాడు.

కౌంటర్లో నుంచి ప్రొప్రైటర్ ఒక్క అరుపు అరిచాడు. "పనిమానేసి సొల్లు కబుర్లు ఏంట్రా. నీదే టేబుల్?"

"సొల్లు కబుర్లు ఏం కాదండీ... ఆయనేదో అడిగితే చెబుతున్నాను" ఉక్రోషంగా అన్నాడు.

"లం... కొడక. ఏంట్రా ఎదురు చెబుతున్నావు?"

"ఇప్పుడు నేనేమన్నానండి?" మునియప్ప ముందుకెళ్ళాడు. ప్రొప్రైటర్ బీపీ రెండు వందలు దాటిపోయింది. ఆవేశంగా కౌంటర్‌కు ఉన్న చెక్క లాగి, దగ్గరకొచ్చిన మునియప్పని విచక్షణరహితంగా కొట్టసాగాడు.

మునియప్ప నుదురు చిట్లి రక్తం రాసాగింది. కస్టమర్లు, వర్కర్లు, అంతా నిశ్చేష్టులయ్యారు.

మునియప్ప కొడుకు కూరలు తరిగే చాకు తీసాడు. గోవిందయ్య కంటితోనే వారించాడు. కొందరొచ్చి మునియప్పను లోపలకు తీసుకెళ్ళారు. విరాటుని కొలువులో పాండవుల్లా వుంది వాళ్ళ పరిస్థితి!

పదినిముషాలకి అక్కడి పరిస్థితి మామూలు అయింది. మునియప్ప చేత క్షమాపణ చెప్పించారు. తప్పు ఎవరిదైనా చెప్పాల్సింది పేదోడే కదా!

ఆ రాత్రి హోటల్ మూసేసాక అందరూ ఆరుబయట కూర్చున్నారు. "నాయనా, మనూరు పోదాం" మునియప్ప కొడుకు అలా అడగడం నాలుగోసారో, అయిదోసారో.

"వెళదాం ఇంతకింతా ప్రతీకారం తీర్చుకుని" మునియప్పలో ఒకప్పటి ఆవేశం తన్నుకొచ్చింది.

"అదే కరెక్ట్" అంతా వంతపాడారు. ఏం చేయాలో ఎలా చేయాలో హనుమంతయ్య చెప్పాడు.

ఈ సంఘటన జరిగి నెల రోజులు దాటింది.

మునియప్ప ఇంట్లో కొద్దిగా ఉన్న సామాన్లన్నీ... పల్లెలో ఉన్న తన ఇంట్లోకి మార్చేసాడు. వారం క్రితం సైకిల్ కూడా అక్కడికి చేర్చి, ఇల్లు పూర్తిగా ఖాళీ చేసేసాడు. వారంనుంచి తండ్రీ, కొడుకు హోటల్ అయ్యాక స్టేషన్‌లోనే గడుపుతున్నారు.

ప్రొప్రైటర్ అలగాజనమనీ, అణాక్కూడా కొరగాని వాళ్ళనీ తిడుతూనే ఉన్నాడు. ఉదయంనుంచి కాష్‌కౌంటర్‌లో ప్రొప్రైటర్ అన్నగారబ్బాయి కూర్చుంటాడు. అతను తీరిగ్గా సాయంత్రం అయిదు గంటలకి ఎండ తగ్గుముఖం పట్టాక వస్తాడు. పదివరకు ఉండి, హోటల్ తాళం వేసాక ఇంటికి వెళ్తాడు.

ఈ మధ్య కొత్త నిబంధన ఒకటి పెట్టాడు. రోజూ ఓ ఇద్దరు రాత్రి పదకొండువరకూ ఉండాలి. హోటల్ తలుపులు అన్ని వేసి, తాళాలు ప్రొప్రైటర్ కిచ్చి, అతను ఇంటికి వెళ్ళిపోయాక బయట తుడిచి, నీళ్ళు జల్లి, ముగ్గులేసి, అప్పుడు ఇంటికెళ్ళాలి.

ఈ నిబంధననే అనుకూలంగా మలుచుకున్నారు తండ్రీ, కొడుకు. ఆ రోజు వీళ్ళిద్దరూ రాత్రి పదకొండు వరకూ ఉండాలి. తొమ్మిదిన్నర, పదిగంటలకి పనివాళ్ళంతా వెళ్ళిపోయారు. వెళ్ళిపోతూ కళ్ళతోనే వీడ్కోలు చెప్పారు. అందరిలోనూ మళ్ళీ కలిసేదెప్పుడు అనే బాధ, అసలు కలుస్తామో లేదోననే భయం. పది గంటలకి... అల్లుడ్ని ఆటో తెచ్చి స్టేషన్ దగ్గర ఉండమన్నారు.

ప్రొప్రైటర్ కౌంటర్‌లో కూర్చొని మొబైల్ చూసుకుంటున్నాడు. కిటికీలు, తలుపులు అన్ని వేసేసారు. బయట తలుపు కూడా గొళ్ళెం పెట్టారు. ఒక్కసారి కౌంటర్ వైపు దూసుకొచ్చారు. సి సి కెమెరాలని ఆపేసారు.

మునియప్ప కొడుకు ప్రొప్రైటర్ చేతిలో మొబైల్ తీసి నేలకేసి కొట్టాడు. అరవబోయిన అతని నోట్లో గుడ్డలు కుక్కాడు. మునియప్ప, కొడుకు కలిసి అతని చేతులు, కాళ్ళు తాళ్ళతో కట్టేసారు. మునియప్ప కౌంటర్‌లో కర్ర తీసాడు.

ప్రొప్రైటర్ కళ్ళల్లో భయం. కళ్ళుమూతలు పడేవరకూ, ఇంక ప్రాణం పోతుందేమో అన్నంతవరకు కొట్టి కొట్టి లైట్లన్నీ ఆర్పి బయటకు వెళ్ళిపోయారు.

మరునాడు ఉదయం పనివాళ్ళు వచ్చేవరకూ అదే స్థితి. ఒక్కోరోజు రాత్రంతా మందు కొడుతూ, ఫ్రెండ్స్‌తో పేకాట ఆడుతూ ఉండిపోవడం అలవాటే కనక ఎవరికీ అనుమానం రాలేదు.

ఉదయం వర్కర్స్ అంతా వచ్చారు, వీళ్ళిద్దరూ తప్ప. అంతా ఏమీ తెలియనట్టే ఉన్నారు. ఇంటికి ఫోన్ చేసారు. ఇంట్లోవాళ్ళు పోలీసులకు ఫోన్ చేసారు.

స్టేషన్ నుంచి ఇద్దరు కానిస్టేబుల్స్ వచ్చారు. హాస్పిటల్లో ట్రీట్మెంట్ తీసుకుంటున్న ప్రొప్రైటర్ దగ్గర స్టేట్మెంట్ తీసుకున్నారు.

హోటల్కొచ్చి, మునియప్ప అడ్రెస్ తెలుసేమోనని అడిగారు. ఎవరూ తెలియదంటే తెలియదన్నారు. ప్రొప్రైటర్ ఎలాంటి వాడని అడిగారు.

అదంతా విన్న పోలీసులకు,వాడికి అలాంటి శాస్తి జరగడం న్యాయమే అనుకున్నారు. స్టేషన్కెళ్లి ఏదో చిన్న గొడవనీ, ప్రాణానికి ప్రమాదం లేదని చెప్పారు. ఎస్ ఐ లైట్ తీసుకున్నాడు.

ప్రొప్రైటర్ ఫ్రెండ్స్ కూడా గొడవ పొడిగించొద్దని, పోలీసు కేస్ అంటే చాలా ఇబ్బందని నచ్చజెప్పారు.

మునియప్ప, కొడుకు ఇల్లు బాగుచేసుకుని రెండు ఆవులు కొనుక్కుని రెండెకరాలు కౌలుకు తీసుకుని పల్లెటూరులో ఉండిపోయారు.

# పాప ప్రక్షాళన


## మాధవి బైటారు

✆ +974 33952728


***అంతే కాదు నాన్నా, కనిపించిన ప్రతీవారికి జరిగిన మోసం చెబుతూ గగ్గోలు పెడతారు. అలా ఎంతమంది దృష్టిలో మీలాంటివాళ్ళు నీచులుగా, మోసగాళ్ళుగా మిగులుతారో తెలుసా? మీ పేరు అసహ్యం, మీ రూపు జుగుప్స. బాగుపడ్డాం అని పొంగిపోవడం కాదు వెనక గుచ్చుకునే శాపాలు, తిట్లబాణాలను గ్రహించుకోగలగాలి. ఆశల మేడలను కూల్చితే ఏనాటికైనా అధోగతి తప్పదు. నూరు గొడ్లను తిన్న రాబందు గాలివానకి కొట్టుకుపోయినట్లు... ఎక్కడో, ఏదో ఒకచోట శిక్ష అనుభవిస్తారు.***

ఆ రోజు ఉదయం ఐదు నక్షత్రాల హోటల్లో జరగబోయే సమావేశంకి వెళుతున్నాను. అటూ ఇటూ వెళుతున్న వాహనాలతో ట్రాఫిక్ చాలా ఎక్కువగా ఉంది. నేను కట్టబోయే కొత్త ప్రాజెక్టులో పొందబోయే లాభాన్ని మెదడు లెక్కలేస్తుండగా, వేళ్ళు చకచకా ల్యాప్టాప్‌లో రాస్తున్నాయి.

ఈమధ్యే కొత్తగా కొన్న బిఎండబ్ల్యూ కారు రోడ్డు మీద స్మూత్‌గా వెళుతుంది. మెయిన్‌రోడ్డుకి ఇరువైపులా ఉన్న కొన్ని భవనాలు చూపరులను ఆకర్షిస్తున్నాయి. వాటిలో కొన్ని నావికూడా ఉన్నాయనుకునేసరికి గర్వంతో ఛాతి ఉప్పొంగింది.

‘ఎవరి కోసమివన్నీ?’ అనుకోగానే ‘అనుకున్నది సాధించాననే’ తృప్తి.

రోజూలాగే నా బంగారుతల్లితో మాట్లాడదామని ఐ ఫోన్లో డయల్ చేసాను.

“ఏం చేస్తున్నావురా తల్లీ?”

అవతల నుండి సమాధానం లేదు. మళ్ళీ ప్రేమగా అడిగాను. “ఏం లేదు” పొడిపొడి మాటలు.

“అల్లుడుగారు బాగున్నారా? హాస్పిటల్‌కి వెళ్ళారా?” అడిగేసరికి, రెండు ప్రశ్నలకి ఒకటే జవాబులా “అవును” అని, ఆపై మరిక మాట్లాడేది ఏం లేదన్నట్లు టక్కున ఫోన్ పెట్టేసింది, నా ఒక్కగానొక్క ముద్దుల కూతురు ఉజ్వల!

అత్తారింట్లో ఉంటున్న ఉజ్వలకి, ధీరజ్ తో పెళ్ళయ్యి మూడేళ్ళయ్యింది. చిలకాగోరింకల్లా ఉన్నారని పెళ్ళప్పుడు వచ్చిన ప్రశంసలు నా చెవుల్లో ఇప్పటికీ అమృతాన్ని కురిపిస్తున్నాయి.

చూడటానికే కాదు, ప్రేమానురాగాలలోనూ ఒకరికొకరు సరిపోయారు. అప్పుడప్పుడు గిల్లికజ్జాలు వచ్చినా, ఎక్కువసార్లు ధీరజ్ ముందుగా చెప్పిన ‘సారీ’తో సమసిపోయేవి.

రోజుకో పదిసార్లు 'నాన్నా... నాన్నా' అని పిలుస్తూ, చిలకలా కబుర్లు చెప్పిన నా కూతురు, ఇప్పుడు నోరారా పిలవడంలేదు సరికదా, మూగనోము పట్టినదానిలా ఊరుకోవడం భరించలేకున్నాను.

ఈరోజే కాదు. గత వారం రోజులుగా ఇదే పరిస్థితి.

'ఎందుకిలా ఉంటుంది? అక్కడ ఏమైనా జరిగిందా? నేను గాని, మా ఆవిడ గాని ఏమైనా అన్నామా?' ఆలోచించసాగాను.

అల్లుడుగారు ఏమేం కొన్నారో, ఎక్కడెక్కడికి తీసుకెళ్ళారో చెప్తూ, మురిపాల మాటలమూటలు కట్టేది. అప్పుడప్పుడూ అత్తామామల గురించి కూడా!

ఆ మురిపాల మూటలు విప్పుకుని ఆస్వాదిస్తుంటే, మరోపక్క దిగులుమేఘం కమ్మింది.

'నాన్నా...' అనే పిలుపు విని నూట అరవై ఎనిమిది గంటలు దాటాయంటే నమ్మబుద్ధి కావడం లేదు!

ఆ మధ్య ఉజ్వల అత్తవారింటికి వెళ్ళినప్పుడు, విశాలమైన హాల్లో ఉన్న టీవీ నిండుదనం తెచ్చినట్లు లేదనిపించి, 'మేము పెద్దగా చూడము, అవసరం లేదు' అని, వాళ్ళు వారిస్తున్నా, వంద అంగుళాల టీవీ ఆర్డర్ పెట్టాను.



'ఏదైనా సమస్య వస్తే చెప్పాలి కానీ ఇలా ముభావంగా ఉంటే ఎలా?' అని కణతలు నొక్కుకున్నాను.

ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఎర్రలైటు వెలిగేసరికి కారు ఆగింది.

ఒక బిచ్చగత్తె చంటిపాపని ఎత్తుకుని బైక్స్ దగ్గర, కార్ల దగ్గర అడుక్కుంటుంది. పిల్లల్ని పెంచలేనివాళ్ళు కనడం ఎందుకో అని చిరాకేసింది.

ఇంతలో పచ్చలైటు రాగానే కారు ముందుకి ఉరికింది.

భావోద్వేగాల పరంపర నన్ను చుట్టుముట్టాడుతున్నది. కళ్ళు మూసుకునేసరికి జ్ఞాపకాల సునామీ కొట్టుకొచ్చింది.

మా పెళ్ళయి ఐదేళ్ళయినా తలంబ్రాల చీర, ఉయ్యాలగా మారే అదృష్టం దక్కలేదు. ప్రతీ స్త్రీ 'అమ్మా' అని పిలిపించుకునే భాగ్యం కలగాలని ఎంతగా పరితపిస్తుందో... అంతగా నా భార్య కూడా ప్రతి నెలా ఆశపడింది. కానీ ఎందుకనో ఒక్కసారి కూడా 'మీరు తల్లి కాబోతున్నారు' అనే డాక్టర్ తియ్యటిమాట చెవిన పడలేదు. మాటలతూటాలు విసిరే సమాజం నుండి తప్పించుకోడానికైనా సంతానం కలిగితే బాగుండుననిపించేది.

ఏ కోవెలకి వెళితే కోరిక నెరవేరుతుందో, ఏ నోము నోస్తే కడుపు పండుతుందో కనుక్కుంటూ నన్నుకూడా రమ్మనమని అడిగేది. మానవప్రయత్నం ఉండాలి కానీ, ఆ రాయిరప్పా తీరుస్తాయా అని వెళ్ళడానికి నచ్చేవాడిని కాను. కానీ పదేపదే అడుగుతుండటంతో అప్పుడప్పుడు వెళ్ళేవాడిని.

ఒక్కోసారి బాధతో, కోపంతో, అవమానంతో, "ఈ జన్మంతా గొడ్రాలనే ఛీత్కారం భరిస్తూ ఉండాల్సిందేనా? సంతానభాగ్యానికి నోచుకోలేనంత పాపం నేనేం చేసాను?" అని తల కొట్టుకుంటూ ఏడుస్తుంటే, ఆ ప్రశ్నలకు సమాధానం ఏం చెప్పాలో తెలిసేది కాదు.

"పుడతారులే, బాధపడకు" అని సముదాయించేవాడిని.

చిత్తశుద్ధితో నమ్మినవాళ్ళను దేవుడు తప్పక దీవిస్తాడన్నట్లు, ఒకరోజు శుభవార్త తెలిసింది. దొరకబోయే ఆణిముత్యం విలువ, వేచి చూసేవాళ్ళకే తెలుస్తుంది.

నా స్నేహితుడితో సంతోషం పంచుకుంటుంటే "కంగ్రాట్స్‌రా!" అని అంటూ "కొడుకు పుట్టేస్తే సరి" అని నవ్వాడు.

"నాకు కూతురే కావాలి. నా చిట్టితల్లిని అపురూపంగా... కాదు, కాదు... యువరాణిలా చూసుకోవాలి." అని దృఢంగా చెప్పాను.

"ఐతే గట్టిగా సంపాదించు" అని పగలబడి నవ్వుతూ, నా వీపు మీద కొట్టి వెళ్ళిపోయాడు.

'అంటే వాడి ఉద్దేశ్యం ఏమిటి?' అని రోషం పొంగి ఎలాగైనా గొప్పగా పెంచి చూపించాలని తీర్మానించుకున్నాను.

అప్పుడే పడింది అంకురార్పణ...

డబ్బు అనే ఫలంకోసం, తెలివితేటలు అనే విత్తనం నాటి, శ్రమ, సమయం అనే నీళ్ళు పోసి లౌక్యం, చాతుర్యం అనే ఎరువులు పోసి అహర్నిశలు పరిశ్రమించసాగాను.

సిరులు కురిపించే కల్పవల్లిలా శుక్రవారంనాడు మహాలక్ష్మిలా పుట్టింది.

విశ్వవిజేత అలెగ్జాండర్ అని మాత్రమే ఎందుకంటారో... ఆడపిల్లని కన్న ప్రతితండ్రి విశ్వవిజేత కదా.

నల్లటిజుట్టు, చిన్న లక్కపిడతలాంటి నోరుతో పొత్తిళ్ళలో ఉన్న పాపాయిని చూడగానే హృదయం ఆనందడోలికల్లో తేలింది.

నా నిర్ణయం మరి కాస్త తీవ్రరూపం దాల్చింది.

ఎక్కడ ఆగకూడదు. ఆపకూడదు. పరిగెత్తుతూనే ఉండాలి!

దాని ఫలితం... మొదలుపెట్టిన వ్యాపారంలో లాభాలు! అద్దె ఇంటినుండి సొంత ఫ్లాట్ కి మారాం.

అనుకున్నదానికంటే మొదటి పుట్టినరోజు ఘనంగా జరిగింది. వచ్చినవాళ్ళు మెచ్చుకోళ్ళతో పాటు, 'పెళ్ళి ఇంకెలా చేస్తావో...' అని పరిహాసమాడారు.

మళ్ళీ ఇంకొక ఛాలెంజ్ ముందు నిలిచింది. అవును చేయాలి... నా కూతురి పెళ్ళి 'న భూతో న భవిష్యతి' లా చేయాలి.

ఉజ్వలతో పాటు నా సంపాదన కూడా పెరగసాగింది.

కానీ ఏదో మూల అసంతృప్తి...

స్కూల్ చదువయ్యాక ఇంటర్లో చేరింది.

ఓ రోజు ముభావంగా ఉండేసరికి, "ఏమయ్యిందిరా తల్లీ?" ఆదుర్దాగా అడిగాను.

"నా బెస్ట్ ఫ్రెండ్ వాళ్ళ నాన్న ఆత్మహత్య చేసుకున్నారు." అని ఏడుస్తూ చెప్పింది.

"అయ్యో పాపం!" జాలిపడ్డాను.

"చిట్ ఫండ్ కంపెనీలో డబ్బులు పెట్టారట. వాళ్ళు మోసం చేసి పారిపోతే, జీవించడం కష్టం అని దారుణానికి ఒడిగట్టారు. ఎందుకలా మోసం చేస్తారు, నాన్నా! అలా కుటుంబాలను రోడ్డు మీద పడేయడం భావ్యమా?" ఆవేశపడింది.

"నమ్మినవాళ్ళని అలాగే ముంచేస్తారు. ఒకరకంగా మీ ఫ్రెండ్ వాళ్ళ నాన్నది కూడా కొంత తప్పు." అని నా కోణం నుండి అన్నాను.

ఇంజనీరింగ్ చదువుతుండగా ఓసారి 'ఆఫీస్‌కి వస్తాను' అని సరదాపడితే వద్దని వారించాను. మరికొన్నిసార్లు అడిగినా "హాయిగా ఎంజాయ్ చెయ్యక, ఎందుకు ఇబ్బంది తల్లీ?" అని దాటవేసాను.

చదువు పూర్తయ్యాక కుందనపుబొమ్మకి సరైన జతగాడి కోసం 'అబ్బాయి తాహతు అయితే నా స్థాయికి సమానంగా... లేదంటే అంతకు మించి ఉండాలి' అని పెళ్ళి మధ్యవర్తులకి చెప్పాను.

కొన్ని సంబంధాల వడపోతలు అయ్యాక శ్రీనివాస్‌గారి కుటుంబాన్ని ఇంటికి రమ్మనమని ఆహ్వానించాము.

ఆయనకి నగరంలో పెద్ద హాస్పిటల్ ఉంది. ప్రస్తుతానికి భార్యాభర్తలు దానిని చూసుకుంటున్నారని, వచ్చే నెలలో మొదలవ్వబోయే కొత్త బ్రాంచ్‌ని ఇద్దరు కొడుకులు చూసుకుంటారని చెప్పారు.

పెళ్ళికొడుకు ధీరజ్, పెద్దకొడుకు, కోడలుతో సహా వచ్చిన శ్రీనివాస్ దంపతులకు, మా మర్యాదలతో పాటు, మా అమ్మాయి కూడా నచ్చడంతో వాళ్ళింటికి రమ్మన్నారు.

వాళ్ళ ఇల్లూవాకిలి కూడా మాకు నచ్చడంతో ఇరువురం పంతులు గారిని కలిశాం. ఆయన నిర్ణయించిన తేదీకి ఏర్పాట్లన్నీ చేసి బంధువులు, స్నేహితులతో పాటు, స్థానిక ప్రముఖులను కూడా పిలిచాను.

నా పరపతి, హోదా చూపే అవకాశాన్ని ఇచ్చింది ఆ వివాహం.

అనుకున్నది నెరవేరడంతో, నా మది హర్షాతిరేకాలకు నెలవయ్యింది.

పెళ్ళిసారె తీసుకుని అత్తారింటిలో అడుగుపెట్టింది ఉజ్వల. ఇంపోర్టెడ్ సామాన్లు కూడా చేర్చడం మర్చిపోలేదు నేను.

సాదరంగా మమ్మల్ని ఆహ్వానించాక నవ్వులపువ్వుల మధ్య రుచికరమైన భోజనం చేసాము. కడుపుతోపాటు మనస్సు కూడా నిండింది. ఇక్కడ కూడా యువరాణీయే అనే భావన.

బయలుదేరాల్సిన సమయం రాగానే అక్కడే వదలాల్సిన అణిముత్యాన్ని వదలడం అంత సులభం కాదని అర్థమయ్యింది.

"నాన్నా! నన్ను వదిలివెళ్ళకు." ఏడుస్తూ నన్ను గట్టిగా పట్టుకుంది.

"లేదమ్మా, వదలను..." కళ్ళు తుడిచాను.

నా భార్య కళ్ళు తుడుచుకుంటూ దుఖాన్ని దిగమింగుకుంటుంది.

"అమ్మాయిలు లేని మాకు కూతురైనా, కోడలైనా మీ అమ్మాయే, పెద్దకోడలుతో సహా!" అని సముదాయించారు శ్రీనివాస్ గారు.

అత్తగారు కరుణ మా ఆవిడ భుజంపై చెయ్యి వేసి ఓదార్చింది.

విలవిలాడుతున్న ప్రాణాలతో బయటపడిన మేము రోజూ మాట్లాడుకోవడం, వీలైనప్పుడు కలవడం వదులుకోం!

హాయిగా సాగుతుంది అని అనుకుంటున్న సమయంలో ఇదేంటిలా?

"సర్, హోటల్ వచ్చింది." అని డ్రైవర్ చెప్పాడు. తల విదిల్చి, కారు దిగాక సమావేశం ఎలా పూర్తిచేసానో నాకే తెలియదు.

ఆపై 'ఇక లాభం లేదు, సరాసరి ఇంటికే వెళ్ళి కనుక్కోవాలి' నిశ్చయించుకున్నాను.

మర్నాడు పొద్దున్నే ఉజ్వల ఇంటికి వెళ్ళేసరికి శ్రీనివాస్‌గారు అప్పుడే బయటకు వెళ్ళబోతున్నారు. నా రాకని ముందుగానే ఊహించినట్లు, "వచ్చారా?" ముక్తసరిగా పలకరించి వెళ్ళిపోయారు.

అత్తగారు నన్ను చూడగానే, "బాగున్నారా?" అని అడిగి "ఉజ్వలా! మీ నాన్నగారు వచ్చారు. చూడు." అని, లోపలికి వెళ్ళిపోయింది.

అప్పటికే ధీరజ్ బయటికి పోయినట్లు ఉన్నాడు. అలికిడి లేదు.

ఇంతకు ముందు మా రాకకి సంబరపడినవాళ్ళు, ఈరోజు?

అరవిరిసిన కలువలా ఉండే నా కూతురు, ఏడ్చిన కళ్ళతో నీరసంగా వచ్చింది.

"ఏమైందిరా, తల్లీ?" ఆందోళనగా అడిగాను.

చప్పున తలెత్తి చూసింది. ఆ కళ్ళల్లో ఎన్నో ప్రశ్నలు... నీకేం తెలియదా అన్నట్లు...

"అసలేమయ్యింది? వాళ్ళు కూడా సరిగ్గా లేరు ఎందుకు?" అడిగాను.

"తల్లితండ్రులు చేసిన పాపాలు, తప్పులు పిల్లల్ని వెంటాడతాయా నాన్నా?" సూటిగా అడిగింది.

ఒక్కసారిగా నిశ్చేష్టుడినయ్యాను.

"అదేంటమ్మా?" గాబరా పడుతుంటే, "నా ప్రశ్నకి సమాధానం చెప్పండి." రెట్టించింది.

ఆపై "భర్త ఆప్యాయత, అత్తామామల ఆదరణకి నోచుకున్న నాకు, ఈ దుస్థితి రావడానికి కారణం మీరే. ముమ్మాటికి మీరే..." విపరీతమైన కోపంతో గట్టిగా అరిచేసింది.

తుళ్ళిపడ్డాను.

'అల్లారుముద్దుగా పెంచుకుంటే అందుకున్న బహుమతి ఇదా?' గుండెల్లో కలుక్కుమంది.

బాధతో ముఖం మ్లానమైపోతే, "వారం రోజులకే ఇంత బాధపడుతుంటే... మరి పదిహేనేళ్ళుగా వాళ్ళు అనుభవిస్తున్నదానిని ఏమంటారు?" ప్రశ్నించింది.

'వాళ్ళు అంటే ఎవరు?' అని ఆలోచిస్తుండగా, పనిమనిషి టీ, స్నాక్స్ తీసుకురాబోతూ, మామధ్య చర్చ తీవ్రంగా జరుగుతుండటంతో ఆగిపోయింది. కానీ ఉజ్వల కనుసైగతో అక్కడ టీపాయ్‌పై పెట్టేసి పరుగున వెళ్ళిపోయింది.

ఉజ్వల మొహంలోకి చూడలేక తలదించుకుని, "ఎవరమ్మా?" నెమ్మదిగా అడిగాను.

"ఎవరా? అవున్లే... చాలామందిని మోసం చేసి ఉంటావు కదా. ఎంతమంది గుర్తుంటారు?" హేళనగా నవ్వి, ఫోన్ చేతిలోకి తీసుకుని, ఒకతని ఫోటో చూపించింది. ఎక్కడో లీలగా చూసినట్లు అనిపించింది.

"గుర్తుకు వచ్చిందా?" హుంకరించి, "నీ వ్యాపారసామ్రాజ్యానికి సమిధలు..." అంది.

నాకు ఒక్కసారిగా పొలమారింది.

"నీ మోసాలగురించి మావాళ్ళకెలా తెలిసిందా అని అనుకుంటున్నావు కదూ. చెప్తాను విను." మొదలుపెట్టింది.

"ఈ ఫోటోలోని శివరామ్‌గారు, మా మామయ్యగారికి ప్రాణ స్నేహితుడు. ఆయన వల్లే తాను ఈ స్థితిలో ఉన్నానని మామయ్యగారు నమ్ముతారు. కారణం శివరామ్ గారిచ్చిన ఆర్థికసహాయం, ప్రోత్సాహం! పదిహేనేళ్ళ కిందట శివరామ్ గారికి ఈ నగరంలో రెండువేల గజాలస్థలం, పక్కనే మంచి ఇల్లు ఉండేవట. ఆ స్థలం భవిష్యత్తులో మంచి రేటు పలుకుతుందని, దానితో తన పిల్లల చదువులు, పెళ్ళిళ్ళు సులభమవుతాయని భావించే ఆయన దగ్గరికి ఒక పెద్దమనిషి వచ్చి, అతి చవకకి

ఇమ్మనమని అడిగాడట. అదొక్కటే తనకి ఆధారం కాబట్టి శివరాంగారు ఒప్పుకోకపోవడంతో, చాలా ప్రయత్నించి, చివరికి చంపేస్తామని రౌడీలతో బెదిరించారట! అంగబలం, అర్థబలం లేని ఆయన నిస్సహాయంగా ఏడుస్తూ సంతకం పెట్టారట. ఇదంతా జరిగినప్పుడు మా మామయ్యగారు వ్యాపారరీత్యా విదేశాలలో ఉండటంతో ఎవరు ఇదంతా చేస్తున్నారనేది తెలియలేదు. మా పెళ్ళి సమయానికి శివరామ్ గారికి ఒంట్లో బాగుండకపోవడంతో, ఆ భార్యాభర్తలు రాలేక వారి కొడుకుని పంపించారు. ఆ తరువాత మేమిద్దరం వాళ్ళింటికి వెళ్ళినా నేనెవరి కూతురినో వాళ్ళకి తెలియదు." ఆవేదనతో చెప్పుకుపోతున్న నా కూతురు ఒక్కక్షణం ఆగింది.

"ఈమధ్య ఇక్కడికి వచ్చినప్పుడు మా పెళ్ళి ఆల్బమ్ చూసాక, ఆ పెద్దమనిషి గురించి చెప్పారు. అతని దౌర్జన్యం గురించి వివరించారు. అప్పటినుండి మామయ్యగారితో పాటు, అందరూ నాతో మాటలాడటం మానేసారు." ఒక్కసారిగా గట్టిగా ఏడ్చేసింది.

"పిల్లలని బాగా పెంచాలనుకోవడం తప్పు కాదు. కానీ దానికోసం ఇంకొకరి ఆశలమేడలు కూలగొట్టి దానిపై ఆకాశహర్మ్యాలు కడతామంటే ఎలా చెప్పు? మీలాంటివాళ్ళు అక్రమమార్గంలో సంపాదించిన ప్రతి రూపాయి వెనక బాధితకుటుంబం ఆక్రోశం ఉంటుంది. రోజూ వాళ్ళకి జరిగిన మోసాన్ని, దౌర్జన్యాన్ని తలుచుకుని కుమిలిపోతూ తిట్టే తిట్లు మీకు వినబడవు. 'మా కడుపులు కొట్టి నువ్వు మాత్రం కులుకుతున్నావా? నువ్వు బాగుపడవురా, నీ కుటుంబం బాగుపడదురా, నాశనం అయిపోతావు, నువ్వు సంపాదించిన పాపిష్టి కూడు నిలబడదురా' అని దారుణంగా శాపాలు పెడతారు. అంతే కాదు నాన్నా, అని దారుణంగా జరిగిన మోసం చెబుతూ గగ్గోలు పెడతారు. అలా ఎంతమంది దృష్టిలో మీలాంటివాళ్ళు నీచులుగా, మోసగాళ్ళుగా మిగులుతారో తెలుసా? మీ పేరు అసహ్యం, మీ రూపు జుగుప్స. బాగుపడ్డాం అని పొంగిపోవడం కాదు వెనక గుచ్చుకునే శాపాలు, తిట్లబాణాలను గ్రహించుకోగలగాలి. ఆశల మేడలను కూల్చితే ఏనాటికైనా అధోగతి తప్పదు. నూరుగొడ్లను తిన్న రాబందు గాలివానకి కొట్టుకుపోయినట్లు... ఎక్కడో, ఏదో ఒకచోట శిక్ష అనుభవిస్తారు. వాళ్ళ పిల్లలైనా ఎలా అభివృద్ధిలోకి వస్తారనుకుంటున్నారు? అందుకేనేమో నాకు ఇప్పటివరకూ కడుపు పండలేదు." మోకాళ్ళపై కూలబడి ఏడవసాగింది.

'నగరంలో నేను కట్టిన పెద్ద షాపింగ్ మాల్ స్థలంలో ఉన్న మూడు ఇళ్ళు, ఖాళీ స్థలాలు గుర్తుకువచ్చాయి. అక్కడ మాల్ కడితే, రేప్పొద్దున్న వందల కోట్లుగా మారుతుందని భావించాను. ఇస్తానన్న డబ్బు సరిపోదంటున్న యజమానులను బెదిరించాను. వినకపోయేసరికి, రౌడీలను రంగంలోకి దించాను. ముందే అందుకున్న బ్రీఫ్‌కేసులతో పోలీసులు ఇదంతా పట్టించుకోలేదు.

కోట్ల విలువైన భూమిని లక్షల్లో సెటిల్ చేసాను.

కానీ ఆ సమయంలో వాళ్ళు చూసిన చూపు అగ్నిబాణంలా నిప్పులు కక్కుతూ తాకినట్లనిపించింది. కానీ పట్టించుకోకూడదని మనస్సుని హెచ్చరించాను, గుర్తు వస్తుండగా...

"ఎదుటిమనిషి బ్రతికుండగానే నిర్జీవంగా మార్చిన మీలాంటి వాళ్ళకి, బాధితుల ఆవేదన అర్థం కాదు. మీ మనస్సుకి... అంతెందుకు మీ చెవులకి కూడా ఎక్కదు. ఎంతసేపూ తరతరాలు తిన్నా తరగని ఆస్తి సంపాదించాలి అనే యావ మాత్రమే!" వెక్కివెక్కి ఏడుస్తుంది.

"నా అత్యాశ ఇంత ఉపద్రవాన్ని సృష్టిస్తుందని అస్సలు ఊహించలేదమ్మా. సరిదిద్దుకోవడానికి ఒక్క అవకాశం ఇవ్వు." అని గబగబా శ్రీనివాస్‌గారి హాస్పిటల్‌కి వెళ్ళాను.

"నా తప్పుకి, మా అమ్మాయిని శిక్షించకండి, బావగారూ!" అని ఆయన కాళ్ళావేళ్ళా పడ్డాను.

తన కాళ్ళను వెనక్కి తీసుకుంటుంటే.. "ఇప్పుడే శివరాంగారి చిరునామా ఇవ్వండి. ఎంత దూరమైనా వెళతాను." అని ఏడుస్తూ చేతులు పట్టుకున్నాను.

పావుగంటలో శివరాంగారు ఉంటున్న పల్లెటూరి వైపు నా కారు పరుగులు తీసింది. 'మిగతా ఇద్దరి చిరునామా కూడా కనుక్కుని పాపప్రక్షాళన చేసుకోవాలి.' స్థిరంగా అనుకున్నాను.

బాలకథ

# అపహాస్యం!

మహంకాళి స్వాతి
✆ 89197 73272

*"చూడు బుల్లీ! కోకిలమ్మలా, నెమలిలా సంతోషాన్ని ఎవరితోనైనా పంచుకోగలం. కానీ, బాధను మాత్రం మన అనుకున్న వారితోనే చెప్పుకోగలం! మనం తన వారిగా భావించింది కాబట్టే కోతమ్మ, మనల్ని వెతుక్కుంటూ ఇంటి దాకా వచ్చింది!"*

అనగనగా ఒక గుహలో ఎలుగుబంటి తన బుల్లి ఎలుగుతో ఉండేది. ఏ పక్షో, జంతువో ఎలుగుబంటి వద్దకు వచ్చి తమ బాధలు చెప్పుకుంటే, ఆ బుల్లి ఎలుగు వాటిని అపహాస్యం చేస్తూ ఎగతాళిగా నవ్వేది, అధ్వాన్నంగా చూసేది.

ఒకరోజు నీళ్ళు తాగటానికి అవి చెరువుకు బయలు దేరాయి. దారిలో మామిడిచెట్టు పైన ఆనందంగా ఒక కోకిలమ్మ పాడసాగింది. ఎలుగుబంటిని చూసి, కిందికి దిగి, "అక్కా! నాకు ఈరోజు ఇద్దరు బిడ్డలు పుట్టారు. ఇప్పుడే కాకమ్మ గూటిలో నా బిడ్డల్ని చూశాను. కాకమ్మ తన నలుగురు బిడ్డలతో పాటు, నా ఇద్దరు బిడ్డల్ని దగ్గరికి తీసుకుని అహారం తినిపిస్తుంది. అందుకే ఈ ఆనందం మీతో పంచుకుంటున్నాను!" అంది కోకిలమ్మ.

ఎలుగుబంటి కోకిలమ్మను అభినందించింది. కోకిలమ్మ తిరిగి చెట్టెక్కి, ఆనందంగా పాడసాగింది.

ఇలా అటుగా... వస్తూ, పోతున్న జీవులన్నిటినీ ఆపి, విషయం చెప్పి తన సంతోషాన్ని పంచుకోసాగింది కోకిలమ్మ.

అవి కూడా కోకిలమ్మకు అభినందనలు చెప్పసాగాయి.

బుల్లి ఎలుగు, "అమ్మా! కోకిలమ్మ నీకు ఇంతకు మునుపే తెలుసా!" అని అడిగింది.

"కోకిలమ్మ పాటలు పాడుతుండగా వినటమే తప్ప, ఇలా ఎప్పుడూ నన్ను పలకరించలేదు!" అంది ఎలుగుబంటి.

ఎలుగుబంటి, బుజ్జి ఎలుగు చెరువుకు చేరాయి. చెరువునీటితో దాహం తీర్చుకుంటుండగా గట్టుపై మగనెమలి పురివిప్పి, ఆనందంతో నృత్యం చేస్తూ కనిపించింది. అది ఎలుగుబంటి దగ్గరికి వచ్చి "అక్కా! మృగరాజు సింహం తన పుట్టినరోజుకు, నన్ను ఆస్థానంలో నృత్యం చేయవలసిందిగా కబురుపంపాడు. అందుకే ఈ ఆనందం మీతో పంచుకుంటున్నాను!" అంది నెమలి.

ఎలుగుబంటి నెమలిని అభినందించింది. నెమలి తిరిగి చెరువుగట్టుపై ఆనందంగా నాట్యం చేయసాగింది.

ఇలా... నెమలి చెరువుకు వచ్చిన జీవులకు విషయం చెప్పి ఆనందపడసాగింది.



"అమ్మా! నీకు ఈ నెమలి ఇంతకు ముందే తెలుసా?" అని అడిగింది.

"నెమలి నాట్యం చేస్తుండగా చూడటమే తప్ప, ఇలా ఎప్పుడూ నన్ను పలకరించలేదు!" అంది ఎలుగుబంటి.

కొద్దిసేపటికి అవి గుహకు చేరుకున్నాయి.

ఒక కోతమ్మ... తన చిట్టికోతితో గుహ ముందు ఎదురుచూస్తూ కనిపించింది. చాలా నీరసంగా ఉన్నాయి.

"కోతమ్మా! మీరిద్దరూ ఎప్పుడు వచ్చారు?" అడిగింది ఎలుగుబంటి.

"అక్కా! వచ్చి చాలాసేపయింది. చెరువుకు వెళ్లారని తెలిసి మీ కోసం గుహ ముందు ఎదురు చూస్తున్నాము!" నీరసంగా అంది కోతమ్మ.

"మీరు ఎందుకు ఇంత నీరసంగా ఉన్నారు? అంతా క్షేమమే కదా?" ప్రశ్నించింది ఎలుగుబంటి.

"నా కాలుకు ముల్లుగుచ్చుకుని గాయం కావడంతో నేను నాలుగురోజులుగా బయటికి వెళ్లలేదు. నాకూ, నా బిడ్డకు ఆహారం లేదు! చెట్లు ఎక్కలేకపోతున్నాను!" బాధను చెప్పుకుంది కోతమ్మ.

"అయ్యో... అలాగా! బాధలోనైనా ఈ అక్కను గుర్తుపెట్టుకున్నావు. ఉండు, తినటానికి ఏమైనా తెస్తాను!" అంటూ గుహ లోపలికి వెళ్లింది ఎలుగుబంటి.

కోతమ్మ, చిట్టికోతులు గతంలో ఎలుగుబంటి వద్దకు రావటం వలన అవి బుల్లి ఎలుగుకు తెలుసు. "ఏంటీ! మీకు తిండికి కూడా గతి లేదా? నేనైతే ఒక్కపూట కూడా తిండి మానను!" హేళనగా అంది బుల్లి ఎలుగు.

తినటానికి పది అరటిపండ్లు తీసుకువచ్చి కోతికి ఇచ్చింది ఎలుగుబంటి. అవి రెండూ లొట్టలేసుకుని తినసాగాయి.

"చూడు బుల్లీ! కోకిలమ్మలా, నెమలిలా సంతోషాన్ని ఎవరితోనైనా పంచుకోగలం. కానీ, బాధను మాత్రం మన అనుకున్నవారితోనే చెప్పుకోగలం! మనం తనవారిగా భావించింది కాబట్టే కోతమ్మ, మనల్ని వెతుక్కుంటూ ఇంటిదాకా వచ్చింది!" అంది ఎలుగుబంటి.

బుల్లి ఎలుగు తన తప్పు తెలుసుకుంది. తాను తింటానికి దాచుకున్న జామపండు కూడా చిట్టికోతికి యిచ్చింది.

"చెల్లీ! నీ కాలు గాయం తగ్గేంత వరకు నీ బిడ్డతో ఇక్కడే ఉండు!" అంది ఎలుగుబంటి.

చిట్టి కోతిని స్నేహంగా దగ్గరకు తీసుకుంది బుల్లి ఎలుగు. అవి రెండూ ఆడుకోటానికి బయటకు వెళ్లాయి.

ఆనాటినుండి ఏవైనా తమబాధను చెప్పుకుంటే, వీలైతే సాయం చేసిందే కానీ, అపహాస్యం మాత్రం చేయలేదు బుల్లి ఎలుగు!

బాలకథ

# చీకటంటే భయమా?

నారంశెట్టి ఉమామహేశ్వరరావు
✆ 9490799203

*"నీది అసలైన భయం కాదు. అపోహ! చీకటిలో ఉంటే మనకేదైనా అవుతుందేమో అని మనసులో ఉండే భ్రమ మాత్రమే. ఈ రాత్రి నాతో చీకటిగదిలో కాసేపు కూర్చో. నీ భయం పోగొడతాను. నువ్వు నాతో కూర్చుంటావా? పూర్తి సాహసవంతుడు అని అమ్మ కూడ ఒప్పుకుంటుంది!"*

బాలు ఐదోతరగతి చదువుతున్న పిల్లాడు! వాడికి చీకటంటే చాలా భయం. చీకట్లో ఒంటరిగా ఎక్కడికీ వెళ్లేవాడు కాదు. రాత్రి సమయంలో విద్యుత్ పోయిందంటే "అమ్మా... చీకటి!" అంటూ భయంగా వెళ్ళి, ఆమె ఒడిలో దాక్కునేవాడు.

అది గమనించిన వాళ్ళ నాన్న వాడిని పట్టుకుని, "చీకటికి ఎవరూ భయపడక్కరలేదు. మనం భయపడతాం గానీ, అదేం చెయ్యదు మనల్ని. అదంతా మనలో కలిగే భ్రమ. అలాంటి అనవసర భయాన్ని వదిలేస్తేనే మనం బలవంతుడు, ధైర్యవంతుడు అనిపించుకోగలం!" అని చెప్పేవాడు.

బాలు ఆ మాటల్ని వినేవాడు. కానీ ఆచరణకి వచ్చేసరికి ఎప్పటిలాగానే చీకటికి భయపడేవాడు.

ఎన్నాళ్ళు గడిచినా వాడిలో ఎలాంటి మార్పు రాలేదు.

అలా రోజులు గడుస్తున్నాయి.

ఒకరోజు బాలు బడినుంచి తిరిగొస్తుండగా, ఏదో జంతువు అరుస్తున్న శబ్దం లాంటిది వినిపించింది. అది ఎక్కడినుంచి వస్తుందో ఒక్కక్షణం ఆగి బాగా ఆలకించాడు. ఆ శబ్దం, దారి ప్రక్కనున్న ముళ్ళపొదల మధ్యలోనుంచి వచ్చిందని బాలుకి తెలిసింది. అటువైపు నడుస్తూ పొద దగ్గరికి వెళ్ళి చూసాడు. అందులోపల చిన్న కుక్కపిల్ల కనిపించింది. అది ముళ్ళపొదల మధ్య చిక్కుకుపోయింది! బయటికి రావడానికి ప్రయత్నిస్తోంది. కానీ ముళ్ళు గీరుకుపోవడంతో రాలేకపోతోంది. అందుకే దీనంగా, భయంగా అరుస్తోంది.

అది చూసిన బాలు, ఒక్క క్షణం భయపడి వెనక్కి అడుగు వేసాడు. దానికి ముళ్ళు గుచ్చుతున్నట్టే తనకూ గీరుకుపోతాయేమో అన్న భయం కలిగింది వాడికి. మరోవైపు కుక్కపిల్లను చూస్తే జాలి వేసింది.

అది భయంతో వణికిపోతూ అరుస్తుంటే ఎలాగైనా సహాయం చెయ్యాలనిపించింది వాడికి!

'ఏం పర్లేదు. నేనున్నాను' అని మనసులోనే ధైర్యం తెచ్చుకున్నాడు.

చుట్టూ చూస్తే దూరంగా ఒక పొడుగైన కర్ర కనబడింది. దాన్ని అందుకుని ఆ ముళ్ళపొద దగ్గరకు వచ్చాడు.

భుజానికి తగిలించి ఉన్న పుస్తకాల సంచిని నేలమీద పెట్టాడు బాలు.

ఆ కర్రతో ముళ్ళపొదను పక్కకు తప్పించాడు. తన చేతికి ముళ్ళు తగలకుండా నెమ్మదిగా ముందుకు ఒంగి కుక్కపిల్లను అందుకున్నాడు. ఆ ప్రయత్నంలో కొన్నిముళ్ళు చేతికి తగులుతూ గీరుకుపోతున్నా ఆపలేదు బాలు. చివరికి ఎలాగో ఆ కుక్కపిల్లను బయటకు తీసాడు.



కుక్కపిల్లని బయటికి తీసాక, దారి ప్రక్కన దాన్ని వదిలాడు. అది ఆనందంగా బాలు వైపు వచ్చి, వాడి కాళ్ళ దగ్గర చుట్టుకుంటూ నాలుకతో నాకింది, 'ధన్యవాదాలు' అన్నట్టుగా!

బాలుకి చాలా సంతోషం కలిగింది. దానికి సాయం చేసానన్న తృప్తి కూడ కలిగింది.

ఆ సంతోషంలో ఇంటికి వెళ్ళి, జరిగినదంతా నాన్నకు చెప్పాడు బాలు.

వాళ్ళ నాన్న కళ్ళలో బాలుని చూసాక గర్వం మెరిసింది. "కుక్కపిల్లను కాపాడావంటే నువ్వు నిజంగా ధైర్యవంతుడివేరా! ధైర్యం ఉన్నవాళ్ళే సాహసాలు చేస్తారు. నువ్వు చేసింది ఒక విధంగా సాహసమే కదా. ఆపదలో ఉన్న కుక్కపిల్లని క్షేమంగా బయటకు తీసావు. ఆ ప్రయత్నంలో నీ చేతులకు ముళ్ళు తగిలి గీరుకుపోయాయి. ఆ బాధను అనుభవిస్తూ కూడ సాయంచేసావు. శభాష్" అని వాడిని గుండెలకు హత్తుకొని బుగ్గమీద ముద్దు పెట్టాడు .

అంతలో వాళ్ళమ్మ వచ్చి వాడి చేతులకు ఆయింట్‌మెంట్ రాసింది. ఆమె బాలు తలమీద చెయ్యి వేసి నిమురుతూ "వీడికి చీకటి భయం పోతేనే సాహసవంతుడు అవుతాడు " అంది.

అప్పుడు బాలు "అవును నాన్నా. నాకు చీకటంటే భయం ఉంది కదా? అమ్మ చెప్పింది నిజమే!" అని మెల్లగా అన్నాడు.

వాళ్ళ నాన్న కాసేపు ఆలోచించి "నీది అసలైన భయం కాదు. అపోహ! చీకటిలో ఉంటే మనకేదైనా అవుతుందేమో అని మనసులో ఉండే భ్రమ మాత్రమే. ఈ రాత్రి నాతో చీకటిగదిలో కాసేపు కూర్చో. నీ భయం పోగొడతాను. నువ్వు నాతో కూర్చుంటావా? పూర్తి సాహసవంతుడు అని అమ్మ కూడ ఒప్పుకుంటుంది!" అనడిగాడు.

"ఫరవాలేదా? నాకేమీ కాదా? " అని కళ్ళలో భయం కనబడుతుండగా అడిగాడు బాలు.

"నీకేదైనా అవుతుందంటే మీ నాన్నగా నిన్ను చీకటిలో కూర్చోమని అడుగుతానా? నీకేమీ కాదు కాబట్టే అడిగాను. నీవన్నీ ఒట్టి భయాలేనని, లేనిపోని అపోహలేనని నిరూపిస్తాను. నువ్వు చదివిన చీకటి రాక్షసుల కథలు, రాత్రి దెయ్యాల కథలు నీలో తెలియకుండా భయాన్ని పెంచాయి. అంతే!" అని వాడిలో ధైర్యాన్ని నూరిపోసాడు వాళ్ళ నాన్న.

ఆ రాత్రి వాళ్ళిద్దరూ వాళ్ళింటిలో ఒక గదిలోకి వెళ్ళి కూర్చున్నారు. గదిలో దీపాలు ఆర్పేసారు. గది మొత్తం చీకటి అలముకుంది. చీకటి కాగానే బాలు కెవ్వుమని కేక పెట్టి, నాన్నని గట్టిగా హత్తుకున్నాడు. వాళ్ళ నాన్న బాలు చుట్టూ చేతులు వేసి మెల్లగా మాటలు మొదలుపెట్టాడు.

అలా మాట్లాడుతూ ఒక సాహసవంతుడి నిజజీవిత కథ చెప్పాడు. అందులో కథానాయకుడికి కూడ కొన్ని భయాలుండేవి. నెమ్మదిగా వాటిని వదిలించుకుని సాహసవంతుడు అయ్యాడు. ఆ కథ పూర్తయ్యేసరికి చాలాసేపు గడిచిపోయింది.

అప్పుడు బాలు, "భలే భలే... మంచి కథ చెప్పావు నాన్నా" అన్నాడు.

సమయం ఎలా గడిచిపోయిందో బాలుకి తెలియలేదు.

"ఇప్పుడు భయం వేస్తోందా? చీకటిలో ఇంతసేపు గడిపాం. నీకేదైనా అయిందా?" అని వాళ్ళ నాన్న అడిగాడు.

"అవును కదా. మనం చీకటిలో ఉన్నాం ఇంతసేపూ. నా కళ్ళకి చీకటి అలవాటైపోయింది. నాకేమీ కాలేదు నాన్నా. బాగానే ఉన్నాను!" అన్నాడు బాలు.

మరోవైపు గది బయట కూర్చున్న వాళ్ళ అమ్మ సెల్‌ఫోన్‌లో పెట్టుకున్న అలారం మోగడంతో ఆమె గది తలుపు తోసుకుంటూ లోపలకు వెళ్లింది.

గదిలో లైట్లు వెలిగించే స్విచ్చులు వేసింది.

బాలు సంతోషంగా వాళ్ళమ్మని చూసి "చీకట్లోనూ నాకు ఏం కాలేదు! నాకు చీకటంటే భయం పోయింది!" అన్నాడు.

వాళ్ళ అమ్మ ప్రేమగా బాలును హత్తుకుని, "నీలోని ధైర్యమే నిజమైన వెలుగు! వెలుగు ఉన్నచోట చీకటి మాయమౌతుంది. ధైర్యం ఉన్న చోట భయం పారిపోతుంది!" అంది.

"అవును నిజమే!" అన్నాడు వాళ్ళ నాన్న.

మరెప్పుడూ చీకటికి భయపడలేదు బాలు.

# భవతీ భిక్షాందేహీ...!

తురగా జయశ్యామల

**విశిష్ట అతిథి కథ**

***"ఎయిర్‌పోర్ట్‌కి వచ్చేవాళ్ళు హడావుడిగా వుంటారు. వాళ్లకి సెండాఫ్ ఇవ్వడానికి యిచ్చేవాళ్లూ హడావుడి పడుతూనే వుంటారు. ఈ హడావుడిలో అవకాశం చూసుకొని, యిలాంటి వాళ్ళు యిలా గొడవలు చేస్తున్నారు. నిజానికి వాళ్ళకి కారు తగలదు. ఏమీ లేదు. అదంతా పెద్ద డ్రామా! యిలా అల్లరి చేసి డబ్బు గుంజడం వారి వృత్తి. నలుగురూ చూస్తూండగా మనల్ని దోషిని చేసి మాట్లాడితే మనమేం చెయ్యగలం? అదొక ప్రిస్టేజి యిష్యూగా భావిస్తాం.***

'కోటి విద్యలు కూటికొరకే' అనే నానుడి నిజం కాదేమోననిపిస్తుంది. ఒక్కో సంఘటన చూసినా, విన్నా! నిజంగా కూటి కోసమే అయితే.. ఏ విద్యలు ప్రదర్శించినా, 'అయ్యో! పాపం!' అన్న సానుభూతి కలుగుతుంది మదిలో!

కాని, కష్టపడకుండా ఎదుటి మనిషిని దోచుకు తిందామని, జల్సాలు చేసుకుందామని అనుకునేవారి మీద ఏ విద్యలు ప్రదర్శిస్తే మాత్రం సానుభూతి దక్కుతుంది?

అసలేం జరిగిందంటే...

ఉదయం తొమ్మిది గంటల సమయం. ఆఫీసుకెళ్ళే హడావుడిలో వుండి బ్రేక్‌ఫాస్ట్ చేస్తూనే, ఓ పక్క బి.బి.సి. న్యూస్ చూస్తున్నాను. ఇంతలో ఫోన్ రింగ్ అయింది. నాతోపాటే వచ్చి, మధ్యలో స్కూలు దగ్గర దిగిపోవడానికి రెడీ అయి కూర్చున్న మా అమ్మాయి శ్రవ్య ఫోను తీసుకుంది. క్షణమైనా గడవక ముందే, "డాడీ! రావు అంకుల్!" అని అరిచింది.

నేను లేచి రిసీవరు అందుకుని 'హలో!' అన్నాను. అవతల నుంచి రావు మాట్లాడుతున్నాడు. "హలో! హౌ ఆర్యూ? క్షేమంగా జేరావా? వెరీగుడ్. ఆ.. ఆ! నేననుకుంటూనే ఉన్నాను. నా కోసం ఎదురుచూసి ఉంటావని! ఆ ఏదో చిన్న గొడవ... రాలేకపోయాను. చివరిగా సెండాఫ్ ఇవ్వలేకపోయాను. ఓ.కె. ఓ.కె. బెస్ట్ ఆఫ్ లక్!" రిసీవర్ క్రెడిల్ చేసాను.

"ఆయన కులాసాగా చేరారా?" మా ఆవిడ ప్రశ్నించింది.

"కాబట్టే ఫోను చేసాడు! ప్లేను ఎక్కే ముందు మళ్లీ కలుసుకోలేకపోయాను కదా, ఆ గొడవలో పడి!" అన్నాను బ్రేక్‌ఫాస్ట్ ముగించి లేస్తూ.

“నిజమే అక్కర్లేని గొడవ జరిగింది. అయినా ఎయిర్‌పోర్టు దగ్గర అటువంటి ముఠాలు తిరుగుతున్నప్పుడు పోలీసులు ఎందుకు పట్టుకోరు?” అడిగింది మా ఆవిడ.

ఆ ప్రశ్నకు సమాధానం అంత తేలిక కాదు. ఎందుకంటే కూటి కోసం కోటి విద్యలన్నది సామెత అయితే, థ్రిల్ కోసమో, సరదా కోసమో, కష్టపడకుండా సాటిమనిషిని దోచి ఆనందించే స్వభావమో... ఎన్నో రకాల వృత్తులు! సాధారణంగా కాస్తో కూస్తో ఉన్నవాడిని చూస్తే లేనివాడికి కడుపు మంట. అందులోనూ ఇవాళ సినిమాలు, సాహిత్యమూ కూడా ఉన్నవాడిని దోచుకు తినే హక్కు, అధికారం.. లేనివాడికి ఉన్నాయనే కదా ప్రబోధిస్తున్నది. అందువల్ల దౌర్జన్యం చేసి బ్రతకడమే తమ హక్కులా ప్రవర్తించే వాళ్ళు లేకపోలేదు.




రెండు రోజుల క్రితం జరిగిందీ సంఘటన! నాకు బాగా గుర్తు. ఎందుకంటే, ఆ సంఘటన వల్ల నా మనసు అంతగా పాడయిపోయింది కాబట్టి!

మొన్న రాత్రి పది గంటల సమయంలో ఫోన్ రింగయింది. భోజనం కానిచ్చి తీరుబడిగా టి.వి. చూస్తున్న నేను ఫోనందుకుని చూస్తే నా చిన్ననాటి మిత్రుడు రావు. ఇద్దరం ఊళ్ళో ఆరో క్లాసు నుంచి, డిగ్రీ పూర్తి చేసే వరకు కలసి చదువుకున్నాం. తర్వాత నేను ఎమ్.బి.ఎ. చేసాను. రావు ఎమ్. టెక్‌లో జాయిన్ అయ్యాడు. నేను బోంబేలో ఒక పెద్ద కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా వున్నాను. రావు ఇక్కడ ఎమ్.టెక్ కంప్లీట్ చేసాక డాక్టరేటు చేయడానికి యు.ఎస్.ఎ. వెళ్ళాడు. ఆ తర్వాత అక్కడ అమ్మాయిని.. అంటే అక్కడ స్థిరపడ్డ భారతీయ ఫామిలీలోని అమ్మాయినే వివాహం చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలు. అక్కడ సెటిలయిపోయినట్లే! ఏ మూడు నాలుగేళ్ళకోసారో ఇండియా వస్తూంటాడు ఫామిలీతో, బంధువులందరినీ చూసిపోవడానికి! పది రోజుల క్రితం

రావు దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. అది గుడివాడ నుంచి రాసాడు. వాళ్ల అన్నగారెవరో హఠాత్తుగా పోవడంతో తను ఒక్కడినే వచ్చానని, తిరిగి వెళ్లేటప్పుడు బొంబాయిలో కలుద్దామని రాసాడు. ప్రతిసారీ మా యింట్లో దిగి ఒక రోజైనా ఉండి వెళ్లేవాడు కాని, యిప్పుడు హోటలు లీలీపెంటా నుంచి ఫోను చేశాడు.

"అదేమిటి? ఎప్పుడూ ప్రయాణం? ఇంటికి రాకుండా వెళ్లిపోతావా?" అడిగాను నేను.

"ఈసారి అవదులే శర్మా! హైదరాబాదు ప్లేను డిలే అయింది. యిప్పుడే వచ్చాను. తెల్లారిగట్ట మూడున్నరకి ప్లేను. నిన్నీసారి చూడడం పడదేమో?"

"అలా ఎందుకనుకుంటున్నావు? నువ్వు రాలేకపోతే, నేనే వస్తాను!" అని రూము నెంబరు తీసుకొని ఫోను క్రెడిల్ చేసాను.

పావుగంటలో రెడీ అయి రాత్రి పదిన్నర గంటలకి సహారా ఎయిర్పోర్ట్‌కి కొంచెం దగ్గర్లో వున్న లీలీపెంటా హోటలుకి బయల్దేరాను. యింతకు ముందు ఆ హోటల్‌కి చాలాసార్లు వెళ్లాను, బిజినెస్ పనులమీద. బిజినెస్ మీటింగులు.. పెద్ద పెద్ద నిర్ణయాలు..! ఫైవ్ స్టార్ హోటలు చాలా గొప్పగా వుంటుంది. రూములో రావుని కలుసుకున్నాను. ముందుగా రావు బ్రదర్ పోయినందుకు నా సంతాపం ప్రకటించాను రావుని ఆలింగనం చేసుకొని! రెండేళ్లకో మూడు నాలుగేళ్లకో కలుసుకుంటూనే వున్నా, ఎప్పుడూ ఎడతెగని కబుర్లే మాకు. చిన్ననాటివి.. స్కూలు, కాలేజి కబుర్లు, మాతో చదువుకున్న అమ్మాయిలు, అబ్బాయిలు, మా అన్నదమ్ముల పిల్లలు, వాళ్ల అన్నదమ్ముల పిల్లలు.. యిలా ఎన్నెన్నో..!

రావు జిన్ తెప్పించాడు రూము సర్వీసుబోయ్ చేత! దానితోపాటే పెప్పర్ పాపడ్స్, కాజునట్స్, చికెన్ పకోడా... అప్పటికే నేను భోజనం చేసి వున్నానేమో, రావుకి కంపెనీ యిస్తూ కొంచెంగా తీసుకున్నాను.

టేబిల్ మీదున్న త్రిబుల్ ఫైవ్ సిగరెట్ ప్యాక్, లైటరూ తీసుకొని కర్టెన్ తొలగించి బయటకు చూసి, "బయట వర్షం పడుతోంది!" అన్నాడు రావు.

"అవును! ఇది జూలై నెల కదా! జూన్, జూలై, ఆగస్టు నెలల్లో వర్షం ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో చెప్పడం కష్టం!" అన్నాను నేను... రావు ఆఫర్ చేయడంతో ఓ సిగరెట్ నేను కూడా ముట్టిస్తూ!

"బొంబాయి వర్షాల గురించి అప్పుడప్పుడూ మాకు న్యూస్ వస్తుంటుంది స్టేట్స్‌కి. చాలా తీవ్రంగా ఉంటాయి కదా!" నవ్వుతూ అడిగాడు రావు.

"అవును! ఒక్కోసారి కురవడం మొదలు పెట్టాయంటే వారమయినా తగ్గవు. జనజీవనమంతా స్తంభించి పోతుంది. విచిత్రం ఏమిటంటే, యిక్కడెంత వర్షం కురిసినా, ఎక్కడో మరీ పల్లపు ప్రాంతాలు తప్ప సాధారణంగా నీరంతా క్లియరయి పోతుంది. డ్రైనేజ్ సిస్టమ్ బావుంటుంది. అయినా ఒక్కోసారి తప్పవు. వర్షాకాలంలో ట్రాఫిక్ కంట్రోల్ చేయడం చాలా కష్టం. అయినా బొంబాయి, ట్రాఫిక్ పోలీస్ డిపార్టుమెంటు సమర్థవంతంగా పనిచేస్తుంది. ఎంత ట్రాఫిక్ అయినా చక్కగా కంట్రోల్ చేస్తారు. చాలా స్ట్రిక్ట్. ఇంకో విషయం తెలుసా నీకు. స్కాట్లాండ్ యార్డ్ పోలీసుల తర్వాత బొంబాయి పోలీసుశాఖ అంత సమర్థవంతమయినదన్న పేరుంది. అయినా, బొంబాయిలో జరిగే నేరాలకి అంతులేదనుకో! దేనిదారి దానిదే అన్నట్లుంటుంది!"

"యిక్కడున్నంత మాఫియా గ్యాంగులు ఇంకెక్కడా లేవంటారు."

"ఆ! స్మగ్లింగ్‌కి పుట్టిల్లు యిది. అందుకే హిందీ సినిమాలన్నీ దాని చుట్టూనే తిరుగుతుంటాయి, వేరే కథల్లేక!" నవ్వాను నేను.

రావు కూడా నవ్వుతూ టైమ్ చూసుకొని, "అప్పుడే ఒంటి గంట అయింది. నీకు లేటవదూ?" అన్నాడు.

"ఫరవాలేదు! నిన్ను ఎయిర్పోర్టు దగ్గర డ్రాప్ చేసి వెళ్తాను!"

"రాత్రంతా నిద్రలేక... ఉదయం ఆఫీసుకెళ్లాలి నువ్వు?"

"నాకిలా అలవాటే, నిద్ర లేని రాత్రుళ్లు గడపడం! బిజినెస్ మీటింగులు, టూర్లు... రెండేసి రోజులు నిద్రపోవడమంటూ వుండదు!"

"అలా వుంటే హెల్త్ పాడవదూ? పని టైములో పని.. విశ్రాంతి టైమ్‌లో విశ్రాంతి వుండాలి. అసలే బొంబాయిలో పరుగిడే టైమూ.. ట్రాఫిక్ టెన్షనూ?"

"మీ అమెరికాలో వేగం కంటేనా?"

"ఆ వేగంలో అంత టెన్షను వుండదు శర్మా! ఎన్ని గంటలు కారులో ప్రయాణం చేసినా అలసట, చికాకు కలగవు. యిక్కడ అలా కాదుగా!"

యిలాగే మరేవో మాట్లాడుకుంటుండగానే, మరో అరగంట నడిచిపోయింది.

"యింక నేను రెడీ అవుతాను! రిపోర్టింగ్ టైమ్‌కి అక్కడ వుండాలిగా!" అంటూ స్నానం అవీ కానించి రావడానికి బాత్‌రూమ్‌లోకి వెళ్లాడు రావు.

రావు తిరిగి వచ్చేవరకు టీపాయ్ మీదున్న మేగజైన్స్ చూస్తూ టైమ్ పాస్ చేసాను. మరో పావుగంటకంతా రూములో సామాను తీసుకొని క్రిందకి వచ్చేసాం. రిసెప్షన్‌లో బిల్లు పేచేసి రూమ్‌కీ యిచ్చేసాడు రావు. అంత అర్ధరాత్రి అయినా దేదీప్యమానంగా వెలుగుతున్న లైట్లతో, సెంటర్ హాల్లో చక్కగా అమర్చిన వాటర్‌ఫాల్స్‌తో, అక్కడక్కడా వున్న జనంతో సందడిగా వుంది ఆ హోటలు.

బయటకు వచ్చేసరికి యింకా వర్షం కురుస్తూనే వుంది. అంటే మరీ ఉధృతంగా కాదు. పెద్ద జల్లుగా పడుతోంది. రావుని అక్కడే వుండమని, కార్ పార్కు చేసిన వేపు పెద్ద పెద్ద అడుగులేసుకుంటూ వెళ్లాను. కారులోకి చేరే లోపే భుజాలు, తల.. జల్లుతో తడిసిపోయాయి. రెయిన్‌కోటు గాని, అంబ్రెల్లా గాని తెచ్చుకొని వుండాల్సింది అనుకున్నాను.

అయిదు నిమిషాల లోపే సహారా ఎయిర్పోర్టు చేరాం. రావు కారు దిగి, లగేజి పెట్టుకోవడానికి ట్రాలీ కోసం వెళ్లి తెచ్చుకున్నాడు. సూటుకేసులు రెండూ పెట్టుకుని "చెకింగ్‌కి యిచ్చేసి వస్తాను!" అని చెప్పాడు రావు నాతో.

రావు ట్రాలీ తోసుకుంటూ వెళ్లిపోయాడు లోపలికి.

నా కారు ముందు మరో అంబాసిడరు వచ్చి ఆగింది. అందులోంచి పెద్ద పెద్ద సూటుకేసులు దింపుతున్నారు. ఎవరో దుబాయ్ వెళ్ళేవాళ్లు అయి వుంటారు. ముందుకు వెళ్లడానికి, ఆ కారు నా కారుకి మరీ దగ్గరగా వుండడంతో, రివర్స్ తీసుకోవలసి వచ్చింది.

నేను రివర్స్ తీసుకొన్నాను. గేరు మార్చి ముందుకు వెళ్లాలనుకునేంతలో ఏం జరిగిందో నాకు తెలియదు. ఆ స్త్రీ పెద్దగా ఏడవడం, నలుగురు మగాళ్లు అటు, యిటు కారుని చుట్టుముట్టడం.. కన్నుమూసి తెరిచేటంతలో జరిగిపోయింది. వాళ్లు నా కారు కదలకుండా ఆపేశారు.

ఏం జరిగిందో అని నేను, "ఏం జరిగింది" అనడిగాను హిందీలో.

ఆ నలుగురు మగవాళ్లు కారులోంచి నన్ను దిగమని గట్టిగా అరిచారు.

"ఎందుకని?" అడిగాను మళ్లీ.

అందులో ఒకతను పెద్దగా అరుస్తూ ఎందుకేమిటి? మీ కార్లున్న వాళ్లకి కళ్లు కనిపించవు. నా భార్య కాళ్లు విరగ్గొట్టేశావు!" అన్నాడు హిందీలోనే.

ఏం జరిగిందో తెలీని నేను.. వాడి అరుపులకి, అయోమయంగా క్రిందకు దిగాను, కారులాక్ చేసి! నా కారు పక్కనే పేవ్మెంటు మీద ఒక స్త్రీ రెండు మోకాళ్లు పట్టుకుని, అటూ, యిటూ దొర్లుతూ ఏడుస్తుంది. ఆమె చుట్టూ నలుగురయిదుగురు ఆడాళ్లు, మగాళ్లు చేరి గోలగోలగా మాట్లాడుతున్నారు.

అంతలో ముందుగా అరచినతనే మరల చెప్పాడు. "నీ కారు వెనక్కి తీసుకున్నప్పుడు, అక్కడ కూర్చున్న నా భార్య కాళ్లకు తగిలింది. మోకాళ్లలో ఎముకలు విరిగిపోయాయో ఏమిటో! చూడు, ఎలా బాధపడిపోతుందో!"

"నా కారు తగలడమేమిటి?" నిజంగానే తెల్లబోయాను.

నాది మారుతి కారు. అది అంత పెద్ద హెవీ వెహికల్ కాదు. రివర్స్ తీసుకుంటున్నప్పుడు నేను వెనక్కి చూస్తూనే వున్నాను. ఎవరూ వున్నట్లు కనిపించలేదు. తగిలినట్లు అన్పించలేదు. కాని, నా మాట వినరే వాళ్లు!

"నీ కారే తగిలింది. కాళ్లు రెండూ దెబ్బతిని పోయాయి" అని తోచనీయకుండా ఒకటే గోల. అప్పటికీ.. ఒకరూ, ఇద్దరూ జనం చేరుతున్నారు. ఫారిన్ ప్లేనులన్నీ బయల్దేరే సమయం ఇంచుమించు అదే కాబట్టి, వచ్చే కార్లు, పోయే కార్లతో అక్కడంతా హడావుడిగా వుంది. ఎవరి గురించి పట్టించుకునే తీరిక ఎవరికీ లేదు అక్కడ.

నాకీ గొడవంతా చికాకు కలిగిస్తుంది. అందులో పైనుంచి సన్నగా జల్లు పడుతోందేమో అదొక విసుగు. "తగిలితే ఏం చెయ్యమంటావు?" అనడిగాను అసహనంగా.

"ట్రీట్మెంట్‌కి డబ్బివ్వండి!" అందులో ఒకడన్నాడు.

నేనేదో అనే లోగానే హవాల్దార్ వచ్చాడు అటు, 'ఆగేచలో! ఆగేచలో!' అంటూ! అప్పటికే.. కార్లు ఒక దాని వెనుకగా ఒకటి వచ్చి ఆగి, హారన్లు వేస్తున్నాయి.

హవల్దారుతో ఇదంతా చెప్పాలన్నా కుదరక, కారులో కూర్చుని స్టార్ట్ చేసి ముందుకు పోనిచ్చాను. నా కారుతోనే వాళ్లు పరుగెత్తుకు వచ్చారు.

బాగా ముందుకి పోయి, కారాపి దిగాను. "నేను డబ్బు ఎందుకివ్వాలి మీకు?" అనడిగాను గట్టిగా. "కారు కాళ్లకు కొట్టేసి, పారిపోతే సరిపోతుందా? ఆ అమ్మాయికి ఎముకలు ఫ్రాక్చర్ అయ్యాయో, ఏమో! ఖర్చులకు వద్దా?" అనడిగాడు వారిలో ఒకడు.

ఇంతలో నాకు కొంత దూరంలో ఓ హవల్దారు కన్పించాడు. "రండి! అతనితో మాట్లాడుదాం!" అంటూ కదలి అతని దగ్గరకి వెళ్లి జరిగినది చెప్పాను.

"ఏమో సార్! ఏం జరిగిందో నేను చూడలేదు కదా! ఆ క్రింద దిగువనే పోలీస్ స్టేషను వుంది అక్కడికి వెళ్లండి" అన్నాడు. అతను అలా అనేసరికి వాళ్లకి బలమొచ్చేసింది మరింతగా. "పోలీసు స్టేషనుకి మీరే రండి సార్! డాక్టరు దగ్గరకి వెళ్లి మాట్లాడదాం. ట్రీట్మెంట్‌కి ఎంతయితే అంత మీరే యిద్దురు గాని!" అన్నాడు ఒకడు.

అప్పటికే దాదాపు అరగంటయింది. రావు లోపలికి వెళ్లి లగేజి చెకింగ్‌కి ఇచ్చేసి వచ్చి, నా కోసం వెతుకుతున్నాడో ఏమిటో? అలాని వాళ్లని వదిలించుకు వెళ్లడం ఎలా? వాళ్ళు అడిగారు కదాని, నా తప్పు లేకపోయినా డబ్బివ్వడం నాకిష్టం లేదు. అలాని వాళ్ల వెంట డాక్టరు దగ్గరకీ, పోలీసు స్టేషనూ అంటూ తిరుగుతూ కూర్చుంటే తెల్లారిపోతుంది. ఏమిటి చెయ్యడం?

అప్పటికే ఒకటి రెండు నిమిషాలు తక్కువగా మూడుగంటలవుతోంది. రావు నాకోసం వెయిట్ చేస్తున్నాడేమో! అతనికి సెక్యూరిటీలోకి వెళ్లిపోయే టైమ్ కూడా అయిపోతుంది. యింక ఆలోచించలేదు నేను. పర్సులోంచి రెండొందలు తీసి ఒకతని చేతిలో పెట్టబోయాను.

"ఏమిటి సార్! మాకొద్దు. పదండి డాక్టరు దగ్గరకు. ఆయనెంత చెబితే అంతే ఇవ్వండి!" పేచీగా అన్నాడు వాడు. నిజంగా నాకా సమయంలో ఎంత కోపమొచ్చిందంటే, చేతిలోని పర్సు వాడి ముఖాన కొట్టాలనిపించింది. కాని, కంట్రోలు చేసుకున్నాను. వాడితో మరల మాట్లాడ బుద్ధివేయలేదు కూడా! పర్సులోంచి మరో మూడొందలు తీసి వాడి చేతిలో పడేసినట్లుగా పెట్టి, "యిక పొండి"! అని అరిచాను హిందీలో.

గారపళ్లు కన్పించేలా నవ్వుతూ, ఆ నలుగురూ అక్కడ నుంచి కదిలారు.

నేనింకేమీ, ఆలస్యం చేయకుండా, కారు స్టార్ట్ చేసి ముందుకు పోనిచ్చాను. క్రింద పార్కింగ్ ప్లేసులో పార్క్ చేసి, గబగబ నడుచుకుంటూ, గ్రౌండ్‌ఫ్లోర్ నించి లిఫ్ట్‌లో పైకి వచ్చాను. కాని, అప్పటికే టైము మూడూ ఇరవై అయిదు నిముషాలు. రావు వెళ్ళాల్సిన ప్లేను మరో అయిదు నిముషాల్లో టేకాఫ్‌కి సిద్ధంగా ఉందని అనౌన్స్మెంట్ విన్పిస్తోంది. అంటే రావు అప్పటికే ప్లేను ఎక్కేసి ఉంటాడు. 'బుల్షిట్' కోపంగా అనుకున్నాను. ఏం అనుకుంటే ఏ లాభం? రావు చెకింగ్ అయిన తర్వాత నా కోసం వచ్చి వుంటాడు. కల్సుకోలేకపోయాను. ఇంటికి వచ్చేసరికి నాలుగున్నర గంటలయింది.

యిదంతా ఏదో మాటల్లో మరుసటిరోజు నా ఫ్రెండ్‌తో చెప్పాను.

అతను చెప్పిన విషయం విని నాకు ఆశ్చర్యం వేసింది.

"ఏర్‌పోర్ట్‌కి వచ్చేవాళ్ళు హడావుడిగా వుంటారు. వాళ్లకి సెండాఫ్ ఇవ్వడానికి యిచ్చేవాళ్లూ హడావుడి పడుతూనే వుంటారు. ఈ హడావుడిలో అవకాశం చూసుకొని, యిలాంటి వాళ్ళు యిలా గొడవలు చేస్తున్నారు. నిజానికి వాళ్ళకి కారు తగలదు. అదంతా పెద్ద డ్రామా! యిలా అల్లరి చేసి డబ్బు గుంజడం వారి వృత్తి. నలుగురూ చూస్తూండగా మనల్ని దోషిని చేసి మాట్లాడితే

మనమేం చెయ్యగలం? అదొక ప్రిస్టేజి యిష్యూగా భావిస్తాం. చిన్నతనంగా ఫీలవుతాం. వాళ్ళని వదిలించుకోవడానికి ప్రయత్నిస్తాం. అంతేగాని, ఈ గొడవలు సాగదీస్తూ కూర్చోడానికీ, వాళ్ళతో పాటు పోలీసు స్టేషన్లూ, ఆస్పత్రులూ అంటూ తిరగడానికి మనకి టైముండదని వాళ్ళకి తెలుసు. ఇదొక ఎక్స్ప్లాయిటేషన్. అవునా?" ఆలోచిస్తే అతను చెప్పింది నిజమేననిపిస్తుంది. ఆ సమయంలో ఆలోచించడానికి తోచదు. తోచనివ్వకుండా చేస్తారు వాళ్ళు. ఔరా! ఇదెక్కడి కలికాలం?

అదిరించి, బెదిరించి, మోసం చేసీ ఎదుటివ్యక్తిని దోచుకు తినాలనుకునే ఈ లోపం వ్యక్తిదా? వ్యవస్థదా? కష్టించి, సంపాదించుకోవడం కంటే, ఒక అరగంట డ్రామా ఆడితే సులభంగా డబ్బు చేతిలో పడుతుంది వాళ్ళకి! ఇంత బహిరంగంగా ఈ ముఠాలు యిలా పరువు, మర్యాద కలవాళ్ళని అల్లరి పెడుతున్న విషయం ఎయిర్‌పోర్ట్స్ అధికారులకి గాని, పోలీసులకు గానీ తెలీదా.. అన్న ఆలోచన నన్ను వీడడం లేదు. ఈ మోసం, దోపిడీకన్నా 'భవతీ భిక్షాందేహీ' అని యాచించడం మేలేమో!

ఏమయినా, వ్యక్తి నైతిక బాధ్యతతో తనని తాను సంస్కరించుకుంటే, వ్యవస్థ కూడా తనంతట తాను మారదా? అని కూడా అనిపించసాగింది నాకు.

"డాడీ, నాకు స్కూలుకి టైమయిపోయింది. ఏమిటి అలా ఆలోచిస్తూ ఉండి పోయారు?" శ్రావ్య అడిగింది గట్టిగా. "ఆ! పద... పద!" అంటూ లేచాను. ఆఫీసుకు వెళ్ళడానికి రెడీ అవుతూ.

*("రచన" మాసపత్రిక మార్చి 1993 నుంచి పునర్ముద్రణ)*

# మద్రాసు ఏమయేటట్టు?

## కీ. శే. వాసిరెడ్డి నారాయణరావు

**కథా మార్గదర్శి కథ**

***భార్య గురించిన ఊహలు పరిపరి విధాలుగా పోయినై సీతారామయ్య బుర్రలో! ఏమైపోయి ఉంటుందో ఏమో? ఆడది... అందులో ఒంటరిగా ఈ పట్టణంలో! అలా ఆలోచించుకుంటూంటే సీతారామయ్య గుండెలు బరువెక్కి పోయినై. ఆ రాత్రి పెళ్లాన్ని తలంచుకుంటూ సీతారామయ్య మద్రాసునీ, మద్రాసులో ఉన్న జనాల్నీ ఎన్ని శాపనార్థాలు పెట్టాడో మరి.***

మద్రాసు సెంట్రల్‌లో రైలు ఆగుతుండగానే లోపల కూచున్న సీతారామయ్యకు చెమట్లు పోసినై!

చిరకాలంగా మద్రాసు చూడాలన్న సీతారామయ్య కోర్కె ఫలించింది. పిల్లవాడి మొక్కు చెల్లించుకునేందుగ్గాను, సీతారామయ్య కుటుంబ సమేతంగా తిరుపతి వెళ్ళి, ఏడుకొండలవాడి దర్శనం చేసుకొని, మొక్కుబడులు చెల్లించుకొని, ఇంత దూరం వచ్చాక అడుగు దూరంలో ఉన్న మద్రాసుని చూడకుండా ఎలా పోవడమా అని ఆలోచించిన సీతారామయ్య.. తల్లినీ, భార్యనూ, కొడుకునూ వెంటేసుకొని గూడూరు మీదుగా మద్రాసు వచ్చాడు.

సీతారామయ్య యువకుడైనా పాతకాలం మనిషి. అతనికి మద్రాసు చూడాలన్న కోరిక ఈనాడు కలిగినది కాదు. చిన్నప్పుడు మద్రాసు చూసొచ్చిన శంకరయ్య మాటలు విన్నప్పుడే అతనికి కలిగింది. శంకరయ్య 'బతికిన కాలేజీ', 'చచ్చిన కాలేజీ', 'చైనా బజారు' గురించి చిత్రవిచిత్రంగా ఈనాటికీ చెప్తుంటాడు. అది వింటున్నంత సేపూ సీతారామయ్య 'దీంతస్సాచెక్కా.. అదెప్పుడైనా సూడాల్సిందేయహీ!' అనుకునేవాడు మనసులో! ఆర్థిక కారణాలూ, ఇతరత్రా కాలం కలిసి రాకపోవడం వల్లా మనసులో కోరిక మనసులోనే ఉండిపోయింది.

సీతారామయ్య మూడుముళ్లూ వేసుకున్న మరుసటి సంవత్సరంలోనే ఒక నలుసు కలగడమూ, వాడి పుట్టెంట్రుకలు తిరుపతి ఏడుకొండలస్వామికే ఇవ్వాలని అటు పెళ్ళాం తరుపు వాళ్లూ, ఇటు తన వాళ్లూ మొండికేసుక్కూచోడం వల్లనూ.. సీతారామయ్యకు తిరుపతి యాత్ర చేయడం తప్పింది కాదు. వారం రోజుల్లో తిరుపతి వెళ్ళాలనుకుంటున్న సమయంలో ఓ చిన్న గమ్మత్తు జరిగింది.

మీ రాష్ట్రం మీకిస్తామంటూ ప్రధాని చేసిన ప్రకటన పురస్కరించుకొని, తెలుగు జిల్లాల్లో పరిస్థితులు దర్యాప్తు చేయడానికి వచ్చిన అధికారి, సరిగ్గా వాళ్లూరే రావడం జరిగింది. ఆ రోజున జరిగిన బ్రహ్మాండమైన ప్రదర్శనలో.. ముఖ్యంగా

సీతారామయ్యను ఆకర్షించినది 'మద్రాసు మనదే' సంఘం వాళ్ళు చేసిన హడావుడి! 'మద్రాసులోనే మా..' రాసి ఉన్న అట్ట మోసుకొని సీతారామయ్య, ఆయనగారి కారుకడ్డంగా పరుగెత్తుకెళ్లి, ఓ పొలికేక పెట్టాడు "మద్రాసు మాదే" నని! సీతారామయ్యకు ఆరోజు శివమెత్తిపోయిందంటే నమ్మండి. ఆయన చేసిన ఆర్భాటం అంతా ఇంతా కాదంటే నమ్మండి.

అప్పట్నుండీ మద్రాసు ఎప్పుడెప్పుడు పోదామా అని ఉబలాటపడిపోయాడు. సరే, పనిలో పని కలిసొచ్చిందని ముసలితల్లినీ, పెళ్లాన్నీ, కొడుకునీ తీసుకుని తిరపతి బండెక్కేసాడు. తిరపతి కొండమీద మొక్కుబడి తీర్చుకొని గూడూరు వచ్చి, మద్రాసు బండిలో, అదీ ఎక్స్‌ప్రెస్... అవస్థ పడి ఎక్కింది సీతారామయ్య కుటుంబం.




బండి మద్రాస్ స్టేషన్‌లో ఆగీ ఆగక ముందే, కిటికీ గుండా బయటకు దూకేసాడు సీతారామయ్య. అలా దూకడం అతనికి వాళ్ళ స్టేషన్‌లో అలవాటు మరి. వాళ్ళ స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రెండు నిమిషాల కంటే ఎక్కువ ఆగదుగా!

భార్య అచ్చమ్మ.. చంకలో ఉన్న పిల్లాడ్ని భర్తకందించి తనూ దిగింది. ప్లాట్‌ఫార్మ్‌పై తిరుగుతున్న రకరకాల మనుషుల్ని బెదురు బెదురుగా చూస్తూ నించొని ఉంది. సీతారామయ్య ముసలమ్మను దించుకొనే లోపల కూలీలు తలో సామాను పట్టుకొని నించున్నారు.

కూలీల దగ్గర నుండి సామాను గుంజుకునేసరికి.. సీతారామయ్య తలప్రాణం తోక్కొచ్చింది. అయినా కూలీలు వాళ్ళ చుట్టూ మూగి, తమాషాగా మాట్లాడడం మొదలుబెట్టారు. అందులో ఒకడు అచ్చమ్మ చేతిలో ఉన్న పచ్చడిజాడీ లాక్కొని "వామ్మో! పోదాం!" అన్నాడు.

సీతారామయ్యకు అది చూసేసరికి అరికాలిమంట నెత్తికొచ్చింది. శంకరయ్య చెప్పిన మాటలు గుర్తున్నై! దడుస్తే లాభం లేదని, కూలీ మీదకు ఒక్క దూకు దూకి, వాడి చేతిలో ఉన్న జాడీ లాక్కోబోయాడు. వాడు విసురుగా అది కింద పడేసి, "మొట్టైగళకు ఎన్నాదుకుడా కూలీ" అంటూ వెళ్లిపోయాడు.

"అయ్యో నా జాడీ" అంటూ ముసలమ్మ కేకేసింది. అచ్చమ్మ అయోమయంగా మొగుడికేసి చూసింది. సీతారామయ్య కళ్లెర్రజెసి, పళ్ళు కొరుక్కున్నాడు. పాపం అంతకన్నా చేయగలిగిందేమీ లేదు. అదే వాళ్ళూళ్ళో అయితే, వొసిగొయ్యా తిరగేసి, దబదబా నాలుగు బాదేసి ఉండేవాడు వాడ్ని!

ప్లాట్ ఫార్మ్ మీద తిరుగుతున్న జనం వాళ్ళ దగ్గరకు రాగానే ఓ క్షణం ఆగి, అదో మాదిరిగా చూసి నవ్వి పోతున్నారు. దానిక్కారణం.. వాళ్ళు తిరపతి దేవుడికి మొక్కు చెల్లించుకు రావడమే! ఆ సంగతి పెళ్ళాం నున్నటి తల చూసే దాకా సీతారామయ్యకు అర్థం కాలేదు. స్టేషన్లో దిగిన గాభరాలో అచ్చమ్మ నెత్తి మీదకు చెంగు లాక్కోవడం మర్చిపోయినట్టుంది.

"ఒసేయ్ బోడీ, తలమీద గుడ్డేసుకోయే" కారం రాసుకున్నట్టుగా అన్నాడు సీతారామయ్య.

అచ్చమ్మ మొగుడి తలకేసి చూసింది. ఏదో చప్పున గుర్తొచ్చినవాడిలా.. పై పంచ తీసి తలకు చుట్టుకున్నాడు. ఇదేమీ పట్టనట్టు కుర్రాడు ముసలమ్మ బోడితల మీద గిలక్కాయవేసి కొడ్తూ ఆడుకుంటున్నాడు.

ఎలా అయితేనేం, సీతారామయ్య కుటుంబం స్టేషన్ దాటి బయటకు వచ్చింది. "కన్నయ్యశెట్టి సత్రం ఎక్కడండీ?" దారిన పోతున్న ఒకాయనను అడిగాడు సీతారామయ్య. ఆ వ్యక్తి ఏదో చెప్పాడు. తెలుగ్గానే ఉంది గాని, సీతారామయ్యకు అర్థం కాలేదు. పంచె కట్టుకొని తెలుగువాళ్లలా ఉన్న ఇద్దరు వ్యక్తులను చూసేసరికి ప్రాణం లేచొచ్చింది. దగ్గరకు పోయి, ఆప్యాయంగా అడిగాడు అదే ప్రశ్న.

అందులో ఒకాయన ముఖం చిట్లించుకొని "ఎగ్మూరు పోవయ్యా" అన్నాడు.

సీతారామయ్య నిరుత్సాహంగా వెనక్కు తిరగ్గానే ఇలా వినబడింది... "వెధవ గుంపు... పిల్ల దగ్గర నుంచి తల్లి దాకా బోడి తలకాయలేసుకొస్తారు. ఆ తగలడేవాళ్ళు ముందు మద్రాసు వచ్చి తిరపతి పోగూడదూ!"

"అదేనండీ, మనలాంటి వాళ్ళకు మాట్లాడాలంటేనే అసహ్యమేస్తుంది."

సీతారామయ్య హృదయానికి వాళ్ళ మాటలు ములుకుల్లా నాటినై! తనలో వాళ్ళు అంతగా అసహ్యించుకోవలసినదేముందో అర్థం కాలేదు. 'ఏదో మనవాళ్లు కదా అని ఆశగా పోతే, అంత పరాభవమైంది. నిలబడి మాట కూడా చెప్పలేదే వీళ్ళు! వాడే నయం.. మన మాట తెలియకపోయినా నిలబడి మాటైనా చెప్పాడు' అనుకుంటూ సీతారామయ్య ఎగ్మూరుకు దారి తీశాడు.

పట్నంలో పెద్దబజారులో, ఇవతల నుంచి అవతలకు దాటడమంటే భలే కష్టమని శంకరయ్య చెప్పిందాని వల్ల సీతారామయ్యకు ఇదివరకే తెలుసు. పంచ బిగించి కట్టి, భార్యనూ, తల్లినీ చెరో చేత్తో పట్టుకొని, స్టేషన్ వైపు నుండి హాస్పిటల్ వైపుకు దాట్టానికి తయారయ్యాడు.

రయ్యిన వచ్చే కార్లూ, పోయే కార్లూ, ట్రాములూ రిక్షాలూ అంతా పద్మవ్యూహంలా ఉంది. తెగించి సీతారామయ్య రోడ్డుకు అడ్డం పడ్డాడు. అవతలికి చేరేసరికి, ప్రవహిస్తున్న మృత్యువును దాటినంత పనైంది. అటుపక్క ఓ రెండు ట్రామ్ బళ్లూ, ఇటు ఓ రెండు బస్సులూ ఆగడం, అందులో వాళ్లు సీతారామయ్యకు ఓ నాలుగు పెట్టడం.. అతనేమీ పట్టించుకున్నట్టు లేదు. మొదట వాళ్ళన్నదేదో అర్థమై ఛస్తేగా!

ముసలమ్మ రోడ్డు మధ్యకు రాగానే, నోరు తెరుచుకొని అలాగే పైకి చూసింది.

“అదేందే పైకి సూస్తావ్ ట్రామ్ బండొస్తుంటేనూ?”

“అదికాదురా సీతాయ్, ట్రామ్ బండి తీగ మీద నడుసుద్దంటారు గాదురా? మరి భూమ్మీదే పోతుంది గదరా?” అంది ముసలమ్మ ట్రామ్ లైను దాటుతూ.

కన్నయ్య శెట్టి సత్రం చేరడానికి, వాళ్ళు పడ్డ అవస్థ మళ్ళీ సీతారామయ్యే చెప్పాలి లెండి.

రెండో రోజు సాయంత్రం.. స్టూడియోలు చూడ్డానికని పెళ్లాన్ని తీసుకొని బయల్దేరాడు సీతారామయ్య. సినిమాలు తీసేకాడికి పోయి సూడాలని అచ్చమ్మకు చిన్నప్పటి నుంచీ ఉబలాటం!

మొగుడూ పెళ్ళాం ఎక్కడికి పోబోతున్నదీ కనిపెట్టేసిన ముసలమ్మ అంది “బాలరాజు యాసం కట్టినోన్ని నాకు సూపించరంటరా?”

“ఓసినీ మీదో తగలాటకం. ఆడకు నువ్వేడ వత్తావే? ఆడకు పోడం కష్టం! నీకు మూరు మార్కీటు సూపిత్తాలే తిరిగొచ్చాక” అని ముసలమ్మకు చెప్పి మొగుడూ పెళ్ళాం బయలుదేరారు.

దంపతులిద్దరూ ఎగ్మూరులో ఉన్న కన్నయ్యశెట్టి సత్రం దగ్గర నుంచి సరాసరి నడిచొచ్చి, పారిస్ కార్నరులో నంబరు పదిహేడు బస్సెక్కారు.

బస్సు కదలగానే, అచ్చమ్మ ఎదురు సీట్లో ఉన్నాయన వొళ్ళోకి ఎగిరి పడడం, దాంతో ఆయన లేచి మర్యాదగా సీటు ఇవ్వడమూ జరిగింది. అది చూసేసరికి, సీతారామయ్యకు ఒళ్ళు మండిపోయింది. అంతటి కోపాన్నీ అంగుట్లోనే ఇముడ్చుకున్నాడు సీతారామయ్య. ఆ సీతారామయ్యే.. ఇంటి దగ్గర ఒకసారి జీతగాడ్ని రాసుకు తిరిగిందన్న కారణంగా పెళ్లాన్ని గొడ్డును బాదినట్టు బాదేసాడు.

బస్ కండక్టర్ ‘మున్నాలే పొంగో’ గొడవకు తట్టుకోలేక, సీతారామయ్య అట్లా అట్లా జరిగి, ముందు సీట్లోకి పోయి కూర్చున్నాడు. అతని పక్కనే ఫుల్ సూట్లో ఉన్న ఓ వ్యక్తి సీతారామయ్యను పరీక్షగా చూడసాగాడు. సీతారామయ్య దృష్టి ఎదురుగా ఉన్న ఫోటోపై పడింది. అది పోలీసుశాఖ వాళ్లు ప్రకటించిన జేబుదొంగల తాలూకు ఫోటో. చూసినదాన్ని చూసినట్టు వదిలేరకం కాదు సీతారామయ్య. అదేదో సగం అర్థమయీ కాకుండా ఉంది. పక్కనే కూర్చున్నాయనని పచ్చి తెలుగులోనే అడిగేసాడు.

“ఏమప్పా వాళ్ళంతా దొంగముండవాళ్లు. జేబులు దా కత్తిరిస్తురు. నీవుదా నిండా భద్రంగా ఉండుమీ” అని, పక్క వ్యక్తి వచ్చీరాని తెలుగులో మొదలుబెట్టాడు. అతని మాటల ధోరణిలో మునిగిపోయాడు. మద్రాసులో తనేమేమి చూసిందీ, ఇంకా ఏమేమి చూడాలనుకుంటున్నాడో ఏకరువు పెట్టి అతనికి చెప్పడం సాగించాడు.

ఇంతలో బస్సు సెంట్రల్లో ఆగింది. పక్కన కూర్చున్న వ్యక్తీ, ఇంకా నలుగురైదుగురు దిగిపోయారు. సీతారామయ్య దృష్టి దొంగవాళ్ళ ఫోటో వైపు పడింది. పక్కజేబు దగ్గరకు అతని చేయి అనుకోకుండా పోయింది. గుండెలు 'ఢాం' మన్నాయి. రెండు జేబులూ ఆత్రంగా తడిమి చూసుకున్నాడు. ఇంకెక్కడ పర్సు! అమ్మబాబోయ్! మనీబాక్సు పోయింది!

'నాయాల డబ్బు కొట్టేసాడు.' కదులుతున్న బస్సులో నుంచి ఒక్క దూకు దూకాడు సీతారామయ్య. సెంట్రలూ, మూరు మార్కెటూ కలగాపులగంగా తిరిగి కనిపించిన వాళ్ళకు తన గోడు చెప్పుకుంటూ పారిస్ కార్నరుకు చేరాడు. పర్సు కొట్టేసిన వాడు తనకు కనబడతాడనే ఆశ పాపం.

సీతారామయ్య హైకోర్టు ముందుకు చేరుకునేసరికి, అతని ముందో పదిమంది చేరి, తలో విధంగా అడగడం సాగించారు.. పర్సు పోయిన వివరాల గురించి! వాళ్ళు అడుగుతున్నది తెలియక బిక్కచచ్చి నుంచున్నాడు సీతారామయ్య.

అందులో ఒకాయన "నమ్మల్ది తెలుగుదా! చెప్పూమీయనకు తెలిసి పూడ్సునూ! ఎక్కడ దా ఉంచితివీ పర్సూ?" అని అడిగాడు.

సీతారామయ్య కళ్ళు పెద్దవి చేసుకొని ఖాళీ జేబు చూపించాడు.

"ఆడా? ముట్టాలీతనం. అక్కడదా ఎప్పిడీ పెట్టివీ? ఇక్కడ ఉండేదిదా దొంగపిల్లకాయలు?"

"ఏ బస్సులో పూడిస్తివీ?" ఇంకొకడు అడిగాడు.

"ఓస్ నీదంతా వో గోల! ఎవడో డబ్బు గొట్టేస్తే యిడిసిపెట్టానంటావ్!" సీతారామయ్య విసుగ్గా కసురుకున్నాడు.

"ఏమప్పా, ఏ బస్సులో పోతివీ?" మళ్ళీ అడిగాడు ఆ అరవ తెలుగాయన. బస్సు నెంబరు తెలిస్తే పర్సు దొరికేటట్టు.

బస్సు సంగతి ఎత్తగానే బస్సులో పారేసుకున్న డబ్బు సంగతి అటుంచి, అందులో వదిలేసిన భార్య సంగతి గుర్తొచ్చింది సీతారామయ్యకు. ఇక ఏడుపే తక్కువ. అచ్చమ్మ ఏమైపోయిందో ఏమో?

రెండో బస్సులో కోడంబాకం వెళ్దామంటే, జేబులో కాణీ కూడా లేదే! తెలుగువాళ్లలా ఉన్నవాళ్లతో ఆ సంగతి చెప్పుకొని, కొద్దిగా సహాయం చేయమని అడిగాడు. అంతే... డబ్బు మాట అడిగాడో లేదో ఎక్కడి వాళ్ళక్కడకు దూసుకుపోయారు.

"పోడా దొంగ పిల్లకాయా, నీ మాదిరి ఎత్తినో పేరు సూస్తిని. సుమ్మ పర్సు పోయిందని దుడ్డు అడుగుతురు" అని సీతారామయ్య ముఖానే అనేసి, అంతవరకూ ఆప్తుడుగా ఉన్న అతను కూడా వెళ్లిపోయాడు.

ఆరోజు సీతారామయ్య పడ్డ అవస్థ చెప్పుకుంటే తీరేది కాదు. మూడోవంతు తెలుగువాళ్లున్న ఆ పట్నంలో సీతారామయ్య ఒక మాటకు నోచుకోలేదు. 'నా' అన్న మనిషి కరువైపోయాడు.

ఎలాగో కన్నయ్యశెట్టి సత్రం దగ్గరకు చేరుకొని, ముసలమ్మ చేతినున్న మురుగులు తీసుకొని, సగానికి సగం ధరకు 'చైనా బజారు'లో అమ్ముకొని, పెళ్లాన్ని వెతికే పనిలో ఊరంతా గాలించాడు. రాత్రి పదిగంటల దాకా తిరిగినా అచ్చమ్మ జాడ తెలియలేదు. కూవం రివర్ దగ్గరకు వచ్చేసరికి అందులో దూకి చద్దామనిపించింది సీతారామయ్యకు! సత్రంలో ఎదురుచూస్తున్న ముసలి తల్లీ, కొడుకూ గుర్తొచ్చి ఇంటికి వెళ్ళాడు.

భార్య గురించిన ఊహలు పరిపరి విధాలుగా పోయినై సీతారామయ్య బుర్రలో! ఏమైపోయి ఉంటుందో ఏమో? ఆడది... అందులో ఒంటరిగా ఈ పట్టణంలో! అలా ఆలోచించుకుంటూంటే సీతారామయ్య గుండెలు బరువెక్కి పోయినై.

ఆ రాత్రి పెళ్లాన్ని తలంచుకుంటూ సీతారామయ్య మద్రాసునీ, మద్రాసులో ఉన్న జనాల్నీ ఎన్ని శాపనార్థాలు పెట్టాడో మరి.

తెల్లవారి ఉదయాన్నే అచ్చమ్మ సత్రం దగ్గరకి తిరిగొచ్చింది. పెళ్లాన్ని చూడగానే సీతారామయ్యకు ప్రాణం లేచొచ్చింది. భర్తను చుట్టుకొని బావురుమని ఏడ్చింది అచ్చమ్మ. గతరాత్రి తనకు జరిగినదంతా ఏకరువు పెట్టి చెప్పింది. అందులో ఎంతవరకూ నమ్మాలో అర్థం కాలేదు సీతారామయ్యకు.

'ఛూత్ ఇక్కడ ఓ క్షణం కూడా ఉండకూడదని' కుటుంబంతో సహా ఇంటికి ప్రయాణమైనాడు సీతారామయ్య ఎక్స్‌ప్రెస్‌లో!

వాళ్లూరు పోగానే ముందు 'మద్రాసు మనదే సంఘం' వాళ్ళ ఆఫీసుకు పోయి, ఆఫీసు ముందు పెట్టిన తడికను... ఆరోజు తను భుజానేసుకొని తిరిగిన తడికను... ఎత్తుకుపోయి, నల్లచెరువులో పారేస్తూ ఇలా అనుకున్నాడు. "యదవ నాయాల మద్రాసు! ఎవుడిక్కాలహేస్!"

*('వనశ్రీ' కలం పేరుతో వ్రాసిన ఈ కథ. "తెలుగు స్వతంత్ర" వారపత్రిక 24.4.1953 నుంచి పునర్ముద్రణ)*

# కథామంజరి
# పాఠకమహాశయులకు
# మనవి!

ప్రతినెలా కథామంజరి సంచిక నమోదు చేసుకున్న పాఠకుల ఇమెయిల్స్‌కి నేరుగా చేరడమే కాకుండా, ఇతర సాంఘికమాధ్యమాలు, కథామంజరి వెబ్‌సైట్ ద్వారా కూడా ఎంతో మందికి సంచిక చేరుతోంది.

అలాగే పాఠకులు కూడా వారివారి బంధుమిత్రులకు ఈ మాధ్యమాల ద్వారా పంపుతున్నారు. ఈ రోజు కథామంజరి దేశ, విదేశాల్లో ఎక్కువ మందికి ఏదో విధంగా చేరుతోంది. పాఠకుల సంఖ్య పెరగడం సంతోషమే! అయితే, సాంకేతికంగా పత్రిక నిర్వహణకు, కొన్ని వెసులుబాట్లకు .. సంచికను చదివే పాఠకుల సంఖ్య తెలుసుకోవడం అసాధ్యమైన పనే! అంచేత మా మనవి ఏమిటంటే.. కథామంజరి చదివే పాఠకులు ప్రతి ఒక్కరు ఇమెయిల్ నమోదు చేసుకోవలసినదిగా కోరుతున్నాం. మీరు ఇమెయిల్ నమోదు చేసుకోడానికి ఈ లింక్‌ని క్లిక్ చేయండి.

| వార్షిక చందా రూ.200/- | ఉచిత సంచిక కోసం |
|---|---|
| *https://imjo.in/ebrJuh* | *https://zcmp.in/K93t* |

పత్రికకు చందా ఇచ్చికమే ఐనా చందా కట్టినా, కట్టలేకపోయినా సరే, పత్రిక అందరికి అందుబాటులోనే ఉంటుంది.

**- కథామంజరి బృందం -**